భూదాన్ భూములపై కన్ను

- నకిలీ సంతకాలతో పెత్తందార్లు, బినామీల పాగా
- బోర్డు రద్దు కాలంలో పుట్టుకొచ్చిన పత్రాలు
- మండలాల వారీగా లెక్కలు తేల్చే పనిలో రెవిన్యూ

● లోపలి పేజీలో..●

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 135 | విజయవాడ, సోమవారం 18 డిసెంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 18 December 2023 | Rs



సింగ్ ఈజ్ కింగ్

- అర్షదీప్ దెబ్బకు సఫారీ విలవిల
- తొలి వన్డేలో భారత్ ఏకపక్ష విజయం

● లోపలి పేజీలో..●



ఉద్యమ నేతకు

కన్నీటి వీడ్కోలు

అధికార లాంఛనాలతో సాబ్జీ అంత్యక్రియలు

నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రజాసంఘాల నేతలు

భారీగా తరలొచ్చిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, సామాన్య ప్రజానీకం

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

ఉద్యమనేత, ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ (57) అంత్యక్రియలు ఏలూరులో ప్రభుత్వ అధికార లాంఛనాలతో ఆదివారం జరిగాయి. ఉద్యమ బిడ్డకు కడసారి వీడ్కోలు చెబుతూ జనం కన్నీటిపర్యంతమయ్యారు. ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు, సామాన్య ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సాబ్జీ భౌతికకాయానికి నివాళులుర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ నెల 15న పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం చెరుకువాడ వద్ద రోడ్డు ప్రమాదంలో సాబ్జీ మృతి చెందిన విషయం విదితమే. అదేరోజు భీమవరం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం భౌతికకాయాన్ని ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. ఆయన కుమార్తె ఆస్రిఫా అమెరికా నుంచి రావడంతో సాబ్జీ భౌతికకాయాన్ని ఉదయం తొమ్మిది గంటలకు ఆ ఆస్పత్రి నుంచి ఏలూరులోని యుటిఎఫ్ కార్యాలయానికి తరలించారు. అక్కడ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, ఏలూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, యుటిఎఫ్ రాష్ట్ర, అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్, నాయకులు బాబురెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజల సందర్శనార్థం ఇండోర్ స్టేడియంకు తరలించారు. అక్కడ సాబ్జీని కడసారి చూసేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు బారులు తీరారు. భార్య సుభాని, కుమారుడు ఆజాద్, కుమార్తె ఆస్రిఫ్ విలపిస్తున్న తీరు అందరినీ కలిచివేసింది. సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఆర్.రవికుమార్, అధ్యక్షుడు అలీ

మిగతా 2లో

జిందాల్ జొరబడుతోంది!

స్టీల్ ప్రై'వేటు'కు మరో కుట్ర

- బ్లాస్ట్ ఫర్నేస్ అప్పగింతకు రహస్య ఒప్పందం
- ఢిల్లీలో మూడు రోజులుగా యాజమాన్యాల తిష్ట
- అడుగుపెట్టనివ్వబోమన్న కార్మికులు



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ఉక్కుపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు సాగిస్తూనేవుంది. ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు ఐక్యవేదికగా ఏర్పడి 'ఉక్కు' పరిరక్షణకు పోరాడుతున్న నేపథ్యంలో దానిని ముక్కలుముక్కలు చేసి తెగనమ్మేందుకు మోడీ సర్కార్ ప్రయత్నిస్తోంది. తాజాగా బ్లాస్ట్ ఫర్నేస్ - 3 నిర్వహణ బాధ్యతలను జిందాల్ స్టీల్ సంస్థకు కట్టబెట్టేందుకు సిద్ధమైంది. ఇందుకోసం ఆ సంస్థతో ఎంఒయు కుదుర్చుకోవాలని నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రయివేటీకరణపై కేంద్రం పునరాలోచిస్తోందంటూ స్థానిక నేతల ప్రకటనలతో ఒకవైపు నాటకాన్ని కొనసాగిస్తూ మరోవైపు విశాఖ ఉక్కును ముక్కలు చేసి ప్రయివేటుకు కట్టబెట్టేస్తోందని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. జిందాల్‌ను స్టీల్ ప్లాంట్‌లోకి అడుగుపెట్టనీయబోమని అంటున్నాయి. ఉక్కు ప్రయివేటీకరణపై సమీక్షిస్తామంటూ రాజ్యసభ సభ్యుడు జివిఎల్ నరసింహారావు వంటి నేతలతో ఇక్కడ అసత్యాలు వల్లెవేయిస్తూ మరోవైపు జిందాల్‌తో రహస్య ఒప్పందం చేసుకోవడం బిజెపి ఆడుతున్న నాటకానికి అద్దం పడుతోందని కార్మికులు విమర్శిస్తున్నారు. జనసేన కూడా విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తున్నట్లు చెబుతూనే..దానికారణమైన బిజెపి గళాన్నే వినిపిస్తుండటం దుర్మార్గమని వాపోతున్నారు.

విశ్వసనీయ సమాచారం ప్రకారం..విశాఖ ఉక్కును ప్రయివేటీకరించేందుకు ఈ నెల 16న విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని, జిందాల్ యాజమాన్యాన్ని కేంద్ర పెద్దలు ఢిల్లీకి రప్పించుకుని రహస్య మంతనాలు జరిపారు. బ్లాస్ట్ ఫర్నేస్-3 నడిపేందుకు జిందాల్ స్టీల్‌తో ఎంఒయు చేసుకోవాలని నిర్ణయించారు. గత మూడు రోజులుగా ఢిల్లీలోనే ప్లాంట్, జిందాల్ యాజమాన్యాలు తిష్టవేశాయి. ప్లాంట్‌ను నడిపేందుకు అన్ని వ్యవహారాలనూ చక్కబెట్టాలని జిందాల్‌ను కేంద్రం కోరింది. ఈ మంతనాల్లో కేంద్ర స్టీల్ మంత్రిత్వ శాఖ ముఖ్య ప్రతినిధులూ పాల్గొన్నారు. కేంద్ర పెద్దలు, జిందాల్ యాజమాన్యంతో భేటీ అనంతరం ఢిల్లీ నుంచే స్టీల్ సిఎండి, కొందరు డైరెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి బెంగళూరు, విశాఖలోని డైరెక్టర్లను భాగస్వామ్యం చేస్తూ అక్కడి విషయాలు తెలియజేశారు. డిసెంబరు 2న జరిగిన కార్మికులు, స్టీల్‌ప్లాంట్ యాజమాన్య చర్చల్లో జిందాల్ మన ప్లాంట్‌లోకి రాదంటూ సిఎండి చెప్పారు. తాజా పరిణామాలతో సిఎండి అబద్ధాలు చెప్పి మోసగించారంటూ కార్మికులు మండిపడుతున్నారు. వెయ్యి రోజులకుపైగా స్టీల్‌ప్లాంట్ కార్మికులు, విశాఖలోని అన్ని తరగతుల ప్రజానీకం పెద్ద ఎత్తున పోరాడుతూ ప్లాంట్‌ను నడిపేందుకు సహకరించాలని మొరపెట్టుకుంటున్నా కేంద్రంలోని బిజెపి సర్కార్ తన ప్రయత్నాలను మానడం లేదు. ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ జె.అయోధ్యారాం హెచ్చరించారు. ప్లాంట్ అమ్మకం ఆగిపోయిందంటూ, అన్ని సమస్యలూ కేంద్రం పరిష్కరించనుందంటూ బిజెపి నాయకులు జివిఎల్ నరసింహారావు, ఆ పార్టీతో అంటకాగుతున్న జనసేనాని పవన్ కల్యాణ్ ఇటీవల విశాఖ సభలో ప్రజానీకాన్ని వంచించే ప్రయత్నం చేశారు.

నోరుమెదపని రాష్ట్ర ప్రభుత్వం

కేంద్రం కుట్రలను ఎదిరించేందుకు కార్మికవర్గం పోరాడుతున్నా వైసిపి, రాష్ట్ర ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి నోరుమెదపకపోవడం ఏమిటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. జిందాల్‌తో గడిచిన రెండు రోజులుగా ఏం చర్చలు జరిగాయో బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

చర్చలు నిజమే!
ధ్రువీకరించిన స్టీల్ పిఆర్ఒ

ఢిల్లీ స్థాయిలో స్టీల్ యాజమాన్యం, జిందాల్‌కు మధ్య చర్చలు జరగాయని స్టీల్ ప్లాంట్ పిఆర్ఒ సెక్షన్ హెచ్ఒడి ఆర్‌పి శర్మ ఆదివారం రాత్రి ధ్రువీకరించారు. ఏం జరిగిందో యాజమాన్యం చెబుతుందని, తనకు తెలియదని చెప్పారు.

నేటితో 'యువగళం' ముగింపు

- 225 రోజుల పాటు సాగిన లోకేష్ పాదయాత్ర
- 20న విజయనగరంలో విజయోత్సవ సభ

● లోపలి పేజీలో..●

హాజరుకు ఫేస్ ఆథంటికేషన్

- 'ఉపాధి హామీ'లో మోడీ సర్కారు యత్నాలు
- జనవరి 1 నుండి అమలు చేయాలన్న కేంద్రం

● లోపలి పేజీలో..●

కదులుతున్న బస్సులో.. బాలికపై సామూహిక అత్యాచారం



బాపట్ల జిల్లా చీరాలలో ఆయమ్మకు జీతాలు పెంచాలని కోరుతున్న చిన్నారి

అంగన్‌వాడీలకు విశాల మద్దతు

- సమ్మె శిబిరాల్లో చిన్నారులు, తల్లిదండ్రులు

● లోపలి పేజీలో..●

అమరావతినే రాజధానిగా కొనసాగించాలి

- మూడు రాజధానుల పేరుతో రాష్ట్రం అధోగతి : సిపిఎం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజధానిగా అమరావతినే కొనసాగించాలని సిపిఎం రాష్ట్ర కమిటి డిమాండ్ చేసింది. రాజధాని అమరావతి పరిరక్షణ కోసం పోరాటం ప్రారంభించి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ప్రత్యక్ష పోరాటంలో వున్న రైతులకు, కూలీలకు, రాజధాని బాధితులకు సిపిఎం రాష్ట్ర కమిటి అభినందనలు తెలుపుతూ ప్రకటన విడుదల చేసింది. రాజధాని అమరావతి పోరాటానికి సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించింది. మూడు రాజధానుల పేరుతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని, రైతులను వీధుల పాలు చేసిందని పేర్కొంది. ఇప్పటికైనా చేసిన తప్పును సరిదిద్దుకొని అమరావతినే రాజధానిగా ప్రకటించి అభివద్ధి చేయాలని డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వము కూడా రాజధాని విషయంలోనూ నాటకాలాడుతూ రైతుల భవిష్యత్తుతో చెలగాటమాడుతూ రాష్ట్రానికి ద్రోహం చేసిందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ తప్పుడు విధానాలకు, బిజెపి విద్రోహానికి వ్యతిరేకంగా ప్రజలంతా అమరావతి పోరాటానికి అండగా నిలవాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

అమరావతి రైతుల పోరాటం చారిత్రాత్మకం : సిపిఐ

రాష్ట్ర రాజధాని అమరావతి అంశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా నాలుగేళ్లపాటు రైతులు సాగించిన పోరాటం చారిత్రాత్మకమైన ఉద్యమమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా అమరావతి రాజధాని ప్రాంత రైతులు, మహిళలు పెద్ద ఎత్తున చేపట్టిన ఉద్యమాలపై ఉక్కుపాదంతో అణిచివేయాలని నిర్బంధాలను ప్రయోగించినా ధైర్యంగా ఎదుర్కొన్నారని తెలిపారు. ఇప్పటికైనా జగన్‌మోహన్‌రెడ్డి అమరావతి ఉద్యమాన్ని గౌరవించి రాజధానిగా గుర్తించాలని కోరారు.

ప్రకాష్‌రాజ్‌కు క్లీన్‌చిట్

- పొంజి స్కామ్‌తో ఆయనకు సంబంధం లేదన్న ఇడి

న్యూఢిల్లీ : తమిళనాడులోని ప్రణవి జ్యువెల్లర్స్‌కు సంబంధమున్న రూ.100 కోట్ల విలువైన పొంజి స్కామ్ కేసులో ప్రముఖ నటుడు ప్రకాష్‌రాజ్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) క్లీన్‌చిట్ ఇచ్చింది. ఈ కేసుతో ఆయనకు సంబంధం లేదని వెల్లడించింది. ప్రణవ్ జ్యువెల్లర్స్‌కు ప్రకాశ్‌రాజ్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించారు. ఇడి క్లీన్‌చిట్ అనంతరం నటుడు ప్రకాష్‌రాజ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "తమిళం అర్థం కానివారి కోసం బ్రేకింగ్ న్యూస్. దర్యాప్తు బృందం అధికారిక ప్రకటన. తమిళనాడు ప్రణవ్ జ్యువెల్లర్స్‌కు చెందిన పొంజి స్కామ్‌లో ఆయనకు సంబంధం లేదు. నన్ను నమ్మి, నా వెంట నిలబడ్డ ప్రతి ఒక్కరికి నా ధన్యవాదాలు" అంటూ సత్యమేవజయతే, జస్ట్ ఆస్కింగ్ అనే హ్యాష్‌ట్యాగ్‌లతో ఆయన తన పోస్ట్‌ను ముగించారు. తన ఎక్స్ పోస్ట్‌కు తమిళ వార్తా ఛానెల్‌కు చెందిన ఒక క్లిప్‌ను ఆయన జోడించారు.



హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ నివాసానికి వెళ్లి ఆయనతో చర్చలు జరుపుతున్న చంద్రబాబు

పవన్‌తో చంద్రబాబు భేటీ

పొత్తు, తాజా రాజకీయ పరిస్థితులపై చర్చ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఆదివారం సాయంత్రం జనసేన అధినేత పవన కళ్యాణ్‌తో ఆయన నివాసంలో సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ఈ మేరకు ఇరుపార్టీలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాయి. 'జనసేన అధ్యక్షులు పవన్ నివాసానికి టిడిపి అధినేత చంద్రబాబు వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు, తాజా పరిస్థితులుపై చర్చించారు' అని టిడిపి పోస్టు చేసింది. చంద్రబాబు, పవన్ మధ్య సుదీర్ఘంగా చర్చలు సాగాయని జనసేన నేత నాదెండ్ల మనోహర్ తెలిపారు.

ఇరుపార్టీల మధ్య పొత్తు పటిష్టత గురించి, ఉమ్మడి మేనిఫెస్టోపై సమాలోచనలు జరిపారని, ఏపిలో తాజా రాజకీయ పరిస్థితులు, వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ దిశగా చర్చలు జరిపినట్లు ఆయన పేర్కొన్నారు. 2014 ఎన్నికలకు ముందు పవన్ ఇంటికి చంద్రబాబు వెళ్లారు. దాదాపు పదేళ్ల తర్వాత మరోసారి ఆయన నివాసానికి వెళ్లి భేటీ కావడం విశేషం.



సోలార్ ఇండస్ట్రీస్ ఇండియా ప్రవేశ ద్వారం మూసివేయడంతో బయట ఆందోళన చేస్తున్న మృతుల బంధువులు, స్థానికులు

నాగపూర్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

- ఆరుగురు మహిళలుసహా
- తొమ్మిదిమంది సజీవ దహనం

నాగపూర్ : మహారాష్ట్రలోని నాగపూర్ జిల్లాలో పేలుడు పదార్థాల తయారీ కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరుగురు మహిళలతో సహా తొమ్మిది మంది కార్మికులు సజీవ దహనమయ్యారు. చక్దోహ గ్రామంలో ఉన్న సోలార్ ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్ బిల్డింగ్ నంబర్ హెచ్‌ఆర్-సిపిసిహెచ్-2 (మిక్సింగ్, మెల్టింగ్, కాస్టింగ్)లో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించిందని ఆ సంస్థ సీనియర్ జనరల్ మేనేజర్ ఆశీష్ శ్రీవాస్తవ ఒక ప్రకటనలో తెలిపారు. బొగ్గు గనుల్లో ఉపయోగించే బూస్టర్లను ఉత్పత్తి చేసే భవనంలో ఈ సంఘటన జరిగిందని, తొమ్మిది మంది అక్కడికక్కడే మరణించారని పేర్కొన్నారు. గాయపడిన కార్మికులను ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. యువరాజ్ చారోడ్, ఒమేశ్వర్ మచ్చిర్కే, మితా ఉయికే, ఆర్తి సహారే, శ్వేతాలి మార్బాటే, పుష్పా మనాపురే, భాగ్యశ్రీ లోనారే, రుమితా ఉయికే, మౌసం పాట్లేగా మరణించినట్లు అధికారులు ప్రకటించారు. ప్రమాద సమయంలో మొత్తం 12 మంది కార్మికులు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. గాయపడిన మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ కంపెనీలో సాయుధ బలగాల కోసం డ్రోన్లు, పేలుడు పదార్థాలను తయారు చేస్తారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నిర్ణయించినట్లు ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. నష్టాన్ని అంచనా వేస్తున్నామని, పేలుడుకు గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నామని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ హర్ష్ పొద్దార్ తెలిపారు.

సజ్జన్ జిందాల్‌పై అత్యాచారం కేసు

ముంబయి : ప్రముఖ పారిశ్రామిక వేత్త, జెఎస్‌డబ్ల్యు గ్రూప్ ఛైర్మన్, ఎమ్‌డి సజ్జన్ జిందాల్‌పై అత్యాచార ఆరోపణలతో ఎఫ్ఐఆర్ నమోదైంది. 30 ఏళ్ల మహిళ ఫిర్యాదు మేరకు ముంబయిలోని బంద్రా కుర్లా కాంప్లెక్ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 13న కేసు నమోదు చేసినట్లు, దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం 2021 అక్టోబర్ 8న దుబాయ్‌లో ఒక ఐపిఎల్ మ్యాచ్ సందర్భంగా బాధిత మహిళ తొలిసారిగా జిందాల్‌ను కలిశారు. ఆ తరువాత ఫోన్‌లో మాట్లాడుకోవడం, వ్యక్తిగతంగా కలుసుకోవడం చేసేవారు. వివాహం చేసుకుంటానని జిందాల్ హామీ ఇచ్చారని ఆమె పేర్కొన్నారు. 2022 జనవరిలో బంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని ప్రధాన కార్యాలయం పెంట్‌హౌస్‌లో తనపై అత్యాచారం జరిగినట్లు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పోలీసులకు ఫిర్యాదు చేశానని, వారు నిర్లక్ష్యం వహించడంతో హైకోర్టును ఆశ్రయించానని ఆమె పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలతో జిందాల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. 64 ఏళ్ల జిందాల్ జెఎస్‌డబ్ల్యు గ్రూప్‌నకు నేతృత్వం వహించడంతోపాటు ఉక్కు, విద్యుత్, మౌలిక వసతులు, సిమెంట్, పెయింట్స్, ఇ-కామర్స్, స్పోర్ట్స్ వంటి విభిన్న రంగాల వ్యాపారాల్లో ఉన్నారు.

భూహక్కు చట్టం రద్దు

- ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ డిమాండ్
- చివరి రోజు ఆరు తీర్మానాలు ఆమోదం



కర్నూలు మండలం ఉల్చాలలో పంటలను పరిశీలిస్తున్న ఎఐకెఎస్ నాయకులు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

2022 భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశం డిమాండ్ చేసింది. కర్నూలులోని ఎన్.శంకరయ్య నగర్ వేదికగా గత మూడు రోజులుగా జరిగిన ఈ సమావేశాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు ఆరు తీర్మానాలకు ఆమోదించారు. ఆర్టికల్ 370 రద్దును సుప్రీం సమర్థించడం సరైంది కాదని, ఆర్టికల్ 370ను కొనసాగించాలని, సమాఖ్య వ్యవస్థను కాపాడాలని, అమెరికా వ్యవసాయ వ్యాపారుల కోసం రైతులకు నష్టం కలిగించే ప్రభుత్వ విధానాలను ఖండించాలని, ఆయిల్ పామ్ ప్లాంటేషన్ మిషన్ సరైంది కాదని, పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండించాలని కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. ఈ వివరాలను ఎఐకెఎస్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలపై 26 రాష్ట్రాల ప్రతినిధులు సమావేశాల్లో చర్చించారని తెలిపారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారన్నారు. రైతుల అప్పులు, ఆత్మహత్యలు పెరిగాయని, దేశంలో లక్షమందికిపైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. పెట్టుబడి ఖర్చులు కూడా తిరిగిరాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా మోడీ సర్కార్ ఉలుకు పలుకు లేదని విమర్శించారు. పైగా విద్యుత్ సంస్కరణల పేరుతో వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్ల విధానం తీసుకొచ్చిందన్నారు. దీనిని ఏ రాష్ట్రమూ అమలు చేయకపోయినా ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తుండడం శోచనీయమన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ రైతు వ్యతిరేక ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని, వాటికి గుణపాఠం నేర్పాలని అన్నారు. ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా మాట్లాడుతూ రైతుల రుణాలు మాఫీ చేయడం లేదని, అదాని, అంబానీలకు, కేవలం వంద కుటుంబాలకు మాత్రం మోడీ ప్రభుత్వం రూ.50 లక్షల కోట్ల దోచి పెడుతోందన్నారు. కార్పొరేట్లకు ఏజెంట్‌గా మారి విద్వేష రాజకీయాలు నడుపుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 'మోడీ హటావో... దేశ్ కి బచావో' నినాదంతో గ్రామస్థాయి నుండి దేశ స్థాయి వరకు వివిధ రూపాల్లో ప్రచారాలు నిర్వహించి, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మరో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు.

నష్టపోయిన పంటల పరిశీలన

కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో నష్టపోయిన పత్తి, మిరప పంటలను ఎఐకెఎస్ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఎఐకెఎస్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ మాట్లాడుతూ రైతులు ఐక్యమై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా పోరాటాలు సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ ఆర్థిక కార్యదర్శి కృష్ణప్రసాద్, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ పాల్గొన్నారు.

సులియారీలో పాఠశాల, ఆసుపత్రి నిర్వహణకు డిఎవి, హెచ్‌ఎల్‌ఎల్‌తో ఒప్పందం

- ఎపిఎండిసి వైస్ ఛైర్మన్ వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మధ్యప్రదేశ్‌లోని సులియారీలో ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎపిఎండిసి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బొగ్గుగనిలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం అనేక చర్యలు చేపట్టినట్లు ఆ సంస్థ వైఎస్ ఛైర్మన్ విజి వెంకటరెడ్డి తెలిపారు. కార్మిక కుటుంబాల సంక్షేమ కోసం ఎపిఎండిసి నెలకొల్పిన పాఠశాల, ఆసుపత్రి నిర్వహణ కోసం దయానంద్ ఆంగ్లో వేదిక్ (డిఎవి) సొసైటీ, హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్ కేర్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. సులియారీ ప్రాంతంలో 1450 హెకార్ల విస్తీర్ణంలో ఎపిఎండిసి నిర్వహిస్తున్న బొగ్గుగని ద్వారా ఏటా 5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. థర్మల్ విద్యుదుత్పత్తికి ఈ బొగ్గు వినియోగించడం ద్వారా 60 లక్షల కుటుంబాల్లో వెలుగులు నింపుతోందన్నారు. సులియారీ బొగ్గు క్షేత్రం పరిసర ప్రాంతాల్లోని స్థానిక ప్రజానీకం కోసం కూడా ఎపిఎండిసి అనేక సంక్షేమ కార్యాక్రమాలు చేపడుతోందని తెలిపారు. పునరావాస కాలనీలు, రహదారులు, కాలువలు, రక్షిత మంచినీటి సరఫరా, పాఠశాలలు, ఆసుపత్రి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎండిసి సలహాదారు డిఎల్ఆర్ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ బిపిన్ కుమార్, రామన్ నారాయణ్, డిఎవి, హెచ్‌ఎల్‌ఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

సుప్రీం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓట్ల తొలగింపు

- జిల్లా అధికారులకు సిఎఫ్‌డి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఓట్ల తొలగింపు ప్రక్రియను సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును, మార్గదర్శకాలకు అనుగుణంగానే చేపట్టాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ (సిఎఫ్‌డి) సంస్థ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల పూర్వ ప్రధాన అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం జిల్లా కలెక్టర్లకు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు బహిరంగ లేఖ రాశారు. అనూప్ బరన్‌వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో ఓటుహక్కును ప్రాథమికహక్కుగా స్పష్టీకరించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ తీర్పును అవగాహన చేసుకుని ఓట్ల తొలగింపు విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో ఓట్ల తొలగింపు కోసం ఫారం7 ప్రకారం వచ్చిన దరఖాస్తులను పరిశీలించేటప్పుడు ఓటరు ప్రాథమిక హక్కుకు భంగం కలుగకుండా చూడాలన్నారు. సరైన ధ్రువీకరణ, పత్రాల పరిశీలన ద్వారా మాత్రమే ఓటర్ల తొలగింపు చేయాల్సి వుంటుందని, అలా కానిపక్షంలో అందుకు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులే బాధ్యులు అవుతారని తెలిపారు.

భూదాన్ భూములపై కన్ను

- నకిలీ సంతకాలతో పెత్తందార్లు, బినామీల పాగా
- బోర్డు రద్దు కాలంలో పుట్టుకొచ్చిన పత్రాలు
- మండలాల వారీగా లెక్కలు తేల్చే పనిలో రెవిన్యూ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూ మాఫియా, పెత్తందార్ల కన్ను భూదాన్ యజ్ఞ బోర్డు భూములపై పడింది. విలువైన భూములను చట్టంలోని లొసుగులను ఉపయోగించుకుని దక్కించుకునేందుకు కొందరు పెద్దలు వేగంగా పావులు కదుపుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో 2012లో విశాఖకు చెందిన భూదాన్ భూముల విషయంలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రాష్ట్ర విభజన జరిగింన వెంటనే భూదాన్ బో ర్డును ప్రభుత్వం రద్దు చేసింది. బోర్డు రద్దయిన కాలంలో జారీ చేసినట్లు నకిలీ సంతకాలతో కూడిన పత్రాలతో ఆయా భూములను దక్కించుకునేందుకు ప్రొసీడింగ్‌లతో దరఖాస్తులు చేసుకునే వారి సంఖ్య ఇటీవల పెరిగింది. రెవిన్యూ శాఖ అప్రమత్తమైంది. భూదాన్ యజ్ఞబోర్డును ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కొందరు వ్యక్తులు రెవిన్యూ కార్యాలయాలకు దరకాస్తులు చేసుకుంటున్న విషయాన్ని భూదాన్ బోర్డు దృష్టికి పలువురు తీసుకొచ్చారు. 18 మంది వ్యక్తులు భూదాన్ భూములు తమవేనంటూ క్లైయిమ్ చేసుకునేందుకు రెవిన్యూ యంత్రాంగానికి దరఖాస్తులు అందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సిసిఎల్‌ఎ అన్ని జిల్లాల కలెక్టర్లకు భూదాన్ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉత్తర్వులు జారీచేశారు. అంతే కాకుండా కేటాయించిన భూమి రద్దు ప్రక్రియ, కొత్త కేటాయింపుదారులకు కేటాయించిన భూదాన్ భూమి మంజూరు ప్రక్రియ, భూదాన్ భూములు నోటిఫై చేసినప్పటికీ గ్రామాల్లో భూదాన్ భూములు అందుబాటులో లేదని నిర్ధారించడం లాంటి చర్యలపై నివేదికలు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ సందర్భంగా నకిలీ సంతకాలు గల ప్రొసీడింగ్స్‌తో కూడిన దరఖాస్తులు చేసిన వారు ఉంటే పూర్తి స్థాయిలో విచారణ జరిపిన అనంతరం ఆయా వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడంతో పాటు చట్టాన్ని అమలు చేయాలని రెవిన్యూ ఉన్నతాధికారులు కలెక్టర్లకు సూచించారు. ఈ ప్రక్రియ ముగిసే వరకు భూదాన్ భూములకు సంబంధించి ఆయా భూ యజమానుల పేర్లు రికార్డుల్లో (వెబ్‌ల్యాండ్)లో ఎక్కించకుండా మండల తహసీల్దార్లను ప్రభుత్వం ఆదేశించడంతో పాటు అప్రమత్తమంగా ఉండాలని కూడా క్షేత్రస్థాయి అధికారులకు ప్రభుత్వం సూచించింది. ఒకవేళ నిజమైన వ్యక్తులే అని నిర్ధారించుకున్నప్పటికీ న్యాయపరమైన అంశాలను పరిశీలించడంతో పాటు ఉన్నతాధికారులతో సంప్రదించిన తర్వాతనే ఓ అభిప్రాయం తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

లెక్కలు తేల్చే పనిలో రెవిన్యూ

భూదాన్ యజ్ఞ బోర్డుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఏయే జిల్లాలో ఎంత భూమి ఉంది? దాతలు ఇచ్చిన భూమి ప్రస్తుతం అర్హులైన వారి చేతిలో ఉందా? లేదా? ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయిందా? అనే అంశాలను రెవిన్యూశాఖ నిశితంగా పరిశీలిస్తోంది. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఇటీవల కాలం వరకు భూదాన్ యజ్ఞబోర్డు నియామకం జరగలేదు. ఇటీవలనే నూతనం బోర్డును ప్రభుత్వం నియమించింది. ఈనేపథ్యంలో భూముల వివరాలను మండలాల వారీగా గుర్తించి, అర్హుల చేతిలో ఉన్న భూమి ఎంత? అనర్హుల చేతుల్లోకి వెళ్లిన భూమి ఎంత? అర్హులు గ్రామాల్లో లేకుండా బయట ప్రాంతాలకు వెళ్లిన వారి భూములు ప్రస్తుత పరిస్థితి? లాంటి వివరాలు ప్రభుత్వం సేకరిస్తోంది. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 30వేల ఎకరాల భూములు భూదాన్ యజ్ఞ బోర్డు కింద ఉన్నట్లు గుర్తించినట్లు ప్రాథమిక సమాచారం. ఇంకా కొన్ని జిల్లాల నుంచి ఆయా కలెక్టర్లు ప్రభుత్వానికి సమాచారం ఇంకా పంపలేదని తెలిసింది. భూదాన్ భూములు అత్యధికంగా ఉత్తరాంధ్రలో అందులోనూ విశాఖ, విజయనగరం ప్రాంతాల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

భూదాన్ భూములంటే ....

ఆచార్య వినోబాబావే 1951లో ఇచ్చి పిలుపుతో భూస్వాములు, ధనవంతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వినోబాబావేకు ఇచ్చిన భూములే భూదాన్ భూములు. భూదాన్ భూములను అమ్ముకోవడానికి అర్హత ఉండదు. తరతరాలుగా ఆయా భూములను అనుభవించే హక్కు మాత్రమే ఉంటుందని చట్టం చెబుతున్నప్పటికీ ఆచరణలో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి.

రాజధాని లేకుండా నాలుగేళ్లు : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వ చర్యల వల్ల రాష్ట్రానికి రాజధానిగా లేకుండా నాలుగేళ్లు గడిచిపోయిందని టిడిపి అధినేత చంద్రబాబు విమర్శించారు. అమరావతిని నిరాదరణకు గురిచేసి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆయన వాపోయారు. అమరావతి పరిరక్షణ ఉద్యమానికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో చంద్రబాబు స్పందించారు. 'నిలువెల్లా ద్వేషంతో నిండిన, దురాశాపరుడైన సిఎం జగన్ తీసుకున్న విధ్వంసకర నిర్ణయాల వల్ల రాజధాని కోసం భూములిచ్చిన వేలాదిమంది రైతులు రోడ్లపైకి రావాల్సి వచ్చింది' అని ఆయన ఆరోపించారు. మరో మూడు నెలలు ఆగితే జగన్ తీసుకున్న తప్పుడు నిర్ణయాలను సరిదిద్దుతామని తెలిపారు. కాగా 'మూడు ముక్కలాటతో అమరావతిని జగన్ నాశనం చేశారు' అని టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్ మరో ప్రకటనలో విమర్శించారు. వేల కోట్ల రూపాయల విలువైన భవనాలను శిథిలం చేశారని, రోడ్లు మౌలిక సదుపాయాలు ధ్వంసం చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులను హింసించారని ఆరోపించారు.

పెన్షన్ సంస్కరణలకు వ్యతిరేకంగా ఉద్యమం

- జాతీయ పెన్షనర్ల దినోత్సవంలో నేతల పిలుపు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ప్రభుత్వ పెన్షనర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న పెన్షన్ సంస్కరణలకు వ్యతిరేకంగా దేశంలోని అన్ని రంగాల పెన్షనర్లు మరింత ఐక్యంగా ఉద్యమించాలని పలువురు నేతలు కోరారు. జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా ఆదివారం విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షనర్స్ (ఎపిఆర్‌పిఎ) కృష్ణా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఎపిఆర్‌పిఎ రాష్ట్ర గౌరవా ధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్ కుమార్ మాట్లాడుతూ ఇపిఎఫ్ కనీస పెన్షన్ రూ.9 వేలు, కరువు భత్యం కలిపి ఇవ్వాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయిన వారికి ఇచ్చే పెన్షన్ భిక్షకాదని, హక్కని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బిఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. జిఐసిలో ఫామిలీ పెన్షన్ 30 శాతం చేయాలని చేస్తున్న ఆందోళనకు మద్దతు పలికారు. బ్యాంక్, బీమా పెన్షనర్లకు పెన్షన్ అప్‌డేట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అకాల మరణం పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఎపిఆర్‌పిఎ జిల్లా అధ్యక్షులు కె.జీవరత్నం అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎపిఆర్‌పిఎ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎ.శాస్త్రి, ఐసిఇయు నాయకులు జి.కిషోర్ కుమార్, సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, నాయకులు ఎం.వి.సుధాకర్, ఎం.ఎస్.పాత్రుడు, టి.ప్రభుదాస్ పాల్గొన్నారు. అనంతరం సీనియర్ పెన్షనర్లను శాలువాలతో సత్కరించారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

- నేలటూరు ఫిషింగ్ జెట్టి నిర్మాణంలో మంత్రి కాకాణి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. నెల్లూరు జిల్లా ముత్తు కూరు మండలం నేలటూరు గ్రామంలో ఫిషింగ్ జెట్టి నిర్మాణానికి సంబంధించి వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా మత్స్యకారులు ఎదురు చూస్తున్న సమయం ఆసన్నమైందని, త్వరలోనే ఫిషింగ్ జెట్టి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభి స్తామని తెలిపారు. రూ.25 కోట్ల అంచనా వ్యయంతో జెట్టి నిర్మాణం చేపట్టనున్నామని, దీంతో సుమారు 2 వేల మంది మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి సుగుణమ్మ, సర్పంచ్ కనకయ్య, మత్స్యశాఖ జెడి నాగేశ్వరరావు, తాశీల్దార్ బాలకష్ణారెడ్డి, అదానీ కష్ణపట్నం పోర్టు సిఇఒ జీజే రావు, పిఆర్ఒ వేణుగోపాల్ పాల్గొన్నారు.

క్వారీలను అక్రమంగా అమ్ముకుంటున్న మంత్రి కాకాని : టిడిపి ఆరోపణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నెల్లూరు జిల్లాలో మంత్రి కాకాని రూ.వేలకోట్ల విలువైన క్వారీలను అక్రమంగా అమ్ముకుంటున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ఆరోపించారు. అక్రమ మైనింగ్‌పై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు.

కాకాని అక్రమ మైనింగ్‌పై 21 రోజుల నుంచి తమ పార్టీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పోరాటం చేస్తున్నా పోలీసులు స్పందించడం లేదన్నారు. మంత్రిపై చర్యలు తీసుకొని అక్రమ మైనింగ్ నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో ఎవ్వరూ సంతోషంగా లేరు : అశోక్‌బాబు

రాష్ట్రంలో ఉద్యోగులు, రైతులు, కార్మికులు..ఇలా ఎవ్వరూ సంతోషంగా లేరని టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు వాపోయారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితియే ఘోరంగా ఉంటే ఇక మిగిలినవారి పరిస్థితి చెప్పాల్సిన అవసరం లేదని చెప్పారు.

మత్స్యకారుల్ని నట్టేట ముంచారు : అనగాని

మత్స్యకారులకు జగన్ అడుగడుగునా అన్యాయం చేస్తున్నారని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత 8 ఫిషింగ్ హార్బర్లు, 4 జెట్టీలు కడతామని ఇప్పటి వరకు ఒక్కడి కూడా ఎందుకు నిర్మించలేదని ఒక ప్రకటనలో ప్రశ్నించారు. మత్స్యకారులకు ఇచ్చే అరకొర సాయానికి ప్రభుత్వం సవాలక్ష కొర్రీలు పెడుతోందని విమర్శించారు.

నేటి నుంచి కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల పంపిణీకి నేటి నుంచి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు క్యాంప్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభినున్నారు. ఈ నెల 19 నుంచి క్షేత్రస్థాయిలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రారంభించనున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఐదు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 1.42 కోట్ల కొత్త కార్డుల ముద్రణకు ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చింది. ఆరోగ్యశ్రీ కింద ఇప్పటి వరకూ ఉన్న రూ.5 లక్షల బీమా మొత్తాన్ని రూ.25 లక్షలకు పెంచిన సంగతి తెలిసిందే. కేన్సర్ వంటి అనేక ప్రొసీజర్స్‌లో వ్యయ పరిమితి లేకుండా వైద్య సేవలు అందించనున్నారు. ఇలాంటి వాటి కోసం గత నాలుగేళ్లగా రూ.1897 కోట్ల పైగా ప్రభుత్వం ఖర్చు చేసింది. రూ.వెయ్యి రూపాయల మొదలుకొని రూ.25 లక్షల వరకు ఖర్చుయ్యే చికిత్సలన్నీ ఇకనుంచి ఆరోగ్యశ్రీ పరిధిలోకి వస్తాయి. మొత్తం 3,257 ప్రొసీజర్లకు ఆరోగ్యశ్రీ కింద వైద్య సేవలు అందిస్తున్నారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ ద్వారా 53,02,816 మంది లబ్ది పొందారు. ఆరోగ్యశ్రీకి సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరి ఫోన్‌లోనూ ఆరోగ్యశ్రీ యాప్ ఉండేలా చూస్తోంది.

ప్రజల హక్కుగా వైద్యసేవలు

- సిఎంకు ప్రజారోగ్య వేదిక లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరోగ్యశ్రీ బీమా పరిధిని రూ.5 లక్షల నుండి రూ.25 లక్షలకు పెంచడం ఆహ్వానించదగ్గ పరిణామం అని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎంవి రమణయ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి కామేశ్వరరావు పేర్కొన్నారు. అదివారం నాడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లేఖ రాశారు. ప్రభుత్వాల దయా దాక్షిణ్యాల మీద అధారపడకుండా వైద్యసేవలు పొందడం ప్రజల హక్కుగా ఉండాలన్నారు. రాజస్థాన్ తరహాలో ఆరోగ్య హక్కు చట్టాన్ని తీసుకరావలని కోరారు. నెట్వర్క్ ఆసుపత్రుల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య శ్రీకి ప్రత్యేక బడ్జెట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.



అమరావతి బాలోత్సవ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చలవాది, ఆర్.కొండలరావు, ఎస్‌పి.రామరాజు తదితరులు

19 నుండి అమరావతి బాలోత్సవ్ పిల్లల పండుగ

- 55 అంశాల్లో పోటీలకు ఏర్పాట్లు
- పోస్టర్ ఆవిష్కరణలో గౌరవాధ్యక్షులు చలవాది

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ)

అమరావతి బాలోత్సవం 6వ పిల్లల పండగ ఈ నెల 19, 20, 21 తేదీల్లో విజయవాడలోని సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు బాలోత్సవం గౌరవాధ్యక్షులు చలవాది మల్లికార్జునరావు తెలిపారు. నాలుగు జిల్లాల పరిధిలో జరిగే ఈ బాలోత్సవ్ పోస్టర్‌ను సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మల్లికార్జునరావు మాట్లాడుతూ.. ఎన్‌టిఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల పరిధిలోని 175 పాఠశాలల నుండి సుమారుగా 10 వేల మంది విద్యార్థులు ఈ బాలోత్సవంలో పాల్గొననున్నారని తెలిపారు. 19న ఉదయం 10 గంటలకు ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్ పిల్లల పండగను ప్రారంభిస్తారని, ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, విశిష్ట అతిథులుగా రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ వి.జి.వెంకటరెడ్డి, ఎన్‌టిఆర్ జిల్లా డిఇఒ సివి రేణుక, ఎస్‌బిఐ డిజిఎం మనీష్‌కుమార్ సింగ్, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ అధ్యక్షులు సాధు విఆర్ ప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. బాలోత్సవంలో 39 ఎకడమిక్, 16 కల్చరల్ ఈవెంట్లలో పోటీలు జరుగుతాయని తెలిపారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు మాట్లాడుతూ ఏకకాలంలో కళాశాల ప్రాంగణంలోనే 9 చోట్ల పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. బాలోత్సవం అధ్యక్షులు ఎస్‌పి.రామరాజు మాట్లాడుతూ ప్రతి విభాగంలో విజేతలకు మెమెంటో, సర్టిఫికెట్‌తోపాటు పోటీల్లో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.


సాబ్జీ భౌతికకాయం వద్ద విలపిస్తున్న భార్య, కుమార్తె, కుమారుడు, కుటుంబ సభ్యులు

ఉద్యమ నేతకు కన్నీటి వీడ్కోలు

(మొదటిపేజీ తరువాయి)

సమన్వయపర్చారు. ఇండోర్ స్టేడియంలో ప్రజల సందర్శన తర్వాత సాబ్జీ భౌతికకాయాన్ని సత్రంపాడులోని ఆయన స్వగృహం వద్దకు తీసుకెళ్లారు. సంప్రదాయ పద్ధతిలో కార్యక్రమాలు ముగిసిన అనంతరం భౌతికకాయానికి పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం సిపిఎం, యుటిఎఫ్, సిఐటియు, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జెండాలతో అలంకరించిన అంతిమయాత్ర వాహనంలోకి సాబ్జీ భౌతికకాయాన్ని ఎక్కించి పడమర వీధిలోని ముస్లిం శ్మశాన వాటికకు తరలించారు. అంతిమయాత్రలో పెద్ద ఎత్తున జనం మోటార్ సైకిళ్లపై ర్యాలీగా తరలివచ్చారు. 'సాబ్జీ ఆశయాలను సాధిద్దాం' అంటూ, పూలు చల్లుతూ అంతిమ యాత్ర పొడుగునా నినాదాలు దద్దరిల్లాయి. అక్కడ పోలీసులు గాలిలోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. అనంతరం అంత్యక్రియల ప్రక్రియ పూర్తి చేశారు. ప్రభుత్వం తరుపున ఆర్‌డిఒ ఖాజావలీ, ఏలూరు తహశీల్దార్ బి.సోమశేఖర్ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. నివాళులర్పించిన వారిలో ఏలూరు ఎంపి కోటగిరి శ్రీధర్, ఏలూరు, దెందులూరు ఎంఎల్‌ఎలు ఆళ్ల నాని, అబ్బాయిచౌదరి, ఎంఎల్‌సి కల్పలతా రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి, ఎస్‌పి మేరీ ప్రశాంతి, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్ ఎన్.సుధీర్‌బాబు, మాజీ ఎంఎల్‌సి వి.బాలసుబ్రమణ్యం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వి.ఉమామహేశ్వరరావు, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, మాజీ మంత్రి, టిడిపి నాయకులు కెఎస్.జవహర్, సిపిఐ నాయకులు డేగా ప్రభాకర్, జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు, సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్.నరసింగరావు, జి.బేబిరాణి, కె.ఉమామహేశ్వరరావు, కె.ధనలక్ష్మి, కె.పోశమ్మ, ప్రజానాట్యమండలి నాయకులు పి.మంగరాజు, షేక్ వలీ తదితరులు ఉన్నారు. యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు, రైతు సంఘం, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా తదితర ప్రజాసంఘాలకు చెందిన నేతలు తరలొచ్చి నివాళులర్పించారు.


సాబ్జీ భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

దాడులకు భయపడకుండా పోరాటాలు

'ప్రజాశక్తి'తో ఎఐకెఎస్ నాయకులు

ప్రజాశక్తి- కర్నూలు, అనంతపురం ప్రతినిధులు

దాడులకు భయపడకుండా పోరాటాలు సాగిస్తున్నామని పలువురు ఎఐకెఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పలు విజయాలు సాధించామని చెప్పారు. కర్నూలులో ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా పలు రాష్ట్రాల ఎఐకెఎస్ కౌన్సిల్ సభ్యులు తమ ఉద్యమానుభవాలను 'ప్రజాశక్తి'తో పంచుకున్నారు.

బలమైన పోరాటాలతో ముందుకెళ్తాం



త్రిపురలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి వచ్చాక మార్క్సిస్టు పార్టీ నాయకుల, కార్యకర్తల ఇళ్లు, కార్యాలయాలపై, వ్యవసాయ క్షేత్రాలపై దాడులకు పాల్పడింది. పంటలు, పండ్ల తోటలను ధ్వంసం చేసింది. వ్యవసాయ ఆధారిత వ్యాపారాలను నాశనం చేసింది. మహిళలను, పిల్లలను, ప్రజలందరినీ భయభ్రాంతులకు గురి చేసింది. సిఐటియు కార్యకర్తల జీవనాధారమైన వాహనాలను ధ్వంసం చేసింది. అయినా, మొక్కవోని ధైర్యంతో నాయకులు, కార్యకర్తలు పోరాడుతున్నారు. ఎఐకెఎస్, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రజలను కూడగట్టి జిల్లాల వారీగా ప్రదర్శనలు చేశాం. బిజెపి, ఆర్ఎస్ఎస్ గుండాల ప్రజా వ్యతిరేక విధానాలను విస్తృతం ప్రచారం చేశాం. అసెంబ్లీని ముట్టడించాం. గవర్నర్ భవనానికి చేరుకుని సమస్యలు వివరించాం. మోసపూరిత వాగ్దానాలతో బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చింది. ప్రధాన మంత్రి, 20 మంది మంత్రులు ప్రచారంలోకి దిగారు. డబ్బు విచ్చలవిడిగా ఖర్చు చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మత ఉన్మాదాన్ని పెంచే ప్రచారాన్ని చేశారు. కాంగ్రెస్, టిఎంసి నాయకులను బిజెపిలో చేర్చుకున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అసత్య ప్రచారం చేసి సిపిఎం పట్ల వ్యతిరేక భావాన్ని పెంచారు. కొత్త ఉద్యోగాలిస్తామన్నారు. ఏడో ఫైనాన్స్ కమిషన్‌ను అమలు చేస్తామన్నారు. మంచి పాలన అందిస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదు. బిజెపి పాలనలో అవినీతి, లంచగొండితనం పెరిగింది. సిపిఎం రెండోసారి ఓడిపోయినా గతం కంటే 12 శాతం ఓటింగ్ పెరిగింది. పట్టణ, ఏజెన్సీ ప్రాంత ప్రజలు సిపిఎంను ఆదరించారు. భవిష్యత్తులో బలమైన పోరాటాలతో ముందుకెళ్తాం.

పవిత్రకార్, ఎఐకెఎస్ త్రిపుర ప్రధాన కార్యదర్శి.

దయనీయంగా చెరుకు రైతుల పరిస్థితి



కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న రైతు వ్యతిరేక విధానాల వల్ల చెరుకు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. దేశ వ్యాప్తంగా 732 చక్కెర కర్మాగారాలు ఉంటే, గతేడాది 530 కర్మాగారాలు మాత్రమే క్రషింగ్ చేశాయి. మిగిలినవి మూతపడే స్థితిలో ఉన్నాయి. చెరకు రైతులను ఆదుకునేందుకు తీసుకొచ్చిన 1966 షుగర్ కేన్ కంట్రోల్ ఆర్డర్‌కు గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం సవరణలు తీసుకొచ్చింది. ఇవి రైతులను నాశనం చేస్తున్నాయి. రెవెన్యూ షేరింగ్ ఫార్ములాను అమలు చేయాలని రంగరాజన్ కమిటీ సూచించింది. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు ప్రభుత్వాలు రెవెన్యూ షేరింగ్ చట్టాన్ని చేసినా ఏడేళ్లుగా అవి అమలు కావడం లేదు. తమిళనాడులో గతేడాది ఆందోళన చేపట్టి టన్ను చెరుకుకు అదనంగా రూ.195 చొప్పున ఇన్సెంటివ్ సాధించుకున్నాం. గతేడాది తెలంగాణలో 30 సహకార చక్కెర కర్మాగారాలకు ప్రభుత్వం బకాయి ఉంటే, పోరాడి సాధించుకున్నాం. ఇంకా దేశ వ్యాప్తంగా రూ.6 వేల కోట్లకుపైగా బకాయిలు ఉన్నాయి. బీహార్, ఉత్తరప్రదేశ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో బకాయిల కోసం ఆందోళనలు సాగుతున్నాయి. తమిళనాడులో ఎస్ఎపి ప్రకటించని 2004-2005, 2008-2009 సంవత్సరాల్లో ఫ్యాక్టరీకి వచ్చే లాభాల్లో 50 శాతం రైతులకు చెల్లించాలని కోర్టులో కేసు వేసి ఆర్డర్ తెచ్చుకున్నాం. బిజెపి అధికారంలో ఉన్న యుపిలో ఈ ఉత్తర్వుల ప్రకారం రైతులకు ఎందుకు ఇవ్వడం లేదు. ఎపిలో ఆరు సహకార చక్కెర కర్మాగారాలు ఎన్‌సిఎల్‌టికి అప్పగించాలని చూస్తే హైకోర్టులో కేసు వేశాం. ఎన్‌సిఎల్‌టికి అప్పగించకూడదని కోర్టు తీర్పు ఇచ్చింది. ఎపిలో చక్కెర కర్మాగారాల బకాయిలను ప్రభుత్వం ఇచ్చి వాటిని పున:ప్రారంభించాలి.

- డి.రవీంద్రన్, అఖిల భారత చెరుకు రైతుల ఫెడరేషన్ అధ్యక్షులు

పోరాటాలతో ముందుకు సాగుతున్నాం

రాష్ట్రంలో పలు సమస్యలపై పోరాటాలతో ముందుకు సాగుతున్నాం. కర్ణాటకలో ప్రధానంగా రైతుల భూములు లాక్కోవడానికి వ్యతిరేకంగా, పంటలకు గిట్టుబాటు ధర



కోసం పోరాటాలు సాగుతున్నాయి. ఏ ఒక్క పంటకూ కనీస మద్దతు ధర లభించడం లేదు. కొబ్బరి ఉత్పత్తిలో కర్ణాటక రెండో రాష్ట్రంగా ఉంది. ఉద్యాన శాఖ అధికారిక లెక్కల ప్రకారం క్వింటాలు కొబ్బరి తీయడానికి రూ.16,730 ఖర్చు అవుతోంది. కేంద్రం రూ.11,730 మాత్రమే మద్దతు ధర ఇస్తోంది. అది కూడా సక్రమంగా అందడం లేదు. రైతులకు రూ.6,500 నుంచి రూ.9 వేల మధ్య మాత్రమే దక్కుతోంది. నాఫెడ్ ద్వారా కొబ్బరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం జరిగింది. 15 నుంచి 30 రోజుల్లోనే కొనుగోలు కేంద్రాలను మూసేశారు. తీవ్ర ఆందోళనల ఫలితంగా 25 శాతం కొబ్బరినే కొన్నారు. గతంలో రాష్ట్రంలోని బిజెపి అనుసరించిన రైతు వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. దీనిపై చలో విధానసౌధ, చలో రాజ్‌భవన్, ఎంపి, ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి చేపట్టాం. రాష్ట్రంలోని గత బిజెపి ప్రభుత్వం మూడు రైతు వ్యతిరేక చట్టాలను చేసింది. వాటివల్ల రైతుల పరిస్థితి దుర్భరంగా మారింది. వాటిని రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటినే కొనసాగిస్తోంది. భూములను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు రైతుల నుంచి బలవంతంగా లాక్కొంటోంది. దీనిపై 600 రోజులకుపైగా ఆందోళన సాగుతోంది. గాలి జనార్థన్‌రెడ్డి 2012లో 14 వేల ఎకరాలు తీసుకుని బ్రాహ్మణి స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటి వరకూ కంపెనీ పెట్టలేదు. దీనిపై 300 రోజులుగా బళ్లారి జిల్లా కురుగోడులో ఆందోళన సాగుతోంది. రైతులందరినీ ఒకే తాటిపైకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగానే రాష్ట్రంలో బిజెపిని ఓడించగలిగాం.

- టి.యశవంత, కర్ణాటక రాష్ట్ర ప్రాంత రైతు సంఘం ప్రధాన కార్యదర్శి

ప్రమాదంలో ఫిష్ క్యాట్ మృతి

ప్రజాశక్తి-రామభద్రపురం (విజయనగరం జిల్లా)

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఫిష్ క్యాట్ (బౌరుబిల్లి) మృతి చెందింది. ఈ సంఘటన విజయనగరం జిల్లా రామభద్రపురం మండలంలోని తారాపురం వద్ద 26వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఈ జంతువు చిరుతను పోలి ఉండడంతో గ్రామస్తులు పులిపిల్లని భ్రమించి భయాందోళనకు గురయ్యారు. ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అటవీ శాఖ రేంజర్ అప్పలరాజు జంతువు కళేబరాన్ని పరిశీలించి, అది చిరుతపులి కాదని, ఫిష్ క్యాట్ (బౌరు బిల్లి) అని నిర్ధారించారు. ఇటీవల జిల్లాలో పులి సంచరించడం, ఈ జంతువు కూడా అదే లక్షణాలతో ఉండడంతో ప్రజలు భ్రమించి ఉంటారని తెలిపారు. వెటర్నరీ వైద్యాధికారి హిరణ్య ఆధ్వర్యంలో పోస్ట్‌మార్టం నిర్వహించారు.



'అనంత'లో రోడ్డు ప్రమాదం

- ముగ్గురు మృతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన అనంతపురం రూరల్ మండలం కురుగుంట గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కర్ణాటక రాష్ట్రం హిరియూరుకు చెందిన ప్రశాంత్ (23), మహాలింగ (50), నింగరాజు (21), సుభాష్‌చంద్రబోష్ ఐచర్ వాహనంలో అనంతపురానికి కోళ్లదాణాను తీసుకొచ్చారు. దాణాను అన్‌లోడ్ చేసిన అనంతరం ఆదివారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో తిరుగు ప్రయాణం అయ్యారు. కురుగుంట గ్రామ సమీపంలో టైరుకు పంచర్ కావడంతో నిలిపి ఉంచిన లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ ప్రశాంత్, హమాలీలు మహాలింగ, నింగరాజు మృతి చెందారు. క్లీనర్ సుభాష్ చంద్రబోస్ స్వల్ప గాయాలతో బయటపట్టారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన క్లీనర్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వాహనంలో ఇరుక్కుపోయిన మృతదేహాలను జెసిబి సాయంతో బయటకు తీశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మావోయిస్టుల కాల్పుల్లో పోలీసు అధికారి మృతి

ప్రజాశక్తి - చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో మావోయిస్టుల కాల్పుల్లో ఓ పోలీసాధికారి మృతి చెందారు. ఓ జవానుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. సిఆర్‌పిఎఫ్ క్యాంపునకు చెందిన 165వ బెటాలియన్ ఆదివారం ఉదయం క్యాంపు నుంచి కూంబింగ్‌కు బయలుదేరింది. అప్పటికే మార్గమధ్యంలో అడవిలో చెట్ల మధ్య పొంచి ఉన్న మావోయిస్టులు ఒక్కసారిగా సిఆర్‌పిఎఫ్ జవాన్లపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, కానిస్టేబుల్ రాముకి గాయాలయ్యాయి. ఆయనను సుకుమార్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ కాల్పులతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. మావోయిస్టుల కోసం గాలింపును తీవ్రతరం చేశారు.



టిడ్కో గృహాల లబ్దిదారులకు బ్యాంకులు ఇచ్చిన నోటీసులు చూపిస్తున్న పురంధేశ్వరి

రాష్ట్రంలో జోరుగా ఇసుక అక్రమ రవాణా

- పురంధేశ్వరి

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో సిఎం జగన్ కనుసన్నల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధేశ్వరి విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఆదివారం నిర్వహించిన బిజెపి జిల్లా పదాధిపతుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం తాము జనసేన పొత్తుతో ఉన్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై తామే పోరాడుతున్నామన్నారు. ఇసుక అక్రమ రవాణా వల్ల 40 లక్షల కార్మికులకు పనిలేకుండా పోయిందని తెలిపారు. టిడ్కో గృహాలకు కేంద్రం ఒక్కొక్క ఇంటికి రూ.1.50 లక్షలు ఇస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.30 వేలు కూడా ఉపాధి హామీ నిధుల కింద చెల్లించామని చెప్పారు. అనంతరం పాలకొల్లులో నిర్మించిన టిడ్కో గృహాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసరాజు, బిజెపి జిల్లా అధ్యక్షుడు నారిన, రాష్ట్ర సభ్యులు ఉన్నమట్ల కబర్ధి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి యర్రంశెట్టి పద్మారావు, జక్కంపూడి కుమార్, కొల్లి ప్రసాద్, కొనిజేటి గుప్త పాల్గొన్నారు.

కార్మిక వర్గంపై ప్రభుత్వాల దాడి

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టాక కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని, సామాన్య ప్రజలపై భారాలు మోపుతోందని సిఐటియ రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు అన్నారు. సిఐటియు ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పర్సా సత్యనారాయణ శతజయంతి సందర్భంగా 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు-ఉద్యోగులు, కార్మికులపై ప్రభావం' అనే అంశంపై గుంటూరులోని ఎన్‌జిఒ హోంలో ఆదివారం రాష్ట్ర స్థాయి సెమినార్ నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మోడీ పాలనలో ప్రతి కుటుంబంపై విద్యుత్, గ్యాస్, పెట్రోలు, నిత్యావసర సరుకుల భారం ఏడాదికి దాదాపు రూ.60 వేలు పెరిగిందన్నారు. మరోవైపు కార్మికులకు కనీస వేతనాలు అమలు కావట్లేదన్నారు. పెరిగిన ధరలతో కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని వివిధ పథకాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీలు, ఆశాలు, ఇతర స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు కావట్లేదని, హక్కులు లేకుండా వెట్టిచాకిరీ చేస్తున్నారన్నారు. ఎల్ఐసి, బ్యాంకులు, గనులు, రైల్వేలు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం ధారాదత్తం చేస్తోందని తెలిపారు. కార్మిక చట్టాలు రద్దు చేసి, కార్పొరేట్లకు అనుకూలంగా 4 లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. మరోవైపు రాష్ట్రం ప్రభుత్వం కేంద్రం బాటలోనే నడుస్తూ ప్రజలపై భారాలు మోపుతోందని తెలిపారు. ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని విస్మరించిందన్నారు. సెమినార్‌లో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం మచిలీపట్నం డివిజన్ జాయింట్ సెక్రెటరీ వివికె.సురేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి, ఎపిఎన్‌జిఒ నగర నాయకులు మూర్తి తదితరులు ప్రసంగించారు. తొలుత పర్సా సత్యనారాయణ, ఎమ్మెల్సీ సాబ్జి చిత్రపటాలకు యుటిఎఫ్ సీనియర్ నాయకులు విశ్వనాథం, సిఐటియు నాయకులు హుస్సేన్‌వలి పూలమాల వేసి నివాళి అర్పించారు.



పర్సా సత్యనారాయణ, సాబ్జి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

విశాఖలో 40 వేల ఎకరాల భూ దందా

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మూడు రాజధానుల పేరుతో విశాఖలో వైసిపి నాయకులు కొండలను సైతం వదలకుండా 40 వేల ఎకరాల భూములను కొల్లగొట్టారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. శ్రీకాకుళం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలను నమ్మించి నట్టేట ముంచిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. నాలుగున్నరేళ్లుగా రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మిగిల్చారని ధ్వజమెత్తారు. విశాఖలోనే రాజధాని అంటూ ఉత్తరాంధ్ర ప్రజలను వంచిస్తున్నారని, ఉత్తరాంధ్ర మంత్రులు సైతం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

జగన్ ధన దాహాన్ని తట్టుకోలేక పారిశ్రామికవేత్తలు సైతం పక్క రాష్ట్రాలకు పారిపోతున్నారని దుయ్యబట్టారు. ఆయన అవినీతిలో మంత్రులు పాత్రధారులుగా ఉన్నారని ఆరోపించారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో పారిశ్రామికంగా రాష్ట్రం అభివృద్ధి చెందడం వల్ల నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కిందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధి, వలసల నివారణకు ప్రత్యేక నిధులు వమంజూరు చేస్తామని, సాగునీటి ప్రాజెక్టుల పనులు శరవేగంగా చేపట్టారని చెప్పారు. వంశధార ప్రాజెక్టుకు నిధులు ఇవ్వడం వల్లే 84 శాతం పనులు పూర్తి అయ్యాయని, గడిచిన నాలుగున్నరేళ్లలో ఒక్కశాతం కూడా పనులు ముందుకు సాగలేదని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి చంద్రబాబు అని, ఆయన వల్లే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

'ఉపాధి'లో నిధుల గోల్‌మాల్

- సామాజిక తనిఖీల్లో వెలుగులోకి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్కడక్కడా అక్రమాలు చోటుచేసుకుంటున్నట్లు సామాజిక తనిఖీల్లో వెలుగు చూసింది. ఉపాధి కార్మికులకు దక్కాల్సిన వేతనాలను అధికారులే తమ జేబుల్లో వేసుకుంటున్న ఘటనలు బయటపడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా 7054 యూనిట్లలో సోషల్ ఆడిట్ జరగగా..వాటిలో రూ.5.87 కోట్ల మేర నిధులు గోల్‌మాల్ జరిగినట్లు గుర్తించారు. 2023-24లో ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ నాటికి 50 శాతం యూనిట్లలో మాత్రమే సోషల్ అడిటింగ్ జరిగింది. ఇక పూర్తి స్థాయిలో ఆడిటింగ్ జరిగితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చేవి. సామాజిక తనిఖీ నిర్వహించిన 7,054 పనుల్లో 1472 యూనిట్ల పనులకు రూ.45.49 లక్షల నిధుల గోల్‌మాల్ సంబంధించి నోటీసులు జారీ చేయగా..వాటిలో 1468 పనులకు గాను రూ.45.47 లక్షలను ప్రభుత్వం రికవరీ చేసింది. సామాజిక తనిఖీల నివేదిక ప్రకారం..అత్యధికంగా ప్రకాశం జిల్లాలో 981 పనుల్లో అవినీతి చోటుచేసుకుంది. రూ.1.27 కోట్ల నిధులు దారిమల్లాయి. ఆ తర్వాత స్థానంలో నెల్లూరు జిల్లాలో 516 పనులకు గాను రూ.73.84 లక్షలు, గుంటూరు జిల్లాలో 118 పనులకు గాను రూ.36.76 లక్షలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 162 పనులలో రూ.31.12 లక్షలు, చిత్తూరు జిల్లాలో 284 పనుల్లో 29.40 లక్షలు, పశ్చిమ గోదావరి జిల్లాలో 72 పనులలో 26.72 లక్షలు, ఏలూరు జిల్లాలో 328 పనులలో రూ.25.50 లక్షలు అనంతపురం జిల్లాలో 281 పనులలో రూ.19.86 లక్షలు, అనకాపల్లి జిల్లాలో 158 పనులలో రూ.18.36 లక్షలు, అన్నమయ్య జిల్లాలో 450 పనులలో రూ.15.47 లక్షలు, కాకినాడ జిల్లాలో 250 పనులలో రూ.24.65 లక్షలు అవినీతి చోటుచేసుకున్నట్లు గుర్తించారు. మిగతా 6496 పనులలో నోటీసులు జారీ చేశారు.

పంచగ్రామాల సమస్యకు శాశ్వత పరిష్కారం

- యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సింహాచలం దేవస్థానం పంచగ్రామాల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్ర ఆదివారంనాటికి 225వ రోజుకు చేరింది. అనకాపల్లి జిల్లా పెందుర్తి, గాజువాక నియోజకవర్గాల్లో పాదయాత్ర సాగింది. పాదయాత్రలో భాగంగా పరవాడ సంతబయలు వద్ద పంచగ్రామాల బాధితులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. ఇళ్ల సమస్యతోపాటు రైతుల సమస్యను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పంచగ్రామాల్లో 12 వేల ఎకరాలు, 18 వేల ఇళ్లకు సంబంధించిన సమస్యతో లక్ష మంది బాధపడుతున్నారని తెలిపారు. పిల్లల పెళ్లిళ్లు, చదువులు, వైద్యం, ఇతర అవసరాలకు ఆస్తులు అమ్ముకునే హక్కు లేకుండా పోయిందన్నారు. కనీసం ఇంటి మరమ్మతులు చేసుకునే పరిస్థితి కూడా లేదన్నారు. జిఒ 229 ద్వారా దేవస్థానానికి వేరే చోట భూములు కేటాయించి పంచ గ్రామాల సమస్య పరిష్కారానికి చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నించిందని గుర్తు చేశారు. వైసిపి లీగల్ సెల్‌లో పనిచేసే కొందరు కోర్టుకు వెళ్లడంతో జిఒ 229 అమలుకాలేదని తెలిపారు. అధికారంలోకి వచ్చిన నెలలోపే సమస్యను పరిష్కరిస్తానని పాదయాత్రలో జగన్ హామీ ఇచ్చి మాటతప్పారన్నారు. కమిటీ పేరుతో కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, వైసిపి ప్రభుత్వాలు పంచగ్రామాల సమస్యను పెంచాయని విమర్శించారు. పంచగ్రామాల ప్రజలంతా ఒక మాటకు కట్టుబడితే సమస్యకు పరిష్కారం సులభమవుతుందని తెలిపారు. పాదయాత్రలో మాజీ మంత్రులు బండారు సత్యనారాయణమూర్తి, గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే గణబాబు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజగదీశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, యలమంచిలి ఇన్‌ఛార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, జనసేన ఇన్‌ఛార్జ్ సుందరపు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



లోకేష్‌తో కలిసి పాదయాత్ర చేస్తున్న మాజీ మంత్రులు గంటా, బండారు



వైజాగ్ మారథాన్‌లో పాల్గొన్న ప్రజలు

ఉత్సాహంగా వైజాగ్ మారథాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

వైజాగ్ రన్నర్స్ సొసైటీ, సంధ్యా మెరైన్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యాన విశాఖ సాగర తీరంలో వైజాగ్ మారథాన్ ఆదివారం ఉత్సాహంగా సాగింది. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగానూ, ఎకో వైజాగ్‌కు మద్దతుగానూ ఈ కార్యక్రమం తలపెట్టారు. మారథాన్‌ను ఉద్దేశించి వైజాగ్ రన్నర్స్ సొసైటీ అధ్యక్షులు బాలకృష్ణారాయ్ మాట్లాడుతూ 21కె, 10కె, 5కె, 3కె రన్ విభాగాల్లో ఈ కార్యక్రమం తలపెట్టగా విశాఖ నగర ప్రజలతో పాటు నాలుగు దేశాలు, 21 రాష్ట్రాల నుంచి సుమారు ఎనిమిది వేల మంది రన్నర్లు పాల్గొన్నారన్నారు. వయోభేదం లేకుండా అందరూ పరుగు తీశారని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండేందుకు, నగరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించి పర్యావరణాన్ని కాపాడేందుకు నగర పోలీసు, మున్సిపల్ శాఖల సమన్వయంతో ఇప్పటికే అవగాహనా శిబిరాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆదివారం ఉదయం నాలుగు గంటలకు ప్రారంభమైన కార్యక్రమం తొమ్మిది గంటల వరకూ కొనసాగింది. కార్యక్రమంలో సంధ్య మెరైన్స్ డైరెక్టర్ ఆనంద్, వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్, యూనియన్ బ్యాంకు డిజిఎం నటరాజ్, అపోలో హాస్పిటల్స్ సిఒఒ రామచంద్ర, నేవల్ డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్ విజయశేఖర్, సిఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ పాల్గొన్నారు.

విజేతలు వీరే..

21కె పురుషుల విభాగంలో ఆర్‌ఆర్ నాయక్, మహిళల విభాగంలో సౌమ్య సరస్వతి, 10కె పురుషుల విభాగంలో హరీష్, మహిళల విభాగంలో గ్రేస్ విజేతలుగా నిలిచారు. వివిధ విభాగాలలో విజేతలకు ఐదు లక్షలకుపైగా విలువైన నగదు పురస్కారాలు, బహుమతులను అందజేశారు.

మంగినపూడి బీచ్‌లో విషాదం

- స్నానానికి వెళ్లి విద్యార్థి మృతి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్



అఖిల్

కృష్ణా జిల్లా మచిలీపట్నం పరిధిలోని మంగినపూడి బీచ్‌లో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. సముద్ర స్నానానికి వెళ్లి ఓ విద్యార్థి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటిలో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు కలిసి మంగినపూడి బీచ్‌లో స్నానం చేసేందుకు వెళ్లారు. సముద్రంలో దిగిన కొద్ది సేపటికే అలలు పెద్ద ఎత్తున రావడంతో వారంతా కొట్టుకుపోయారు. అప్రమత్తమైన మెరైన్ పోలీసులు నలుగురిని ఒడ్డుకు చేర్చారు. నూజివీడుకు చెందిన తోకల అఖిల్ (18) గల్లంతయ్యారు. మెరైన్ ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. అఖిల్ కోసం వెతుకుతున్న క్రమంలో కొద్ది సేపటికే అతని మతదేహం లభ్యమైంది. అఖిల్ ట్రిపుల్ ఐటిలో ఆఖరి సంవత్సరం చదువుతున్నారు.



తిరుమలలో జీతాల కోసం నిరసన తెలుపుతున్న కార్మికులు

4 నెలలుగా వేతనాల బకాయి

- ఆందోళనకు దిగిన తిరుపతి పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి- తిరుమల:

గత నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడంతో తిరుమలలో పారిశుధ్య కార్మికులు ఆదివారం ఆందోళనకు దిగారు. శ్రీవారి ఆలయానికి ఎదురుగా ఉన్న ఆస్థాన మండపం వద్ద ఆందోళన చేపట్టారు. సులభ్ కాంట్రాక్ట్‌ను టిటిడి రద్దు చేయడంతో ముంబాయికి చెందిన గురుజీ ఇన్‌ఫ్రా సంస్థ తరఫున ఈ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. నిరసన వద్దకు చేరుకున్న టిటిడి హెల్త్‌ఆఫీసర్, విజిలెన్స్ అధికారులు కార్మికులతో చర్చించి పెండింగ్ వేతనాలు త్వరలో అందేలా చూస్తామని సర్దిచెప్పడంతో కార్మికులు ఆందోళనను విరమించారు. కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించని సదురు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొనే యోచనలో టిటిడి ఉన్నట్లు సమాచారం.

నేటితో 'యువగళం' ముగింపు

- 225 రోజుల పాటు సాగిన లోకేష్ పాదయాత్ర
- 3132 కిలోమీటర్లు కొనసాగిన యాత్ర
- 20న విజయనగరంలో విజయోత్సవ సభ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి ప్రధానకార్యాదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారంతో ముగియనుంది. ఈ ఏడాది జనవరి 27న చిత్తూరు జిల్లా కుప్పం నుంచి 'యువగళం' ప్రారంభమైంది. 226 రోజుల పాటు 11 ఉమ్మడి జిల్లాల్లోని 97 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా సాగిన ఈ యాత్ర 3132 కిలోమీటర్లు కొనసాగింది. విశాఖపట్నం జిల్లాలోని గాజువాకలో యాత్ర ముగియనుంది. అయితే ముందస్తు షెడ్యూలు ప్రకారం.. 400 రోజుల పాటు 4000 కిలోమీటర్లు యాత్ర సాగించి, వచ్చే జనవరిలో శ్రీకాకుళం జిల్లాలో యాత్రను ముగించాల్సివుంది. అయితే పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టు నేపథ్యంలో ఈ ఏడాది సెప్టెంబర్ 9న 'యువగళం' కొన్నాళ్లు ఆగిపోయింది. సుమారు 80 రోజుల పాటు యాత్ర సాగలేదు. ఆ తర్వాత చంద్రబాబు బెయిల్‌పై విడుదల కావడంతో నవంబర్ 27న యాత్ర పునఃప్రారంభమైంది.

మరోపక్క ఎన్నికల సమయం దగ్గర పడటంతో యాత్రను వీలైనంత త్వరగా ముగించాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. దీంతో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ప్రవేశించకుండానే యాత్ర ముగియనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో ఇబ్బందులు పడుతున్న సకలజనుల గొంతుకను అవుతానని లోకేష్ యాత్ర ప్రారంభానికి ముందు తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు ప్రతి సభలో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు అవినీతి చేస్తున్నారని అధికార పార్టీ నేతలపై విమర్శల దాడి చేశారు.

అదేవిధంగా యాత్రలో పలు సమస్యలపై అధికార యంత్రాంగానికి 600 పైగా లేఖలు రాశారు. పాదయాత్ర పూర్తయిన ప్రతి వంద కిలోమీటర్ల ప్రాంతంలో అక్కడి ఉన్న సమస్యను అధికారంలోకి రాగనే పూర్తిచేస్తామంటూ శిలఫలకాలు ఏర్పాటు చేసి లోకేష్ హామీ ఇచ్చారు. 70 బహిరంగ సభలు, 155 ముఖాముఖి సమావేశాలు, 12 ప్రత్యేక కార్యక్రమాలు, 8 రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు.

భారీ స్థాయిలో ముగింపు సభ

విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లిలో ఈ నెల 20న 'యువగళం' విజయోత్సవ సభను నిర్వహించనున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది తరలివస్తారని టిడిపి అంచనా వేస్తోంది. భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది. చిత్తూరు, తిరుపతి, రైల్వే కోడూరు, అనంతపూర్, ఆదోని, నెల్లూరు, మాచర్ల నుంచి ఏడు ప్రత్యేక రైళ్లను సిద్ధం చేసింది. ఈ సభలో టిడిపి అధినేత చంద్రబాబు సహా అగ్రనాయకులందరూ పాల్గొంటారు.

హాజరుకు ఫేస్ అథంటికేషన్

- 'ఉపాధి హామీ'లో మోడీ సర్కారు యత్నాలు
- జనవరి 1 నుండి అమలు చేయాలన్న కేంద్రం
- సామాజిక కార్యకర్తలు, కార్మికుల ఆందోళన



న్యూఢిల్లీ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) చట్టం కింద లబ్ధిదారుల హాజరును గుర్తించేందుకు కేంద్రం కొత్త ప్రణాళికతో ముందుకొస్తున్నది. ఇందుకోసం ఫేస్ అథంటికేషన్‌ను తీసుకురావాలని చూస్తున్నది. దీనిని వచ్చే ఏడాది అమలు చేయాలని చూస్తున్నది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల(యుటి)ను కొత్త ఫీచర్‌ని పరీక్షించి, దాని అమలుకు సిద్ధం చేయాలని కోరింది. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్)లో ఫేస్ అథెంటికేషన్ (రికగ్నిషన్) ఫీచర్‌ను చేర్చామని మంత్రిత్వ శాఖకు చెందిన ఇద్దరు సీనియర్ అధికారులు తెలిపారు. "గత వారం, రాష్ట్రాలు, యుటిలను ఫీచర్‌ని పరీక్షించడం ప్రారంభించాలని చెప్పాం. దీనితో అవాంతరాలను పరిష్కరించవచ్చు. రాష్ట్రాలు, యుటిల అంతటా దీని అమలుకు సిద్ధం కావాలని కూడా కోరాం. ఇది పథకం అమలులో మరింత పారదర్శకతను తెస్తుంది. నిజమైన కార్మికులు మాత్రమే వర్క్‌సైట్‌లలో ఉండేలా చూస్తుంది" అని మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. దీనిని త్వరలోనే తీసుకురావాలన్నది తమ ప్లాన్ అని చెప్పారు. ఇది ఐచ్ఛికమనీ, హాజరు ఇప్పటికీ ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో మాన్యువల్‌గా గుర్తించబడుతున్నదని వివరించారు.

ప్రభుత్వం తీసుకురావాలని యోచిస్తున్న కొత్త ఫీచర్ ప్రకారం.. ప్రామాణీకరణ కోసం యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడిఎఐ)తో కార్మికుడి (లబ్దిదారుడు, వర్కర్) ముఖం స్కాన్ చేయబడి, అది వారి ఆధార్ డేటాతో సరిపోల్చబడుతుంది. సదరు వ్యక్తి పనికి నివేదించినప్పుడల్లా వర్కర్ ముఖం హాజరు కోసం స్కాన్ చేయబడుతుంది. యుఐడిఎఐ డేటాతో ముఖ ప్రామాణీకరణ ఒక్కసారి మాత్రమే చేయబడుతుందని ఒక అధికారి తెలిపారు. ఫేషియల్ రికగ్నిషన్ ప్రస్తుతం తెలంగాణ, కర్ణాటక వంటి కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ పంపిణీకి, అధికారుల హాజరును గుర్తించడానికి, డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేయడానికి ఉపయోగిస్తున్నాయి.

డిజిటల్ అటెండెన్స్ సిస్టమ్‌లాగానే.. మారుమూల ప్రాంతాలలో ఉన్న ఉపాధి కార్మికులకు నెట్ సేవలతో ఫేషియల్ రికగ్నిషన్ తీసుకొస్తే అది సమస్యలను తీసుకొస్తుందని సామాజిక కార్యకర్తలు, కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తప్పుడు హాజరును, అవినీతిని నిరోధించటం కోసం తీసుకురావాలని చూస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నదనీ, గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రయత్నం ఎంత వరకు విజయం సాధించగలదనేదే పెద్ద ప్రశ్న అని సామాజిక కార్యకర్త, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ (ఎంకెఎస్‌ఎస్) సహ వ్యవస్థాపకుడు, ఎన్‌ఆర్‌ఇజిఎ సంఘర్ష్ మోర్చా సభ్యుడు నిఖిల్ డే అన్నారు. ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీకి అధిక నాణ్యతతో కూడిన ఇంటర్నెట్ కనెక్టివిటీ అవసరమనీ, మారుమూల గ్రామాల్లో ఇదెలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రయత్నాన్ని ప్రభుత్వం ఒక్కసారి ప్రవేశపెడితే.. కార్మికులకు ఇబ్బందులు తప్పవనీ, ఉపాధి హామీ కార్యక్రమం నీరుగారే ప్రమాదమున్నదని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఉపాధిని కల్పించే ఈ పథకం ఆ తర్వాత గాడి తప్పే ప్రమాదమున్నదని ఆందోళన వెలిబుచ్చారు. 2022-23లో 5.18 కోట్ల మంది కార్మికుల పేర్లు 'ఉపాధి హామీ' పథకం నుంచి తొలగించబడ్డాయని కేంద్రమే పార్లమెంటులో వెల్లడించటం గమనార్హం.

మోడీ సర్కారుకు ఆది నుంచీ ఉపాధి హామీపై చిన్న చూపే ఉన్నదనీ, ప్రతి ఏడాది ఈ పథకానికి బడ్జెట్‌లో కోతలు విధిస్తున్నదని సామాజిక కార్యకర్తలు, కార్మికులు విమర్శించారు. ఈ పథకం కింద చెల్లింపుల కోసం కానీ, హాజరు కోసం కానీ, లబ్దిదారులకు పని కల్పించే విషయంలో కానీ మోడీ సర్కారు తిరోగమన విధానాలతో ముందుకొస్తున్నదనీ, ఫేస్ అథంటికేషన్ కూడా అలాంటిదేనని వారు అంటున్నారు.



"సాహిత్యం ఆలోచనలు రేకెత్తించేదిగా వుండాలి. సాహిత్యంలో జీవిత విశ్లేషణ వుంటుంది. జీవితం స్పష్టం చేయలేనిదాన్ని, సాహిత్యం స్పష్టం చేస్తుంది."
- కొడవటిగంటి కుటుంబరావు



అరుణాంజలి

పల్లవి :
ఉపాధ్యాయ ఉద్యమాల గొంతు మూగబోయిందా
కాలం కసిగట్టి కారుచీకటిని నింపిందా
నమ్మలేక పోతున్నాం మా సాబ్జి లేరని
కంటనీరు కడలిలా ఎగసి ఎగసి పడుతుందని ...

1
ప్రతి అడుగు సాహసమే నీ జీవిత ప్రస్థానం
పట్టుదల పతాకమై సాగెను నీ పయనం
ఉపాధ్యాయ ఉద్యమాల వూపిరి నీవై
చివరి వరకు నిలిచావు పోరాట చిరునామై

2
కష్టజీవులందరికి పక్షపాతి నీవయ్యావు
కార్మిక కర్షక హక్కుల దిక్కుచిగ నిలిచావు
శాసన మండలిలో ప్రశ్నించే గొంతుకై
నిన్ను వరించిన పదవికి వన్నె తెచ్చినావు

3
నిలువెత్తు ఆదర్శమే నీ రూపమయ్యింది
మహోన్నతపు ఆశయమే నీ బాటగా సాగింది
మంచితనం మానవతకు మారుపేరుగా నిలిచి
చెరిగిపోని జ్ఞాపకమై మా మదిలో నిలిచావు

4
ఉద్యమ వీరులకు ఉండబోదు మరణం
ఎగురుతున్న జెండాలో మీ రక్తమే అరుణం
బిగించిన ప్రతి పిడికిలి మీ స్ఫూర్తిని చాటుతుంది
మీ ఆశయ బాటలో కడవరకు పోరుతుంది!
(ఉపాధ్యాయ ఉద్యమ నేత, ఎమ్మెల్సీ సాబ్జీ అరుణాంజలి)

– మంగరాజు
ప్రజానాట్య మండలి



చలి పులితో పోరాటం

చలిపై గాలి సవారి చేస్తూ
బెబ్బులిలా వేటాడుతోంది
గూడేలు గుడిసెలు గజగజలాడాయి
మేడలు ఫ్లాట్లు వెచ్చటి దుప్పట్లో
పండుగ చేసుకుంటున్నాయి

దోమలు ఫీ రావాలు చేస్తూ
విరామ మెరుగక రక్తం జుర్రేస్తుంటే
కంంపెనీలు అలుపెరగని యాడ్సుతో
'మస్కిటో'లతో జేబులు పిండేస్తున్నాయి

వీధుల్లో చెత్తబండ్లే కాస్త చుక్కేసుకని
వీధులన్నిటికీ స్నానాలు చేయిస్తున్నాయి
పాపం చలైనా, ఎండైనా కడుపు గోలకు
జోల పాడాలంటే తప్పని పనులు మరి!

స్వెట్టర్లు తొడుక్కుని కూరగాయలు
చలి గాయాలు తప్పించుకుంటూ
లూనా బండ్లెక్కి రండమ్మ రండంటూ
వంట ఇళ్ళల్లో ఘుమఘుమలు రేపాయి

చలిపులిని పాల వ్యాన్లు వెంటాడుతూ
ప్యాకెట్లను గురి చూసి బాణాలు చేసి
బడ్డీ కొట్ల లోపలకి విసురుతున్నాయి
బట్లర్లై వ్యాపారులు సేవలందిస్తున్నారు

ఇప్పుడూ వెరపెరుగని కష్టజీవి సాహసమే
జనం బతుకు దినాన్ని దొర్లిస్తోంది, ఔ కదా!

– ఉన్నం వెంకటేశ్వర్లు



సోమేపల్లికి జోహార్లు!

రైతు కుటుంబంలో జన్మించి
చిరు ఉద్యోగంతో జీవితమారంభించి
పలు శాఖల్లో పనిచేసి
మాలిన్యమెరుగని మనిషిగా వెలిగాడాయన!

నాలుగు పాదాల నానీలను
నవ్యాంధ్రలో నడిపించి
నానీల నాన్నకి అనుజుడై
నానీల చిన్నాన్న తానయ్యాడు!
రైతు వ్యధలను రచనగా మలిచి
నాగలికి నమస్కారం పెట్టాడు
చేను చెక్కిన శిల్పాలు చదివించి
తొలకరి చినుకులు కురిపించాడు!


నవ్య కవుల నాదరించి
సృజనాత్మకతను ప్రోత్సహించి
నవ సాహితి క్షేత్ర హాలికుడై
సాహితీ జగతిన వెలుగొందాడు

సాహిత్య మార్గదర్శనం
కడు లెస్సగా చేసి
తన కలమును తనయునికిచ్చి
చరితర్థుడయ్యాడు సోమేపల్లి !

అవయవ దానం చేసి
ఆదర్శ ప్రాయుడయ్యాడు
మనసా వాచా కర్మేణా
మంచి కవిగా నిలిచాడు!
(గురుతుల్యులు, గుంటూరు రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య గారి అకాల మరణానికి చింతిస్తూ వారికి అక్షర నివాళి)

– అనిల్ కుమార్ దారివేముల
99512 44718

కవితా ఫిరంగి '1818'



సమీక్ష

1818 ... ఇలా ఒక అంకె శీర్షికగా కవి పుప్పాల శ్రీరాం వెలువరించిన కవిత్వ పుస్తకం ఒక కొత్త ప్రయోగం. రెండు శతాబ్దాలుగా స్వతంత్ర భారతదేశంలో బడుగు, నిమ్న వర్ణ వర్గాలు గురైన అణచివేతను ఆయన కవిత్వంగా మలిచారు.

ప్రస్తుతం కవిత్వం అస్తిత్వవాద ధ్రువం వైపు కేంద్రీకతమైంది. దీనివల్ల బహుజన, దళిత, స్త్రీవాదాలు తమ ఉనికిని చాటుతున్నా, సమాజానికి అవసరమైన 'సామూహిక కార్యాచరణ' దిశగా అంటే మీుతీఎష్ట్ర్ శీుఖుతీంం ఖ జుశీఎఎఅఅవస స్రశీఖుత్రీ విషయంలో కవిత్వ ప్రయోజనం వెనుకబడి ఉందనే చెప్పాలి. ఈ నేపథ్యంలో ఖచ్చితమైన మార్పు కోసం నిఖార్సైన సామాజిక, రాజకీయ దృక్పథం అవసరమని కవి ఈ పుస్తకం ద్వారా చెబుతున్నారు. కవి తన దక్కోణాన్ని 'భీమానది' గొంతులో వినిపిస్తున్నారు. 1818 నుంచి ఇప్పటివరకూ భారతదేశంలో వర్ణవివక్ష ఎలా కొనసాగిందో సంఘటనలు, బాధిత వ్యక్తుల పేర్లతో సహా ప్రస్తావించిన తీరు, కవి ఉద్దేశాన్ని స్పష్టంగా చూపిస్తోంది. గత పదేళ్ళుగా దేశ చరిత్రలో కొన్ని సంఘటనలను మార్చి, కొన్ని కప్పిపెట్టి, కొత్తగా రాసే ప్రయత్నం చేస్తున్న శక్తులు ప్రబలమయ్యాయి. వీటిని నిరోధించడానికి కృషి చేసిన 16 మంది మేధావులు ప్రభుత్వ ఆగ్రహానికి గురై, చెరసాల పాలయ్యారు. వారి పోరాటాన్ని సూచిస్తూ 16 ఖండికలుగా కవి గళం విప్పారు. ఇది ఈ పుస్తకం బలం. ఈ దీర్ఘ కవిత అంతస్సూత్రం పాఠకుని జాగృతం చేయడం, ప్రభుత్వ యంత్రాంగాన్ని నిలదీయడం– రెండూనూ.

తొలి వాక్యం నుంచీ 'నేను,భీమా నదిని' అంటూ, కవి నది గొంతుతో ఆ పరీవాహక ప్రాంతపు తేమను, సారాన్ని వివరిస్తూ, బాధార్తుల వెతలను చెప్పారు. గతపు గాయాలు తనపై మూగాయని, వాటిని తడుముతూ మొదలుపెట్టారు. 'నేను భీమా నదిని' అంటూ పదే పదే వచ్చే ఈ మాట, ఒకసారి హెచ్చరికను, ఒకచో బాధ, ఓసారి ఆందోళన, మరోసారి కవి ధర్మాగ్రహపూరిత ప్రశ్ననూ సూచిస్తూ దీర్ఘ కవిత నిర్మాణ విజయానికి బాటలు వేసింది. పాఠకునితో సజీవ సంభాషణ కొనసాగిస్తుంది.

"నీటి దేహమ్మీద జ్ఞాపకాల తూనీగలెగురుతున్నాయి.
బయళ్ళ దోవంతా గతం గుచ్చుకుంటోంది."

కవి కథను కాదు. చరిత్రను చెబుతున్నానని ప్రకటించారు. ఇది అవ్వ బువ్వ తినిపిస్తూ చెప్పే చందమామ కథ కాదంటూ, ఇది 'రాజును వేటాడిన సైనికుల కథ' అంటారు. అంటే తిరుగుబాటు బావుటా ఎగిరిన వైనం మనకు అందించే ప్రయత్నం చేశారు. అసలీ పోరాటం జరపాల్సిన అవసరమేమిటో తెలియాలంటే ఈ కవిత్వ పుస్తకం వచ్చిన నేపథ్యాన్ని ప్రస్తావించుకోవాలి.

1818 సంవత్సరంలో భీమానది తీరాన కోరేగావ్ ప్రాంతంలో అప్పటి బ్రిటిష్ సైన్యంలో మహర్లు భాగంగా ఉండేవారు. వారి ధైర్య పరాక్రమాల సహాయంగా బ్రిటిష్ సైన్యం పీష్వాల పాలనను అంతమొందించింది. ఆ సందర్భంగా ఆ యుద్ధంలో పాల్గొన్న మహర్ల పేర్లతో సహా కోరేగాంలో (1851లో) ఒక స్మారక స్థూపం కూడా నిర్మించారు. కానీ, కొన్ని కారణాల వల్ల, 1892, 1917లో బ్రిటిష్ ప్రభుత్వం మహర్లను సైనికులుగా గుర్తించడం మానేసింది. మహర్లను 'మార్షియల్ రేస్' అంటే పోరాడే తెగ కాదంటూ ముద్ర వేయడం అగ్రవర్ణ దురహంకారానికి చారిత్రక సాక్ష్యం.

స్వాతంత్ర్యం వచ్చాక కూడా ఎందుకు కుల, మత, వర్ణ, వర్గ విభేదాలను నిర్మూలించ లేకపోయామో అనేది జవాబు లేని, దొరకని ప్రశ్న. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఓటు బాంక్ రాజకీయాలు నడిచాయన్నది పరమ సత్యం. కవి వీటిన్నిటి పట్లా తన నిరసన తెలియచేస్తారు.

"మీరేవృట్టైనా కానివ్వండి
ఇంట్లో మీరే ఆహారమైనా తినండి
ఆకలి కన్నీరు పెడుతుంది
దాహం కరుణ వేడుకుంటుంది." అంటూ మానవ సహజాతాలైన ఆకలి, దాహం; ప్రాథమిక అవసరాలైన తిండీ, నీరు గురించి పాఠకుడిని సెన్సిటైజ్ చేయడం కవి టెక్నిక్. అవి అందరికీ ఒక్కటే. ఏ ప్రాంతం లోనైనా అవే మానవ సమాజ శాంతికి కీలకం. కానీ, ఈ దేశంలో జరిగిందేమిటి?

"ఈ దేశం నేలని ఊళ్ళ చివర నిల్చోబెట్టింది.
ఈ దేశం నేలని గుళ్ళోకి రానీయలేదు.
నీళ్ళ తావుల్ని కన్నీళ్ళతో నింపి
నేల కంచంలో దేశం ఎంగిలి ముద్దపడేసింది." అంటూ కవి దళితులకు జరిగిన అన్యాయాన్ని స్పష్టంగా ప్రస్తావించారు. 'వెలివేయడం'లోని అవమానం ఎంత మాయని గాయమో, తరాలు మారినా తరగని మానసిక వ్యధో అనుభవించిన వారికే తెలుస్తుంది.

"కప్పెట్టిన అవశేషాల్లోంచి/ కళ్ళు తెరుస్తున్నాను
... ఇంక్విలాబ్ జిందాబాద్/ అని గొంతు చించుకుని నిట్ట నిలువుగా గట్టు తెగిపోతున్నాను./ నేను భీమా నదిని" అని తన తదుపరి లక్ష్యం అన్యాయాన్ని ఎదుర్కోవడమే కాబట్టి, అందుకు విప్లవ మార్గం ఎంచుకున్నట్టు స్పష్టం చేశారు.

"ఈ మౌనాన్ని బద్దలు కొట్టాలి
ఈ వేటాడ్డాన్ని వ్యతిరేకించాలి.
ఏ దేశమైనా దేవుళ్ళది కాదు. కష్టజీవులదని చెప్పాలి"
ఇలా తేట పదాల్లో చెప్పిన కవే,
"నేరం రుజువు కాకుండా మరణించేట్టు
ఛార్జిషీట్ తయారవుతుంది
వణుకుతున్న చేతుల్లోంచి ప్రాణం
నీళ్ళ గ్లాసులా జారిపోతుంది" అంటూ 'రాజకీయ ఖైదీల' వెతలు బయటపెడతారు. గిరిజనుల, వెనుక బడిన వర్గాల పక్షాన నిలుచున్న నాయకుడు స్టాన్‌స్వామి. ఆయన అడవి బిడ్డలను పలు రకాల హింసలకు గురిచేసిన ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆయన చట్టాన్ని ప్రశ్నించారు. అదే స్టాన్ స్వామి పార్కిన్‌సన్ వ్యాధితో బాధపడుతూ గ్లాసుతో నీళ్ళు కూడా లేపలేని స్థితిలో సైతం నిర్బంధంలో ఉంటే ఆ విషయం ప్రధాన వార్తాపత్రికల్లో రాదు. పైగా ఆయనపై దేశద్రోహ నేరం ఆరోపించబడింది.

ఇలా ఈ దేశ శిక్షాస్మృతి ఎంత దారుణంగా సాక్ష్యాలను పుట్టించగలదో తెలుసుకుంటే భయం వేస్తుంది. ఎక్కడెక్కడి సాక్ష్యాధారాల్నీ తారుమారు చేసి తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం. దీన్ని కవి బట్టబయలు చేస్తారు.

"ఆ పదహారు మంది గురించే కాదు
ఈ దేశపు నల్లగౌను ముందు
తమ కేసు తామే వాదించుకోలేని
అనేకానేక వర్ణాల ఇంద్ర ధనువులున్నాయి.
నిరక్షరాస్యత ఉంది, ఫీజులు కట్టలేని నిస్సహాయత ఉంది." అంటారు. కవి అధికారుల ద్వంద్వ వైఖరిని వ్యతిరేకిస్తూ,

"చరిత్ర/ సంపద శయ్యపై పడుకుని
నిరుపేద నేల చెలమల్లోకి తొంగి చూడలేదు" అంటారు.

5వ ఖండిక అంతా చరిత్ర రాసే పద్ధతి మీద ఎక్కుపెట్టిన అస్త్రం. కవి పుస్తకాలకు పరిమితమైన చరిత్రను, అందులో బోలుతనాన్ని సూచించేందుకు వాడిన ప్రతీకలు మనల్ని ఎప్పటికీ వెంటాడుతూనే ఉంటాయి. ఉదాహరణకు.

"చరిత్ర నిర్లక్ష్యాన్ని రాసేందుకే
ఒక్క వర్ణమాల చాలడం లేదు
చరిత్ర చుక్కల్లేని ఆకాశమై విస్తరించింది
నిస్సార వృక్ష ఛాయగా పరుచుకున్నది.
చరిత్రది ఒట్టి బానిస పోలిక
పరాధీన సౌందర్యం" అంటారు. సమాజం కొన్ని వర్గాల ప్రజలను అణచిపెట్టి, చరిత్రను రికార్డు చేసే క్రమంలో నిజాలను తొక్కేస్తారని కవి సూచ్యంగా చెప్పారు.

ఇక భీమా నది, ఒక నిర్దిష్టమైన ఆశయం కోసం నిలబెట్టిన కోరేగావ్ స్థూపాన్ని తన బిడ్డల విజయ కేతనంగా పదిలంగా ఒడ్డున మోసింది. మరి, ఆ స్థూపాన్ని కూల్చేయాలని చూడటం ఎంతటి దురదృష్టకరమైన వైఖరి?

"కన్నీళ్ళతో యుగయుగాల దూరాన్ని దాటుతున్నాను. ... బరువెక్కిన జ్ఞాపకాల్ని తొలిచి
రసజ్ఞుడెవరో/ ఒక కవిత్వ శిల్పాన్ని నిలబెడతాడు.
నేలరాలిన నక్షత్రాలను పొదిగి నగిషీలు చెక్కుతాడు"

ఆ నదీ, భూమీ ఎదురుచూసిన వ్యక్తి ఎవరో కాదు. ఈ కవే! అందుకే ప్రతి వాక్యంలో నది బిడ్డగా కవి మాట్లాడుతూ ఉంటారు. కవి ప్రతీకాత్మక కవిత్వం సృష్టిస్తూనే వాస్తవాన్ని మనం గ్రహించేట్టు చేస్తున్నాడు.

"ఈ దేశపు స్వేచ్ఛాయుత
నీలి గగనం బోనులో నిలబడింది.
2018 జనవరి ఒకటి
ఫ్యూడల్ కన్నులపై నిద్రలేని రాత్రయ్యింది" అంటూ అన్యాయం జరిగిన తేదీ, సంవత్సరంతో సహా నమోదు చేస్తాడు.

"తనని తాను పొగొట్టు కోవడం,
మళ్ళీ పురుడు పోసుకోవడం
ఒక్క విప్లవానికే చెందిన రసవిద్య. నదీమ తల్లిని చెబుతున్నాను
మొప్పల అలికిడిలో పిడికిళ్ళ కేరింతలు విన్నాను."

ఎంత బుల్లి చేపల మొప్పల అలికిడిలో ఎంతటి గట్టి పిడికిళ్ళ సంకల్పం దర్శించాడో ఈ కవి! ఇలా సూక్ష్మ దృష్టితో కవిత్వీకరించడం పలుచోట్ల గమనిస్తాం. విచారణ ఖైదీల దుస్థితిని అక్షరీకరించడంలో శ్రీరామ్ పంక్తులు మాటిమాటికీ పాఠకుని కళ్ళను ఊట బావులుగా మారుస్తాయి.

"ఒకే ఒక్క పాయఖానా
బయట ఒకరి తర్వాత మరొకరు వేచి ఉంటారు.
చిమిడి పోయిన అన్నమూ,
పప్పు నీళ్ళతో పాత జలిం సేరు
పొట్టలన్నీ కుళ్ళిపోతాయి...
...సిప్పర్ లేకుండా నీళ్ళు తాగలేని పెదవులు,
పెద్ద పేగుల్లో జీర్ణం కాని హింస"

ఇవి కేవలం పదచిత్రాలు కావు. మన కళ్ళముందు అక్షరాలతో ఆవిష్కరించిన సజీవ చిత్రాలు. కవిత్వంలో మార్మికత ఎంత ఉండాలో విప్పిచెప్పే స్పష్టత కూడా అంతే ఉండాలి. అందుకే తిన్నగా,

"అండర్ ట్రయల్ గాళ్ళకి
భారత శిక్షా స్మృతిలో మిల్లీమీటర్ చోటుండదు
.... నేను భీమానదిని!
మార్చురీ గదుల్లాంటి ఈ దేశపు జైళ్ళ ముందు
సహచరుల కోసం / గడ్డ గట్టుకు పోతున్నాను." అంటూ కవి తానున్న చోటుకి మనల్నందర్నీ ఒక్కొక్కరుగా, సమూహాలుగా, ముందు దిగ్భ్రమతో, తరువాత మెలకువతో నిజానిజాలు చర్చించుకుంటూ రండర్రా! అని సూచిస్తున్నారు.

"ఈ దేశపు సర్వసత్తాహక న్యాయ దేవతకు
పెండింగ్ కేసుల వేయి చేతులెత్తి, నమస్కరిస్తున్నాను" అంటూ కోర్టు వాకిళ్ళలో పడిగాపులు పడుతూ, నేరం మోపబడిన 'రాజకీయ ఖైదీల' వెతలను అర్థం చేసుకొమ్మని వేడుకుంటున్నారు.

"నేను భీమా నదిని
నిజ్జంగా తెలియకే అడుగుతున్నాను.
తల్లీ, ఈ బిడ్డలకు మరణం కన్నా ముందు
బెయిలెందుకు రావట్లేదు ?"

ఇది న్యాయవాదులను సైతం కలవరపరిచే ప్రశ్న.


ఇంత కవిత్వం రాశాక, తన డిమాండ్స్‌ను కూడా విస్పష్టంగా రాసి, ఏం జరుగుతుందో ఏమోనన్న భయం, మొహమాటం తనకు లేవని కవి ప్రకటించారు.

"నేను భీమానదిని/ ఆఖరిసారి హెచ్చరిస్తున్నాను.
సాయిబాబాని విడిచిపెట్టు
నా ప్రియాతి ప్రియమైన కవి వరవరరావును కూడా.
స్టాన్ స్వామి సమాధి వద్ద పుష్ప గుచ్ఛం ఉంచు
నీ గుండెలవిసిపోయే లోవు
దాహం తీర్చుకోవే ఇండియా! కాస్త తెరిపిన పడు."

తన ధర్మాగ్రహంతో స్వదేశీ పాలనలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుకోమంటూ శ్రీరాం ఈ కవిత్వ సంపుటిలో ఆక్రోశించారు. అక్కడక్కడా కొన్ని ఇబ్బందికర పోలికలున్నాయి. అలాగే భీమా కోరేగావ్ చారిత్రక నేపథ్యాన్ని తెలిపే వివరాలను ఖఅఅవఞ–బతీవగా ఇస్తే బాగుండేది. మొత్తంమీద ఇది యువకవులకు సవాలు. సమకాలీన కవిత్వాన్ని నేల మీద నడవమని, వాస్తవాలను చూపించే అగ్నికణికగా మారమనే సవాల్. శ్రీరాం కవిత్వం చదివాక ఒక ఉద్దీపన, ఒక స్ఫూర్తి, నమ్మిన సిద్ధాంతం కోసం నిటారుగా నిలబడే ప్రేరణ మనలో నిండుతాయి.

– కాళ్ళకూరి శైలజ
98854 01882

సామాజిక పోరాటాలపై పరిశోధన



పుస్తకం

ప్రముఖ కవి, పరిశోధకుడు, ఉత్తమ అధ్యాపకుడు డాక్టర్ బద్దిపూడి జయరావు దళిత సాహిత్యంపై పరిశోధన చేసి, ఆ సిద్ధాంత గ్రంథాన్ని ప్రచురించినందుకు ఆయనకు ముందుగా నా అభినందనలు. 'తెలుగులో దళిత సంఘటన కవిత్వం–అనుశీలన' పేరుతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, రాజమండ్రి సాహిత్య పీఠంలో డాక్టర్ జి.ఎస్. భాస్కరరావు గారి పర్యవేక్షణలో ఈ పరిశోధనను పూర్తి చేశారు. ఈయన కవిత్వం హృదయాన్ని కదిలిస్తుంది. అలాగే, ఈ పరిశోధన గ్రంథంలోని ప్రతి వాక్యం కూడా అంత శక్తివంతంగా కదిలించేలా ఉంది. సమాజంలో అనేక సంఘటనలు జరుగుతుంటాయి. అవన్నీ సాహిత్యాన్ని సృష్టించలేకపోవచ్చు. కొన్ని సంఘటనలు మాత్రం ఎంతో సాహిత్యాన్ని సృష్టిస్తాయి. ముఖ్యంగా దళితులపైన, పీడితులపైన, స్త్రీలపైన, దేశభక్తికి సంబంధించిన అంశాలపైన, మరికొన్ని ప్రకతి పరంగా జరిగిన హతాత్పరిణామాలపైనా ఎంతో సాహిత్యం వచ్చింది. ఆ సంఘటనలపై ఎన్నో సిద్ధాంత గ్రంథాలు కూడా వచ్చాయి. కానీ, దళితులపై జరిగిన దాడులు, ఆ సంఘటనలనే నేపథ్యంగా చేసుకొని సిద్ధాంత గ్రంథాలు రాలేదు. కానీ, ఒక్కొక్క సంఘటన, ఆ సంఘటన ఆధారంగా వచ్చిన సాహిత్యంపై సిద్ధాంత గ్రంథాలు వచ్చాయి. కానీ, ఆ సంఘటనల క్రమ పరిణామాన్ని, ఆ పరిణామంలో కనిపించే సైద్ధాంతిక సమన్వయాన్ని తన సిద్ధాంత గ్రంథంలో పరిశోధకుడు చక్కగా విశ్లేషించారు.

డా. బద్దిపూడి జయరావు చేసిన ఈ పరిశోధన ద్వారా సమాజ స్వరూపం మన కళ్ళకు కట్టినట్లు కనిపిస్తోంది. సామాజిక అంతరాలు కూడా స్పష్టంగా కనిపిస్తాయి. కొన్ని ఏండ్లుగా కొన్ని వర్గాలు, కొన్ని కులాలు– మరి కొన్ని వర్గాలు, మరికొన్ని కులాలను ఏవిధంగా పీడిస్తున్నాయో తెలుసుకోవటానికి, చరిత్రలోను, సాహిత్యంలోను అది ఎలా రికార్డు అయిందో తెలుసుకోవటానికి ఈ పరిశోధన చదవాలి. ఈ పరిశోధనంతా చదువుతుంటే ఇన్ని కష్టాలను, బాధలను ఓర్చుకుని దళితులు ఇన్నాళ్లుగా ఎలా జీవించగలుగుతున్నారో ఆశ్చర్యమేస్తుంది. కంచికచర్ల కోటేశు సజీవ దహనం తర్వాత జరిగిన అనేక సంఘటనలను, దానికి ముందు ఉన్న దళిత ఉద్యమ స్వరూప స్వభావాలను గుర్తించడానికి కూడా ఈ పరిశోధన గ్రంథాన్ని అధ్యయనం చేయాల్సిందే! ఈ విషయాన్ని వివరించే ముందు పరిశోధకుడు పాటించిన ఒక నవ్య పరిశోధనా పద్ధతి గురించి మనం చెప్పుకోవాలి. ఇది నాలుగు అంచెలుగా జరిగిందని సూత్రీకరించే అవకాశం ఉంది.

1. చరిత్రలో జరిగిన సంఘటన, అంటే ప్రజలకు తెలిసిన సంఘటనను తెలియజేస్తూ మొదటి దశలో దాన్ని పరిచయం చేస్తాడు పరిశోధకుడు.
2. రెండవ దశలో ఆ సంఘటనకు సంబంధించిన పూర్వపరాలను అన్వేషిస్తాడు. ఆ అన్వేషణ కేవలం గ్రంథాల్లో దొరికేది, తీర్పుల్లో దొరికేది కూడా కాదు; ఆ సంఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లి వాస్తవాన్ని అన్వేషించేది. ఆ అన్వేషణ ఆ సంఘటన జరిగిన వ్యక్తుల సజీవ అనుభవాలను రికార్డు చేసేది. ఆ సంఘటనను ప్రత్యక్షంగా చూసిన వాళ్ళ అనుభవాలను రికార్డు చేసేది. పుస్తకాలు, పత్రికలు, డాక్యుమెంటరీలు, వీడియోల నుంచి; మనుషుల నుంచి, స్థలాల నుంచి, ప్రభుత్వం నుంచి, చట్టాల నుంచి, న్యాయస్థానాల నుంచీ సమాచారం సేకరించారు.
3. అలా సేకరించిన సమాచారాన్ని మరలా తాను ఆ సారాంశాన్ని ఎంతో ఆసక్తిగా చెప్పడం పరిశోధకుడిలోని గొప్ప సజనాత్మక నైపుణ్యానికి నిదర్శనం. ఇది మూడవ దశ.
4. నాలుగవ దశలో శాస్త్రీయంగా దాన్ని సిద్ధాంతం చేయడం లేదా ఒక సిద్ధాంతానికి సమన్వయం చేయడం. అది కూడా పరిశోధకుని ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తుంది.

సామాజిక బాధ్యతతో చేసిన పరిశోధనను మళ్లీ సమాజం వైపు తీసుకువెళ్లడానికి రూపొందించుకున్న ఒక ప్రత్యేక పరిశోధన విధానం ఈ సిద్ధాంత గ్రంథంలో నిక్షిప్తమై ఉంది.

ఈ ప్రత్యేక పరిశోధన విధానాన్ని గమనించని వారికి ఈ సిద్ధాంత గ్రంథం మళ్లీ ఒక కథ చెప్తున్నట్లు అనిపిస్తుంది. ఏ పరిశోధన విధానాన్నీ పాటించకుండా చెప్తున్నట్లనిపిస్తుంది. సంఘటనల్ని ప్రధానంగా చేసుకొని ఈ పరిశోధకుడు తన సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించాడు. భారతీయ సమాజాన్ని ప్రశ్నించిన అనేక సంఘటనల్లో ఈ దళితుల మీద జరిగిన దాడుల సంఘటనలను తన పరిశోధనకు తీసుకున్నారు. కొన్ని సంఘటనలు, దానిపై వచ్చిన కవిత్వం, దాని ఆధారంగా తన సైద్ధాంతిక విశ్లేషణ ఎలా కొనసాగిందో ప్రస్తావిస్తాను.

కంచికచర్ల కోటేశు సంఘటన (1969). మీద ఎంతో మంది కవిత్వం రాశారు. ఈ సందర్భంగా ఆ సంఘటనలన్నింటినీ కూడా పరిశోధకుడు ఒక క్రమపద్ధతిలో వివరిస్తాడు. అంతర్జాతీయంగా కలిగించిన ప్రభావాన్ని కూడా విశ్లేషిస్తాడు. ఒక దళితుడి ప్రేమను, ఒక దళితుడి నిస్సహాయతను, దళితేతర స్త్రీ దళితుణ్ణి ప్రేమించినా, కామించినా దాన్ని వాళ్ళు వక్రీకరించి దళితులపై సామూహిక దాడులెలా చేస్తారో ఆ సంఘటన తెలియజేసిందనే స్పహను కలిగిస్తాడు. దళితేతరులు తమ తప్పు బయటపడకుండా కప్పిపుచ్చుకోవడానికి ఎలా ప్రయత్నిస్తారో ఈ సంఘటన తెలియజేసిందని వ్యాఖ్యానిస్తాడు. కంచికచర్ల కోటేశు ప్రేమ ఒక అంటరాని ప్రేమగా అభివర్ణించిన కలేకూరి ప్రసాద్ కవిత తెలుగు సాహిత్యంలో దళితులు ప్రేమిస్తూ సజీవంగా దహనమైపోవడానికైనా ఎలా సిద్ధపడిపోతారో ఈ సంఘటన ద్వారా చాటి చెప్తుందని సిద్ధాంతీకరిస్తాడు. తన తప్పు లేకపోయినా నవ్వుతూ చితి మంట మీద కాలిపోయిన దళితుడి పవిత్రమైన ప్రేమకు కంచికచర్ల కోటేశు సంఘటన ఒక సజీవ ఉదాహరణ నిలిచిపోయిందంటాడు.

కారంచేడు సంఘటన (1985) : అంబేద్కర్ తెచ్చిన చైతన్యం దళితుడిని చదువుకోడానికి ప్రేరేపించింది. అంబేద్కర్ తెచ్చిన చట్టాలు బహుజనుల అందరిలోనూ ఒక చైతన్యాన్ని నింపాయి. ఒకవైపు తమ శ్రమతో భూమిని బంగారు పంటలు పండించడం, మరొకవైపు అంబేద్కర్ ఇచ్చిన చైతన్యంతో అవమానాల్ని పోగొట్టుకోవడానికి ఆత్మగౌరవం నిలబెట్టుకోవడానికి చదువుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ చైతన్యం నేడు బహుజనుల అందరిలోనూ వస్తోంది. కానీ, ఆ చదువులకు తగిన ఫలితం పొందుతున్నారా? లేదా? అనేది మరో కోణం. తమకు శ్రమ చేసిన వాళ్ళు, తమకు జీవితాంతం ఊడిగం చేస్తూ బానిసలుగా బతికినవాళ్ళు, నేడు తలెత్తుకొని నిలబడటం, ఆత్మగౌరవంతో మాట్లాడడం ఆధిపత్య వర్గాలకు నచ్చలేదు. దాడి చేయడానికి ఎదురుచూశారు. దాని ఫలితమే కారంచేడులో దళితుల ఊచకోత సంఘటన. ఈ సంఘటన ద్వారా ప్రజా గాయకుడు గద్దర్ కేవలం వర్గ స్పహ మాత్రమే కాకుండా కుల చైతన్యం కూడా తోడై 'దళిత పులులమ్మా... కారంచేడు భూస్వాములతో కలబడి, నిలబడి పోరు చేసిన దళిత పులులమ్మ' అనే పాట ఆవిర్భావానికి కారణమైందని వ్యాఖ్యానిస్తారు.

నీరుకొండ సంఘటన (1987) : రాజకీయంగా తమ ఓటమి లేదా తమ వైఫల్యాలను సమీక్షించుకోలేని కొన్ని ఆధిపత్య కులాలు, వర్గాలు ఆ అసహనాన్ని కూడా దళితుల మీద చూపించి దాడులు చేసే ఒక వికృతమైన స్వభావానికి నిదర్శనంగా నిలుస్తుందీ ఈ సంఘటన. కొన్ని ఆధిపత్య కులాల వాళ్ళు తమ పదవి పోయినందుకే దళితులు సంతోషంతో కొబ్బరికాయలు కొట్టారని భావించి, నీరుకొండ దళితుల మీద దాడి చేయడం అనేది ఎంత వికతమైన చర్యో గమనిస్తే తెలుస్తుంది.

ఇలా ఒక్కొక్క సంఘటన దళితుల్లోని ఒక్కొక్క పార్శ్వాన్ని, ఒక్కొక్క పోరాట పటిమనీ బయటకు తీసుకురావడానికి కారణమయింది. అది ఈ సిద్ధాంత గ్రంథంలో ఉన్న ప్రధానమైన ప్రతిపాదన. దీన్ని ఆకట్టుకునేలా, అర్థమయ్యేలా వివరించడం ఈ పరిశోధనలో కనిపించే శైలీ రమ్యత.

కొన్ని కులాలకు లేదా కొన్ని వర్గాలకు అధికారం వచ్చినంత మాత్రాన వారికి అన్నీ లభించినట్లు కాదు. అధికారం వచ్చిన తర్వాత కూడా దాన్ని నిలబెట్టుకోవడానికి సామాజికంగా బలం కావాలి. అది సామాజిక చైతన్యంతో కూడిన ఆర్థికశక్తుల వల్ల మాత్రమే సాధ్యం అవుతుంది. ఆ చైతన్యం వల్ల తమ సంస్కృతి గొప్పదనే భావన కలిగిన వాళ్ళు దాన్ని ఉన్నతమైనదానిగా కూడా ప్రచారం చేస్తారు. ఆ ప్రచారం వల్ల సంస్కృతిలో విలువల వ్యాఖ్యానం మొదలవుతుంది. అలాంటి విలువల వ్యాఖ్యానం చేసేటప్పుడు వీరి చరిత్ర ఆ విలువల వ్యాఖ్యానానికి ఆటంకంగా నిలుస్తుంది. వారి చరిత్ర, సంస్కృతి ఇంత ఉన్నతమైంది కాకపోయినా అధమ స్థాయిలో ఉందని నిరూపించడానికి కూడా ఇలాంటి సంఘటనాత్మక కవిత్వం ద్వారా వచ్చిన సైద్ధాంతిక గ్రంథాలు ఎంతగానో తోడ్పడతాయి. అప్పుడు సాంస్కృతిక విలువల పునర్వ్యాఖ్యానం మొదలవుతుంది. ఇవన్నీ ఊహించిన వాళ్ళు చరిత్రని నిషేధించాలన్నారు. చరిత్ర నిషేధించినా, జరిగిన ఆ సంఘటనల ఆధారంగా వచ్చిన సాహిత్యం ఏమైపోతుంది? ఆ సాహిత్యాన్ని సిద్ధాంతీకరించిన భావాలేమైపోతాయి? ప్రజల మెదళ్ళలో కొలువై కూర్చుంటాయి. అవన్నీ ప్రశ్నలై తలెత్తుకుని నిలబడేలా చేస్తాయి. కొన్ని సంఘర్షణలు ముందుకు వస్తాయి. కార్ల్ మార్క్స్ సిద్ధాంతాలు, మహాత్మాజ్యోతీ బా ఫూలే, అంబేద్కర్ సిద్ధాంతాలు... ప్రజల్ని ఎలా ఆలోచనలో పడేసాయో, ఈ సిద్ధాంతాలు కూడా అలాంటి ఆలోచనలకు మరింత పదును పెడుతూ కుసంస్కృతిని ప్రశ్నిస్తాయి. అలాంటి గురుతర బాధ్యతను ఈ సిద్ధాంత గ్రంథం కూడా నిర్వహించబోతోంది.

తనకు డాక్టరేట్ డిగ్రీ కావాలనుకుని మాత్రమే చేసిన పరిశోధన కాదిది. ఒక సామాజిక పరివర్తనను ఆశించిన పరిశోధన. తెలుగు సాహిత్యంలో దళిత సాహిత్య ప్రత్యేకతను తెలిపిన పరిశోధన, దళిత ఉద్యమాన్నీ, దళిత సాహిత్య ఉద్యమాన్నీ ఒక సైద్ధాంతిక దక్పథంతో సమన్వయించిన పరిశోధన. ఇంత గొప్ప పరిశోధన చేసిన డా.బద్దిపూడి జయరావు గారిని సమాజంలో జరుగుతున్న వివిధ సామాజిక ఉద్యమాల్ని, వారి సమస్యల్ని అర్థం చేసుకోవాలను కొనేవారందర్నీ ఈ సిద్ధాంత గ్రంథాన్ని చదవాలని కోరుతున్నాను.

– ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు,
తెలుగు శాఖాధ్యక్షుడు,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

అంతిమంగా ...

కాసిన్ని ఉదయాలు, సాయంత్రాలు
మరి కాసిన్ని నిరాశలు నిట్టూర్పులు
హరివిల్లులు వాన జల్లులు
ఎముకలు కొరికే చలి
వడగాడ్పులు
ఒక్కటేమిటి
వీటినే కాదు
జీవరాసులన్నింటినీ
ఎంతో నిబ్బరంగా మోసుకు తిరుగుతున్న
నిండు గర్భవతి తాను

వచ్చే వాళ్ళు వస్తుంటారు
వెళ్లే వాళ్ళు వెళుతుంటారు
ఏదీ శాశ్వతం కాదని తెలిసినా
బండ రాళ్ళ మీదనో
రాతి గుండెల మీదనో
రివ్వున వీచే గాలి అలల మీదనో
మన పేరు ఉండాలనుకుంటాం
చిత్రంగా లేదూ ..!

ఎంత అత్యాశో కదూ
స్థిరంగా నిలబడలేని మనసు కూడా
రెక్కలు కట్టుకుని
ఆకాశానికి ఎగరాలనుకుంటుంది
చెదిరిపోయిన గూటిలో తలదాచుకోవాలని
ఏ పక్షీ కోరుకోదు
అవసరం మాత్రమే కాదు
పొంచివున్న ఆపద కూడా
పోరాడి గెలవమనే పాఠాలు నేర్పుతుంది

ఇరుకిరుకు గదులనుకుంటాం కానీ
ఇంత లేసి ఆనందాల నిధుల్ని
తవ్వి పోసుకున్న అండపిండ బ్రహ్మాండమది
అమ్మ కడుపులో ఉన్నంత స్వేచ్ఛ
మరెక్కడ దొరుకుతుందనీ ...

పగలు ప్రతీకారాలు
అణచివేతలు, ఆధిపత్యాలు
బంగారు కలల్లో బందీ ఐన క్షణాలు
వీటన్నింటితో పెనవేసుకుపోయిన
కాలమెంత టక్కరిదో కదూ
ఇన్నిన్ని ఉక్కపోతలతో
ఉక్కిరిబిక్కిరి చేసి చంపేస్తుంది

పరితాపాలు, ప్రలోభాలు
ఆరంభ సంరంభాలు
ఆఖరి పోరాటాలు
పసి పాపలు, పసిడి నవ్వులు
ఉద్రేకాలు, యుద్ధాలు, ఆక్రమణలు
నిస్సహాయతలు, నిర్వేదాలు
చివరికి ఎవరిని ఎటు విసిరేస్తుందో
ఈ పట్టుకనే రహస్య పీఠిక
ఎప్పుడూ మనం వెంటేసుకు తిరిగే
ఈ మరణమే సమాధానం చెప్పాలి!

– వైష్ణవి శ్రీ
80742 10263

పాడి రైతులకు పరిహారం ఏదీ?

- పశువుల పెంపకందారులకు అందని బీమా డబ్బులు
- రెండున్నరేళ్లుగా ఆగిన పరిహారం చెల్లింపులు
- ఆందోళనలో పాడి రైతులు



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం పశు బీమా పథకాన్ని అటకెక్కించింది. మృత్యువాత పడిన పశువులకు రెండున్నరేళ్లుగా డబ్బులు చెల్లించడం లేదు. ఇన్సూరెన్స్ సొమ్ములు ఎప్పుడు వస్తాయంటూ పశుసంవర్ధకశాఖ అధికారుల చుట్టూ పాడి రైతులు తిరుగుతున్నారు. ప్రజాప్రతినిధులను కలిసి తమ సమస్యను మొరపెట్టుకుంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల బారిన పడిన పశుపెంపకందారులను ఆదుకునేందుకు అమలు చేస్తున్న ఈ పథకంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో, పాడి రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పథకాన్ని నిలిపివేసినట్టు ప్రచారం సాగుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.

పాడి రైతులు తమ పశువుల బీమాకు ఎటువంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పడంతో, రైతులు సొంతంగా బీమా చేయించుకోలేదు. 2020 నుంచి ఈ పథకం ద్వారా ఎవరికీ లబ్ధి చేకూరడం లేదు. పశువుల బీమా ఉంటే మేలుజాతి పశువు మృతి చెందితే రూ.30 వేలు, సాధారణ రకమైతే రూ.15 వేలు చెల్లిస్తారు. పశువు మృతి చెందిన 24 గంటల్లో రైతు పశు వైద్యాధికారికి సమాచారం ఇస్తే, 48 గంటల్లో పోస్టుమార్టం పూర్తి చేసి ఆప్‌లో సంబంధిత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేసేవారు. పశు సంవర్ధకశాఖ డీడీ, ఎడి, ఇద్దరు పశువైద్యుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసేవారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత అధికారులు ఆమోదం తెలిపేవారు. ఈ పథకానికి సంబంధించి జిల్లాలో రూ.12.50 కోట్ల బకాయిలు ఉన్నాయి.

రెండున్నరేళ్లుగా అందని నష్టపరిహారం

వైఎస్సార్ పశు బీమా పథకం అమలుకు ముందు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పశునష్ట పరిహారం పేరుతో 2019 నుంచి అమలు చేసింది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మృత్యువాత పడిన పశువులకు ఎటువంటి డబ్బులు తీసుకోకుండానే పరిహారం కోసం పేర్లను నమోదు చేసుకున్నారు. తొలుత కొంతమందికి డబ్బులు చెల్లించినా, మిగిలిన వారికి రెండేళ్లుగా డబ్బులు చెల్లించడం లేదు. ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే 4,458 పశువులకు రూ.12.50 కోట్లను చెల్లించాల్సి ఉంది. 2021 జూన్ నుంచి పరిహారం చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి.

తాము బిల్లులు పంపినా రిజర్వు బ్యాంకు కోర్టీలో క్లియరెన్స్ కావడం లేదని అధికారులు చెప్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాన్ని పట్టించుకోకపోవడంతో, రెండున్నరేళ్లుగా రైతులు పరిహారానికి నోచుకోవడం లేదు. ఇన్సూరెన్స్ సొమ్ము ఎప్పుడు వస్తాయంటూ పశుసంవర్ధక అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రజాప్రతినిధులను కలిసి తమ సమస్యను మొరపెట్టుకుంటున్నారు. కొత్తగా పశువుల కొనుగోలుకు చేతిలో చాలినంత డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పశువుల పెంపకం మీదే ఆధారపడి బతుకుతున్న కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులను చవిచూస్తున్నారు.

లారీ దూసుకొచ్చి ఇళ్లు ధ్వంసం

- తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి- శాంతిపురం (చిత్తూరు జిల్లా)

చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి గ్రామంలో ఆదివారం ఓ లారీ బీభత్సం సృష్టించింది. అతివేగంతో కుప్పం వైపు వస్తుండగా అదుపు తప్పి ఓ ఇంటిలోకి దుసుకొచ్చింది. ఆ సమయానికి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు.. గుండిశెట్టిపల్లి గ్రామ జాతీయ హైవే పక్కన సుమారు 50 అడుగుల దూరంలో బి.జయరాం నూతనంగా గృహం నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. కుప్పం వైపు ఇనుప వస్తువుల లోడుతో వస్తున్న ఈచర్ లారీ అదుపుతప్పి జాతీయ రహదారికి పక్కన ఉన్న ఇంట్లోకి దూసుకొచ్చింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేనందువల్ల ప్రాణాపాయం తప్పింది. ఇంటిలోనిలోని విలువైన వస్తువులు, గృహం చాలావరకు ధ్వంసం అయ్యాయి. రాళ్లబూదుగూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఎన్నాళ్లిలా డోలీ కష్టాలు..!

- నిత్యం అవస్థలు పడుతున్న గిరిజనులు... పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి-అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా)

మారుమూల గిరిజన గ్రామాల గిరిజనులకు డోలి కష్టాలు తప్పలేదు. సరైన రోడ్డు సౌకర్యాలు లేక పోవడంతో వైద్య సేవలు అందక గిరిజన రోగులు మృత్యువాతకు గురవుతున్న ఘటనలు జరుగుతున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పిన్నకోట పంచాయతీ రాసకిలం గ్రామానికి చెందిన సూకురు బాబురావు గత కొన్ని రోజులుగా అనారోగ్య కారణంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు ప్రథమ చికిత్స నిమిత్తం దుప్పటి డోలి కట్టి గ్రామం నుండి ఏడు కిలోమీటర్లు కొండకోనల నడుమ నుండి పిన్నకోట ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు రిఫర్ చేశారు. అక్కడ నుండి అనకాపల్లి జిల్లా దేవరాపల్లి ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా పిన్నకోట ,పెద్దకోట, జీన్నబడు పంచాయతీ పరిధి మారుమూల గ్రామాలకు రోడ్డు లేక గిరిజనులు అనారోగ్యం పాలైనప్పుడు డోలీలోనే తరలించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు

పబ్లిక్ మోటారు వాహనాలపై జీవితకాల పన్ను సరికాదు

- దానిని రద్దు చేయాలి
- తమిళనాడు ప్రభుత్వానికి యజమానులు, డ్రైవర్ల డిమాండ్
- సీఐటీయూతో సహా పలు కార్మిక సంఘాల మద్దతు

చెన్నై : ప్రభుత్వ మోటారు వాహనాలపై జీవిత కాలపు పన్ను విధించాలన్న తమిళనాడు ప్రభుత్వ నిర్ణయం అగ్గి రాజేసింది. ఈ పన్నును రద్దు చేయాలని యజమానులు, డ్రైవర్లు తమ డిమాండ్‌ను వినిపిస్తున్నారు. గత నెల వరకు ప్రభుత్వ మోటారు వాహనాలపై ప్రభుత్వం త్రైమాసిక పన్నులు వసూలు చేసేది. ప్రస్తుతం జీవితాంతం పన్ను చెల్లించాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం తమిళనాడు మోటార్ వెహికల్స్ టాక్సేషన్ యాక్ట్, 1974ను ఈ ఏడాది అక్టోబర్‌లో సవరించింది. జీవితకాల పన్నులు, కొత్త మోటారు వాహనాల రిజిస్ట్రేషన్‌ను పెంచింది. నవంబరు 7న సవరణలు అమలులోకి వచ్చాయి.

అన్యాయమైన ఆన్‌లైన్ జరిమానాలు, యాప్ కంపెనీల దోపిడీ, పెరిగిన టోల్ ఛార్జీలు, అగ్రిగేటర్ నిబంధనల కారణంగా ప్రస్తుతం ఆర్థికంగా నష్టపోతున్నామని పేర్కొంటూ.. సవరణలను వాహన యజమానులు, డ్రైవర్ల సంఘాలు వ్యతిరేకించాయి. ఈ సమయంలో తమిళనాడు ప్రభుత్వం విధించిన జీవితకాల పన్ను ఆమోదయోగ్యం కాదని వారు పేర్కొన్నారు. ఈ కొత్త లెవీని తక్షణమే విరమించుకోవాలనీ, ఇది మోటారు పరిశ్రమ, దానిపై ఆధారపడిన కార్మికులపై మరింత ప్రభావం చూపుతుందని వారు స్పష్టం చేశారు. పాత పద్ధతినే పాటించాలని మోటారు వాహనాల సంఘం తరపున డ్రైవర్లు, యజమానులు కోరుతున్నారు.

ప్రభుత్వం విధించిన 100 శాతం లైఫ్ ట్యాక్స్‌ను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ నిరసన ప్రదర్శనకు దిగింది. ఆల్ ట్రేడ్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ తరపున కోయంబత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో రోడ్డు రవాణా సంఘాలు, మోటారు వాహనాల యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

కోవిడ్-19 మహమ్మారి, ద్రవ్యోల్బణం, టోల్ ఫీజు పెంపుదల, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వంటి వరుస దాడుల కారణంగా మోటారు వాహన పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఇలాంటి తరుణంలో తమిళనాడు ప్రభుత్వం అమలు చేస్తున్న జీవిత పన్నుల పెంపు పరిశ్రమకు భారీ నష్టాన్ని తీసుకొస్తుందనీ, మోటారు వాహనాల పరిశ్రమను మరింత బలహీనపరుస్తుందని నిరసనకారులు తెలిపారు. తమ సహేతుకమైన డిమాండ్లను నెరవేర్చకుంటే రోడ్డు దిగ్బంధనం, సమ్మెతో సహా రానున్న రోజుల్లో పలు నిరసనలు చేపడతామని వారు తెలిపారు.

ఈ ప్రదర్శనలో కోయంబత్తూరు, తిరుపూర్, నీలగిరి జిల్లాల నుంచి వెయ్యి మందికి పైగా పాల్గొన్నారు. నీలగిరి జిల్లాలో 5,000కు పైగా, తిరుపూర్ జిల్లాలో 1,000కు పైగా పర్యాటక వాహనాలు నడుస్తున్నాయి. సీఐటీయూ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్, ఆల్ ట్రేడ్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ, ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు ఈ నిరసనలో పాల్గొన్నారు.

ప్రమాదకరంగా భూహక్కు చట్టం

- సివిల్ సమస్యలు జిల్లా స్థాయిలో
- రెవెన్యూ ట్రిబ్యునల్‌లోనే అప్పీల్
- 27/2023చట్టంతో రైతులకు తప్పని ఆర్థిక భారం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం ఆదేశానుసారం రాష్ట్ర ప్రభుత్వం హడావుడిగా తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ భూహక్కుల చట్టం 27/2023పై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఏడాది జనవరిలో అసెంబ్లీలో బిల్లు ప్రవేశ పెట్టి గత నెల నుంచి ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది జిల్లా స్థాయిలో సివిల్ సమస్యపై ఇకపై రెవెన్యూ ట్రిబ్యునల్‌ను మాత్రమే కక్షిదారులు ఆశ్రయించాల్సి ఉంటుంది. రెండేళ్లలోపు హైకోర్టుకు అప్పీలు చేసుకోవాలని చట్టం చెబుతోంది. ఈ చట్టం అమలుతో సన్న చిన్నకారు రైతులకు ఆర్థిక భారంతో పాటు ఆస్తులు అన్యాక్రాంతం అయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. వైసిపి అధికారంలోకొచ్చిన అనంతరం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ సర్వేలో అనేక అవకతవకలు ఇప్పటికే వెలుగులోకి వచ్చాయి. దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న తమ భూముల రికార్డులకు భిన్నంగా కొలతను ఆన్‌లైన్ చేశారని గగ్గోలు పెడుతున్నారు. గతంలో అడంగల్ (గొలుసు కట్టు) ద్వారా సర్వే చేపట్టేవారు. అనంతరం కొలతలను ప్రస్తావిస్త హద్దుల ప్రకారం దస్తావేజులు తయారు చేయించేవారు. ఈ దస్తావేజుల ఆధారంగానే ఇప్పటికీ ఆస్తి హక్కు రుజువు చేయబడుతోంది. ఎవరైనా అన్యాక్రాంతం చేసినా జిల్లా కోర్టుల్లో బాధితులు అప్పీలు చేసుకుని సరైన ధ్రువీకరణ పత్రాలను దాఖలు పర్చటం ద్వారా న్యాయం పొందుతున్నారు. కోర్టుల్లో న్యాయం లభించడం ఆలస్యమైనప్పటికీ తీర్పు అనంతరం ఊరట కలుగుతోంది. ప్రభుత్వం తాజా నిర్ణయం ప్రజలను మరింత ఇబ్బందులకు గురి చేసేలా ఉంది. సివిల్ సమస్యలు సృష్టించిన వారికే నిర్ధారించే బాధ్యతలు అప్పజెప్పటం విమర్శలకు దారి తీస్తోంది. తాజా నిర్ణయంతో బాధితులు స్థిరాస్తి హక్కుల కోసం రెవెన్యూ ట్రిబ్యునల్‌లో అప్పీల్‌కు వెళ్లాల్సి ఉంటుంది. రెండు సంవత్సరాల్లోపు ఈ వివాదాలపై బాధితులు అభ్యంతరాలు తెలిపాలి. హై కోర్టులో అప్పీలు చేసుకోవాల్సి ఉంటుంది. గడిచిన 20 ఏళ్లుగా భూముల ధరలు గణనీయంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా బలం ఉన్న వారు తమ హద్దులు దాటి చిన్న, సన్నకారు రైతుల భూములను అన్యాక్రాంతం చేయటం పరిపాటిగా మారింది. మరి కొందరు మరో అడుగు ముందుకు వేసి నకిలీ దస్తావేజులు సృష్టించి సన్న చిన్న కారు రైతుల భూములను ఆక్రమించుకున్న దాఖలాలు కోకొల్లలు. ఇటువంటి సందర్భంలో బాధితులు జిల్లా స్థాయిలో సివిల్ కోర్టులను ఆశ్రయించి న్యాయవాది ద్వారా ని న్యాయం పొందుతున్నారు. తాజా నిర్ణయంతో ఇకపై రెవెన్యూ ట్రిబ్యు నల్‌లో పరిశీలించిన అనంతరం వాదోపవాదనల

అటకెక్కిన రేషన్ డోర్ డెలివరీ

- కార్డుదారులకు తప్పని తిప్పలు

పజాశక్తి-బొమ్మనహాల్ (అనంతపురం జిల్లా)


రేషన్ షాపు నుంచి బియ్యం తీసుకెళ్తున్న మహిళ

రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన రేషన్ డోర్ డెలివరీ కార్యక్రమం బొమ్మనహాల్ మండల పరిధిలోని చాలా గ్రామాల్లో అటకెక్కిందని చెప్పవచ్చు. మండల వ్యాప్తంగా 33 గ్రామాల్లో 40 చౌకధాన్య డిపోల పరిధిలో 20వేల రేషన్ కార్డులు ఉన్నాయి. ఆయా గ్రామాలకు మొత్తం 9 ఎండియు వాహనాలను కేటాయించారు. అయితే స్వల్ప కాలం లోనే వాహనాలకు ఆపరేటర్ లేక తూకాలు వేసే వారికి కూలి గిట్టుబాటుకాక ఎక్కడికక్కడ ఎండియు వాహనాల సేవలు ఆగిపోయాయి. దీనికి తోడు చాలా చోట్ల డీలర్లు రేషన్ షాపుల్లోనే నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో షాపు వద్దకే వెళ్లి బియ్యం, చక్కెర, కందిబేడలు, తదితర సరుకులు తెచ్చుకుంటున్నామని కార్డుదారులు పేర్కొంటున్నారు. ప్రధానంగా వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు రేషన్‌షాపునకు వెళ్లి సరుకులు తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వాహనాలు కొనుగోలు చేసినా ప్రయోజనం ఏంటని కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో వాహనాలు మరమ్మతులు, డీజిల్ కొరత, కూలీలకు అరకొర వేతనం, అదీ నెల నెలా సక్రమంగా చెల్లించకపోవడంతో తమకు గిట్టుబాటు కావడం లేదని కొందరు పైలెట్లు వాపోతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి రేషన్ సరుకులు ఇంటికి చేరేలా చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు. ఈ విషయంపై తహశీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని, అలా జరిగితే చర్యలు తీసుకుంటామని దాటవేశారు.

● రాష్ట్రంలో నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్రకు విశ్వసనీయత లేదని వైసిపి యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండా రాజీవ్‌గాంధీ విమర్శించారు. ఆదివారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. లోకేష్ పాదయాత్రకు ప్రజల్లో ఎక్కడా ఆధరణ కనిపించడం లేదన్నారు. ఆదరణ రానందునే అబద్దాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

OFFICE OF THE RECOVERY OFFICER - I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
31-31-21, Sai Baba Street, Narayan Bhawan, Dabagardens, Visakhapatnam -530020

DEMAND NOTICE

(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME-TAX ACT, 1961)
RC / 347 / 2023 13-12-2023
Union Bank of India (e-Andhra Bank), Gudivada Branch, Krishna District
Versus
Sri. Kodali Nageswara Rao

To
(CD-1) Sri. Kodali Nageswara Rao, S/o. Arjuna Rao, D.No. 10/158-D4, 2nd Lane, Rajendra Nagar, 10th Ward, Gudivada, Krishna District.

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Hon'ble Presiding Officer, **DEBTS RECOVERY TRIBUNAL VISAKHAPATNAM in OA / 337 /2020** an amount of **Rs. 1,27,43,767/-** (Rupees One Crore Twenty Seven Lakhs Forty Three Thousand Seven Hundred Sixty Seven only) along with the pendentelite and future interest **@ 10.20% p.a.** compounded with quarterly rests w.e.f. 09.03.2020 till realization / date of payment and the cost become due against you (Jointly and severally / Fully / Limited)
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned **on 21/12/2023 at 10.30 a.m.** for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay :
a) Such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.
b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount due.
6. Attention is invited to Rule 16 of the second schedule to the Income Tax Act, 1961 which is reproduced below :
16 (1) Where a notice has been served on a defaulter under Rule 2, the defaulter or his representative in interest shall not be competent to mortgage, charge, lease or otherwise deal with any property belonging to him except with the permission of the Recovery Officer, nor shall any Civil Court issue any process against such property in execution of a decree for the payment of money.
16 (2) Where an attachment has been made under this Schedule, any private transfer or delivery of the property attached or of any interest therein and any payment to the defaulter of any debt, dividend or other moneys contrary to such attachment shall be void as against all claims enforceable under the attachment.

Given under my hand and the seal of the Tribunal, on this day 13th December 2023
(Avasarala Anil)
Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

OFFICE OF THE RECOVERY OFFICER - I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
31-31-21, Sai Baba Street, Narayan Bhawan, Dabagardens, Visakhapatnam -530020

DEMAND NOTICE

(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME-TAX ACT, 1961)
RC / 357 / 2023 13-12-2023
Union Bank of India (e-Andhra Bank), Gudivada Branch, Krishna District
Versus
Sri. Kappari Suri Narasimha Rao and others

To
(CD-1) Sri. Kappari Suri Narasimha Rao, S/o. Sri. Venkateswara Rao, D.No. 15`14, Challapalli Road, Arandalpeta, Pamarru, Krishna Dist.

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Hon'ble Presiding Officer, **DEBTS RECOVERY TRIBUNAL VISAKHAPATNAM in OA / 125 /2020** an amount of **Rs. 84,60,349.60 PS /-** (Rupees Eighty Four Lakhs Sixty Thousand Three Hundred Forty Nine and Sixty Paisa only) along with the pendentellite and future interest **@ 10.20% p.a.** compounded with quarterly rests w.e.f. 04.02.2020 till realization / date of payment and the cost become due against you (Jointly and severally / Fully / Limited)
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned **on 21/12/2023 at 10.30 a.m.** for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay :
a) Such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.
b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount due.
6. Attention is invited to Rule 16 of the second schedule to the Income Tax Act, 1961 which is reproduced below :
16 (1) Where a notice has been served on a defaulter under Rule 2, the defaulter or his representative in interest shall not be competent to mortgage, charge, lease or otherwise deal with any property belonging to him except with the permission of the Recovery Officer, nor shall any Civil Court issue any process against such property in execution of a decree for the payment of money.
16 (2) Where an attachment has been made under this Schedule, any private transfer or delivery of the property attached or of any interest therein and any payment to the defaulter of any debt, dividend or other moneys contrary to such attachment shall be void as against all claims enforceable under the attachment.

Given under my hand and the seal of the Tribunal, on this day 13th December 2023
(Avasarala Anil)
Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

OFFICE OF THE RECOVERY OFFICER - I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
31-31-21, Sai Baba Street, Narayan Bhawan, Dabagardens, Visakhapatnam -530020

DEMAND NOTICE

(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME-TAX ACT, 1961)
RC / 1233 / 2018 29-11-2023
Union Bank of India (e-Andhra Bank), Punadipadu Branch, Krishna District
Versus
M/s. Navadhenu Feed Mixing Plant

To
(CD-3) M/s. navadhenu Feed Mixing Plant, Rep. by its Porp. Mrs. Kumbham Usha Sri, W/o. Sri Venkateswara Rao, D.No. 2-12, Near St. Jones School, Gannavaram, Krishna District.

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Hon'ble Presiding Officer, **DEBTS RECOVERY TRIBUNAL VISAKHAPATNAM in OA.No. 77 of 2017,** an amount of **Rs. 23,66,601/-** (Rupees Twenty Three Lakhs Sixty Six Thousand Six Hundred One only) (inclusive of Rs. 13,15,911/- under loan account and Rs. 10,50,690/- under cash credit working capital account along with pendentellite and future interest **@ 13.50% and 12.75% p.a.** respectively) compounded with monthly rests w.e.f. 12.01.2017 till realization / date of payment and the costs of **Rs. 49,005/-** (Rupees Forty Nine Thousand and Five Only) has become due against you (Jointly and Severally)
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned **on 04/01/2024 at 10.30 a.m.** for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay :
a) Such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.
b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount due.
6. Attention is invited to Rule 16 of the second schedule to the Income Tax Act, 1961 which is reproduced below :
16 (1) Where a notice has been served on a defaulter under Rule 2, the defaulter or his representative in interest shall not be competent to mortgage, charge, lease or otherwise deal with any property belonging to him except with the permission of the Recovery Officer, nor shall any Civil Court issue any process against such property in execution of a decree for the payment of money.
16 (2) Where an attachment has been made under this Schedule, any private transfer or delivery of the property attached or of any interest therein and any payment to the defaulter of any debt, dividend or other moneys contrary to such attachment shall be void as against all claims enforceable under the attachment.

Given under my hand and the seal of the Tribunal, on this day 29th November 2023
(Avasarala Anil)
Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam


ఉక్కు దీక్షలకు మద్దతు తెలుపుతున్న పెన్షనర్లు

'ఉక్కు' దీక్షలకు పెన్షనర్ల మద్దతు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన దీక్షలకు పెన్షనర్లు మద్దతు తెలిపారు. పెన్సనర్స్ డే సందర్భంగా ఆదివారం వైజాగ్ స్టీల్‌ప్లాంట్, సెయిల్, బిహెచ్‌పివి, హెచ్‌ఎస్‌ఎల్, డబ్ల్యుఎస్‌ఎల్ వంటి ప్రభుత్వ సంస్థలలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులంతా దీక్షా శిబిరానికి తరలివచ్చి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగి దీనబంధు మాట్లాడుతూ.. పెన్షనర్లు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని బలంగా ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. ఉక్కు పోరాటానికి అన్ని విధాలా సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరు మార్చుకోకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. 1039వ రోజు దీక్షలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు, దొమ్మేటి అప్పారావు, శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.

టూరిజం కార్మికుల మెరుపు సమ్మె

● **సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**

ప్రజాశక్తి -అరకులోయ రూరల్

అల్లూరి జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలోని పద్మాపురం గార్డెన్, గిరిజన మ్యూజియం, కొత్తవలస హెచ్‌ఎన్‌టిసి కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆదివారం గిరిజన మ్యూజియం, పద్మపురం గార్డెన్ గేటు ఎదుట కార్మికులు విధులు బహిష్కరించి ఒక్కరోజు మెరుపు సమ్మె నిర్వహించారు. ఈ సమ్మెకు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, పి బాలదేవ్ మాట్లాడుతూ, గత కొంతకాలంగా సమస్యల పరిష్కరించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, జిల్లా కలెక్టర్‌లకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. అధికారులకి ముందస్తు సమాచారం ఇచ్చి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటిడిఏ పద్మాపురం గార్డెన్‌కు కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వలేదన్నారు. కనీస వేతనాలు రూ.26000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ పిఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించకపోవడం దుర్మార్గమని తెలిపారు. ఐటిడిఏ పరిధిలో పనిచేస్తున్న కార్మికులందరికీ కలెక్టర్ గెజిట్ జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.పద్మపురం గార్డెన్‌లో 2010, 2011 సంవత్సరంలో పిఎఫ్ పేరుతో కార్మిక వేతనాల్లో 12 శాతం కోత విధించి పిఎఫ్ ఆఫీస్ కి చెల్లించలేదని ఆ డబ్బులు ఏమయ్యాయో చెప్పలేదని తెలిపారు.

తక్షణం ఆ డబ్బులు కార్మికుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. తక్షణం సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే నిరవదిక సమ్మెకు వెళ్లడానికి కార్మికులంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు దాడి రాజు, డొంబు, కమిటీ సభ్యులు రాంబాబు, బాబు, సునీల్ కుమార్, చిట్టి బాబు, సురేష్ కుమార్, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు




కొత్తదనానికి తెరాభిషేకం!



సినిమా 2023

ఈ ఏడాది తెలుగు సినిమా సందడి ఇద్దరు పెద్ద హీరోలతో ప్రారంభమైంది. 'వాల్తేరు వీరయ్య'తో చిరంజీవి, 'వీర సింహారెడ్డి'తో బాలకృష్ణ సంక్రాంతి బరిలో నిలిచారు. వాళ్ల మధ్యలో 'కళ్యాణం కమనీయం' అంటూ సంతోష్ శోభన్, నెలాఖరులో 'హంట్' చేస్తానని సుధీర్‌బాబు ప్రేక్షకుల ముందుకువచ్చారు. బాలీవుడ్ సినిమా 'పఠాన్'తో షారుక్ కూడా ఆ జబితాలోకి వచ్చాడు. తొలిసారి గోపిచంద్ మలినేనితో బాలకృష్ణ తీసిన 'వీర సింహారెడ్డి' సినిమాకు ప్రేక్షకులు నీరాజనం పలికారు. అలాగే ఒక్కరోజు వ్యవధితో విడుదలైన 'వాల్తేరు వీరయ్య' కూడా చిరంజీవి కెరీర్‌లో ఓ హిట్‌ని జత చేసింది. బాబీ కొల్లితో 'అన్నయ్య' తరువాత రవితేజ కాంబినేషన్‌తో చిరంజీవి ఈ సినిమాలో నటించారు. దీంతో అటు చిరంజీవి అభిమానులు, ఇటు రవితేజ అభిమానులు థియేటర్లకు క్యూ కట్టారు. చిన్న సినిమాలతో వచ్చిన సుధీర్‌బాబు, శోభన్‌కి కూడా ప్రేక్షకులు మంచి మార్కులే వేశారు. అలా ఈ ఏడాది సినిమా శుభారంభంతో మొదలైంది.ఆరంభం జోరునే కొనసాగిస్తూ ఫిబ్రవరి, మార్చిల్లో కూడా అభిమానులు సంతోషపడే సినిమాలు పలకరించాయి. 'సార్'తో ధనుష్, 'దసరా'తో నాని, ప్రకాష్‌రాజ్ 'రంగమార్తాండ', 'బలగం' సినిమాలు విజయాలను సొంతం చేసుకున్నాయి. కళ్యాణ్ రామ్ 'అమిగోస్'కి కూడా మంచి ప్రజాదరణే దక్కింది. కిరణ్ అబ్బవరం 'వినరో భాగ్యము విష్ణు కథ', సంతోష్ శోభన్ 'శ్రీదేవి శోభన్ బాబు', విశ్వక్ సేన్ 'దాస్ కా ధమ్కీ', అనువాద చిత్రం 'సెంబి' వంటి సినిమాలను కూడా ప్రేక్షకులు ఆదరించారు.



కమెడియన్‌గా రాణిస్తున్న వేణు దర్శకుడిగా మారి తెరకెక్కించిన 'బలగం' సినిమాకు గొప్ప ప్రశంసలు వచ్చాయి. విశేష ప్రజాదరణ పొందిన చిత్రంగా కూడా నిలిచిపోయింది. పాత రోజుల్లో లాగా తెలంగాణా గ్రామాల్లో తెరలు కట్టి మరీ ఆ సినిమాను ప్రదర్శించారు. నాని మొదటిసారి రఫ్ లుక్‌లో కనిపించిన 'దసరా'కి కూడా ప్రేక్షకుల ఆదరణ వచ్చింది. నాటక రంగం ఇతివృత్తంతో తెరకెక్కిన 'రంగ మార్తాండ'కి కూడా మంచి మార్కులే పడ్డాయి. సుధీర్‌బాబు, కృతిశెట్టి జంటగా వచ్చిన 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి' చిత్రం మాత్రం ప్రేక్షకులను మెప్పించలేకపోయింది.



ఈ ఏడాది వేసవికి మాత్రం పెద్ద హీరోల సినిమాలేవీ విడుదల కాలేదు. సమంత 'శాకుంతలం', సాయిధరమ్ తేజ్ 'విరూపాక్ష' సినిమాలతో పాటు మణిరత్నం 'పొన్నియన్ సెల్వన్-2', అఖిల్ 'ఏజెంట్', గోపీచంద్ 'రామబాణం', అల్లరి నరేష్ 'ఉగ్రం', రవితేజ 'రావణాసుర', కిరణ్ అబ్బవరం 'రూల్స్ రంజన్', 'మీటర్', ఆంటోని చిత్రం బిచ్చగాడు-2 వంటి సినిమాలు విడుదలైనా 'విరూపాక్ష' మినహా మిగిలిన వేటికీ అంతగా ఆదరణ దక్కలేదు. అలా ఈ ఏడాది వేసవిలో సినిమా సందడి అంతగా కనిపించలేదు. ఏడాది ద్వితీయార్థంలో కూడా స్తబ్ధత కొనసాగింది. బాలీవుడ్ దర్శకుడు ఓం రౌత్, ప్రభాస్‌తో తెరకెక్కించిన 'ఆదిపురుష్' చిత్రం జూన్‌లో విడుదలైంది. భారీ బడ్జెట్‌తో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా ఆది నుంచే అభాసుపాలైంది. గ్రాఫిక్స్ మాయాజాలంతో కార్టూన్ ఫిల్మ్‌ని తలపించిందని, కథను వక్రీకరించారని ఇలా రకరకాల కారణాలతో ప్రేక్షకులు ఆ సినిమాని తిరస్కరించారు. అదే నెలలో చిన్న సినిమాగా వచ్చిన శ్రీవిష్ణు 'సామజవరగమన' మాత్రం ప్రేక్షకుల ఆదరణ పొందింది. ఆ నెలలోనే 'స్పై' చిత్రంతో నిఖిల్ ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఈ సినిమాని కూడా ప్రేక్షకులు ఆదరించలేదు. రానా తమ్ముడు అభిరామ్ దగ్గుబాటి డెబ్యూ సినిమాగా తేజ దర్శకత్వంలో వచ్చిన 'అహింస' కూడా అంతగా మెప్పించలేదు. జులై నెలలో విడుదలైన సాయిధరమ్ తేజ్, పవన్ కళ్యాణ్ కాంబినేషనల్లో వచ్చిన 'బ్రో' చిత్రం అభిమానులను ఖుషీ చేసింది. 'బేబీ' చిత్రంతో సాయిరాజేష్ యవత నుంచి మంచి మార్కులే పొందారు. ఆగష్టు, సెప్టెంబరు నెలల్లో మరోసారి సినిమా పండుగ కనిపించింది. 'భోళా శంకర్'తో చిరంజీవి, 'గాండీవధారి అర్జున'తో వరుణ్‌తేజ్, రామ్ 'స్కంద', సమంత, విజయ్‌దేవర కొండ 'ఖుషి', అనుష్క, నవీన్ కాంబినేషనల్లో వచ్చిన 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఈ సినిమాలన్నింటికీ మిశ్రమ స్పందన వచ్చింది. 'భోళా శంకర్' చిత్రానికి మొదటి ఆట నుండే విమర్శలు ఎదురయ్యాయి. దీంతో ఆరంభం అదిరినా కొత్తదనం లేక సినిమా పండుగ వెలవెలబోయింది.



ఏడాది చివర్లో మళ్లీ పెద్ద సినిమాల జోరు కనిపించింది. 'టైగర్ నాగేశ్వరరావు'తో రవితేజ, బాలకృష్ణ 'భగవంత్ కేసరి', నాని 'హాయ్ నాన్న', నితిన్ 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' చిత్రాలు వరుసగా అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో విడుదలై ప్రేక్షకులను కనువిందు చేశాయి. అనిల్ రావిపూడితో బాలకృష్ణ ప్రయత్నించిన 'భగవంత్ కేసరి' మంచి వ్యూస్‌ని దక్కించుకుంది. నితిన్ సినిమాకు మంచి మార్కులే పడ్డాయి. బాలీవుడ్ చిత్రం 'యానిమల్' కూడా ఈ సీజన్‌లోనే విడుదలై విమర్శలతో పాటు కొందరి ఆదరణా పొందింది. ఈ నెలాఖరులో ప్రభాస్ 'సలార్' విడుదలకు సిద్ధంగా ఉంది.



ఈ చిత్రాలతో పాటు ఏడాది మొత్తంలో అనువాద చిత్రాలు, రీమేక్‌లు కూడా అడపాదడపా వచ్చి పలకరించాయి. సినిమాలు చిన్నవైనా, పెద్దవైనా, అనువాదాలైనా, రీమేకులైనా కొత్తదనానికి ప్రేక్షకులు పట్టం కట్టారు. అయితే మహేష్‌బాబు, అల్లు అర్జున్, రామ్ చరణ్, వెంకటేష్, నాగార్జున, పవన్‌కళ్యాణ్ వంటి ప్రముఖ నటుల చిత్రాలు మాత్రం ఈ ఏడాది థియేటర్లో కనిపించలేదు.

వెకేషన్ నోటీసు

ICICI Bank **శాఖా కార్యాలయం:** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్‌హల్లి హొసూర్, మెయిన్ రోడ్డు, బెంగళూరు-560068

నోటీసు

(లోన్ డాక్యుమెంట్/ఆస్తి డాక్యుమెంట్‌లో వివరించిన ప్రకారం కవర్‌చేయబడిన **ఎ-204, 2వ అంతస్తు, కోటె బ్లాక్ ఎ నం.ఎ204, ఆర్ఎఫ్ టిడబ్ల్యూ లైట్ కెంగేరియన్ బెంగళూరు-560060** వద్ద ఉన్న ఆస్తిలో చర వస్తువులను ఖాళీ చేయడం కొరకు దరఖాస్తుదారు **చిత్తవదుట్ల రజనీకాంత్ మరియు చిత్తవదుట్ల సుప్రియకు** ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. ఆస్తి 29.11.2023న ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ ద్వారా సెక్యూరిటీజైషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 యొక్క సెక్షన్ 13 (4) క్రింద ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి 7 రోజుల కాల వ్యవధిలో స్వాధీనం చేసుకోవడం జరుగుతుంది. చర వస్తువలను ఖాళీ చేయడంలో విఫలమైతే, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ మీ స్వంత ఖర్చుతో ఆస్తిలో ఉన్న చర వస్తువులతో పాటు ఆస్తిని వేలం వేయడానికి నిర్బంధించబడుతుంది మరియు పరిణామాలకు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ బాధ్యత వహించదని దయచేసి గమనించండి.

తేది: 18 డిసెంబర్, 2023
ప్రదేశం: గుంటూరు
సం/- అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

సామాజిక సేవలో పింఛనుదార్ల పాత్ర కీలకం

● **డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి**

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సామాజిక సేవలో పింఛన్‌దారుల పాత్ర కీలకమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అభిప్రాయపడ్డారు. ఆదివారం అఖిలభారత పింఛన్ దారుల సంఘం వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి హాజరయ్యారు. ముందుగా వార్షికోత్సవానికి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ కేవలం ఉద్యోగానికే గాని సామాజిక సేవకు అడ్డు కాదని అన్నారు. పింఛన్ దారులు సమిష్టిగా కృషి చేస్తే ఎన్నో విజయాలు సాధించవచ్చని అన్నారు. ఉద్యోగాలలో అందించిన సేవలను భవిష్యత్తులో కూడా సమాజానికి వినియోగపడాలని ఆశించారు. పింఛన్ దారులకు ఏ అవసరం ఉన్న తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

● రానున్న ఎన్నికల్లో అధికార వైసిపిని ఇంటికి సాగనంపాలని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు కోరారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం ఆయన నెల్లూరుకు విచ్చేశారు. సూళ్లూరుపేట, కోవూరు, నెల్లూరు నియోజకవర్గాల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ..అందరూ కలిసి వైసిపిని ఎదుర్కోవాలని సూచించారు.

HDB FINANCIAL SERVICES **హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్**
రిజిష్టర్డు ఆఫీసు: రాధిక, 2వ అంతస్తు, లా గార్డెన్ రోడ్, నవరంగ్‌పుర, అహ్మదాబాద్-09.
బ్రాంచి ఆఫీసు: **76-8-10/1, ఫ్లాట్ నం.4, భవాని టవర్స్, స్వాతి థియేటర్ రోడ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన, భవానిపురం, విజయవాడ-520012.**

(అనుబంధం-4) స్వాధీనతా ప్రకటన
(రూల్-8(1)చూడండి)(స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు **మెసర్స్ హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8&9తో చదువబడే & సెక్షన్ 13(12)(3) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **తేది: 16.09.2023 నాటి డిమాండ్ నోటీసు** జారీచేసి, దరఖాస్తుదారు/సహ-అభ్యర్ధులు/హామీదారును **రుణ ఖాతా నం.26847143 లో 1) శ్రీ మహాలక్ష్మి జ్యూవెలరీ వర్క్స్,** డోర్ నం.8-142, మోరం వెంకట ముత్యం కాంప్లెక్స్, షరాఫ్ బజార్, మంగళగిరి, గుంటూరు-522503, ఆం.ప్ర. **మరియు:** డోర్ నం.:94, మంగళగిరి, మంగళగిరి మున్సిపల్ ఏరియా, మంగళగిరి, గుంటూరు-522503, **2) ఇందనం నాగరాజు,** డోర్ నం.11-1227/ఎ, సుందరయ్య నగర్, రెవెన్యూ వార్డు నం: 11, మంగళగిరి, గుంటూరు-522503, ఆం.ప్ర. **3) ఇందనం పుష్ప,** డోర్ నం.11-1227/ఎ, సుందరయ్య నగర్, రెవెన్యూ వార్డు నం: 11, మంగళగిరి, గుంటూరు-522503, ఆం.ప్ర. అనువారిని సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన **12.09.2023** నాటికి మొత్తాలు **రూ.21,76,551/- (రూపాయలు ఇరువై ఒక లక్షల డెబ్బై ఆరు వేల ఐదు వందల యాభై ఒకటి మాత్రమే)**లను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.

దరఖాస్తుదారు/ సహ-అభ్యర్ధులు/హామీదారు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా దరఖాస్తుదారు/సహ-అభ్యర్ధులు/హామీదారుకు మరియు సర్వజనులకు ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు రూల్ 8&9తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ వివరించిన ఆస్తిని **13 డిసెంబర్, 2023న స్వాధీనపరచుకున్నారు.**

ప్రత్యేకించి దరఖాస్తుదారు/సహ-అభ్యర్ధులు/హామీదారులను మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **మెసర్స్ హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌కు 12.09.2023** నాటికి మొత్తాలు **రూ.21,76,551/- (రూపాయలు ఇరువై ఒక లక్షల డెబ్బై ఆరు వేల ఐదు వందల యాభై ఒకటి మాత్రమే)**లను మరియు దానిపై వడ్డీ& చార్జీలను చెల్లించుటకులోబడి ఉంటుంది.

దరఖాస్తుదారు/సహ-అభ్యర్ధులు/హామీదారు సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ 8 యొక్క నియమాలను శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

సెక్యూరిటీస్-1 యొక్క షెడ్యూలు: గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్-రిజిస్ట్రీ, రెవెన్యూ వార్డు నం.-11, డోర్ నం.94, సుందరయ్య నగర్, కొత్త డోర్ నం.11-1227ఎ గా అందు ఏసిసి షీట్ తోపాటు 147చ.గ. (123.48చ.మీ.) విస్తీర్ణపు సైటు. సరిహద్దులు: 440చ.అ.ల ఏసిసి షెడ్‌లో గత 05 సం॥లలో నిర్మించిన మరియు 123.48చ.మీ.లకు సమానమైన 147చ.గ.ల విస్తీర్ణపు ఈ నాలుగు సరిహద్దుల్లో **ఉత్తరం:** సయ్యద్ మస్తాన్ బీ ఆస్తి, **దక్షిణం:** జోన్నాదుల శేషరత్నం ఆస్తి, **తూర్పు:** ఇటికల కనకయ్య ఆస్తి, **పడమర:** బజారు.

తేది: 13.12.2023,
ప్రదేశం: మంగళగిరి
సం/- అధీకృత అధికారి
హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

OFFICE OF THE RECOVERY OFFICER - I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
31-31-21, Sai Baba Street, Narayan Bhawan, Dabagardens, Visakhapatnam -530020

DEMAND NOTICE

(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME-TAX ACT, 1961)
RC / 127 / 2023 29-11-2023
Union Bank of India (e-Andhra Bank), Main Branch, Gudivada, Krishna District
Versus
Sri VVNK Vishwanath & others

To
(CD-1) Sri. VVNK Vishwanath, S/o. Sri. Seshagiri Rao, D.No. 26-6-96, 3rd Lane, Ramalingeswarapeta, Vijayawada, Krishna District - 520003
(CD-2) Sri. VVN Pradeep, S/o. Sri. Seshagiri Rao, D.No. 26-6-96, 3rd Lane, Ramalingeswarapeta, Vijayawada, Krishna District - 520003
(CD-3) Smt. V Veena Kumari, W/o. Sri. Seshagiri Rao, D.No. 26-6-96, 3rd Lane, Ramalingeswarapeta, Vijayawada, Krishna District - 520003

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Hon'ble Presiding Officer, **DEBTS RECOVERY TRIBUNAL VISAKHAPATNAM in OA / 825 /2020** an amount of **Rs. 74,87,348.80 PS/-** (Rupees Seventy Four Lakhs Eighty Seven Thousand Three Hundred Forty Eight and Eighty Paisa only) along with the pendentellite and future interest **@ 10.20% p.a.** compounded with quarterly rests w.e.f. 20.11.2020 till realization / date of payment and the costs become due against you (Jointly and severally / fully / limited)
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned **on 04/01/2024 at 10.30 a.m.** for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay :
a) Such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.
b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount due.
6. Attention is invited to Rule 16 of the second schedule to the Income Tax Act, 1961 which is reproduced below :
16 (1) Where a notice has been served on a defaulter under Rule 2, the defaulter or his representative in interest shall not be competent to mortgage, charge, lease or otherwise deal with any property belonging to him except with the permission of the Recovery Officer, nor shall any Civil Court issue any process against such property in execution of a decree for the payment of money.
16 (2) Where an attachment has been made under this Schedule, any private transfer or delivery of the property attached or of any interest therein and any payment to the defaulter of any debt, dividend or other moneys contrary to such attachment shall be void as against all claims enforceable under the attachment.

Given under my hand and the seal of the Tribunal, on this day 29th November 2023
(Avasarala Anil)
Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

OFFICE OF THE RECOVERY OFFICER - I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
31-31-21, Sai Baba Street, Narayan Bhawan, Dabagardens, Visakhapatnam -530020

DEMAND NOTICE

(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME-TAX ACT, 1961)
RC / 1157 / 2017 11-12-2023
Union Bank of India (e-Andhra Bank), Gudivada Branch, Krishna District
Versus
Mrs. Paladugu Madhavi & Others

To
(CD-1) Mrs. Paladugu Madhavi, W/o. Sri. P. Ram Prasad, D.No. 8/330, Rajendra Nagar, Gudivada, Krishna District.
(CD-4) Mr. Paladugu Ram Prasad, S/o. Satyanarayana, D.No. 8/330, Rajendra Nagar, Gudivada, Krishna District.

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Hon'ble Presiding Officer, **DEBTS RECOVERY TRIBUNAL VISAKHAPATNAM in OA / 81 /2014** an amount of **Rs. 2,24,61,628.80 PS/-** (Rupees Two Crore Twenty Four Lakhs Sixty One Thousand Six Hundred Twenty Eight and eighty paisa only) wherein **Rs. 74,88,819.80 Ps** in Lan Account No. 014613100006852, **Rs. 74,86,404/-** in Loan Account No. 014613100006898 and **Rs. 74,86,405/-** in Loan Account No. 014613100006889 along with pendentellite and future interest **@ 13% p.a.** compounded with monthly rests from 24.02.2014 till realization / date of payment and costs of **Rs. 1,81,000/-** (Rupees One Lakh Eighty One Thousand only) has become due against you ((Jointly and severally / Fully / Limited)
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned **on 18/01/2024 at 10.30 a.m.** for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay :
a) Such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.
b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount due.
6. Attention is invited to Rule 16 of the second schedule to the Income Tax Act, 1961 which is reproduced below :
16 (1) Where a notice has been served on a defaulter under Rule 2, the defaulter or his representative in interest shall not be competent to mortgage, charge, lease or otherwise deal with any property belonging to him except with the permission of the Recovery Officer, nor shall any Civil Court issue any process against such property in execution of a decree for the payment of money.
16 (2) Where an attachment has been made under this Schedule, any private transfer or delivery of the property attached or of any interest therein and any payment to the defaulter of any debt, dividend or other moneys contrary to such attachment shall be void as against all claims enforceable under the attachment.

Given under my hand and the seal of the Tribunal, on this day 11th December 2023
(Avasarala Anil)
Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

అచ్ఛే దిన్ అంటే ఇదేనా..!

- నిత్యావసర ధరల్ని అదుపుచేయరేం..
- మోడీ సర్కారుపై మల్లికార్జున్ ఖర్గే ఆగ్రహం

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వ హయాంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఏ రకమైన "అభివృద్ధి చెందిన భారతదేశం" అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. ద్రవ్యోల్బణాన్ని హైలైట్ చేస్తూ.. పాలు, ఉల్లిగడ్డలు, టమాటా, చక్కెర వంటి నిత్యావసర వస్తువుల ధరలతో.. 2014 నాటి ధరలను పోల్చే ఒక వీడియోను ఆయన పంచుకున్నారు.

21న సిడబ్ల్యూసి భేటీ

న్యూఢిల్లీ : ఈ నెల 21న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యూసి) సమావేశం జరగనుంది. ఈ నెల 19న ఢిల్లీలో ఇండియా ఫోరం పార్టీల సమావేశమైన రెండు రోజుల తరువాత సిడబ్ల్యూసి సమావేశాన్ని అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే ఏర్పాటు చేసినట్లు ఆదివారం ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఇండియా ఫోరం సమావేశంలో తీసుకున్న నిర్ణయాలతోపాటు, ఇటీవల అసెంబ్లీ ఫలితాలు సిడబ్ల్యూసి భేటీలో చర్చకు రానున్నట్లు చెప్పారు. అసెంబ్లీ ఫలితాలపై కాంగ్రెస్ ఇప్పటి వరకూ చర్చించలేదు. ఈ ఫలితాలపై ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఇప్పటికే చర్చించారు.

వాయు కాలుష్యం మధ్య గిగ్ కార్మికులు



న్యూఢిల్లీ : గిగ్ ఆర్థిక వ్యవస్థలో రెండు భిన్నమైన దృశ్యాలు మనకు కనిపిస్తాయి. తక్కువ ఆదాయ పనుల్లో ఉన్నవారు ఒక వైపు , ఉన్నత ఆదాయ పనుల్లో ఉన్నవారు మరొకవైపు ఉంటారు. దేశ రాజధాని ఢిల్లీ వంటి మహా నగరాల్లో భయంకరమైన పొగ మంచుతో కూడిన వాయు కాలుష్యానికి ఎక్కువగా గురయ్యేది ఈ దిగువ స్థాయి గిగ్ వర్కర్లే. రెక్కాడితే గాని డొక్కాడని వీరు విషపూరిత గాలి కాలుష్యంలో రేయింబవళ్లు చెమటోడ్చాల్సి వస్తోందని ఢిల్లీ యూనివర్సిటీ జరిపిన ఓ అధ్యయనంలో తేలింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) పడిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. పేదల జీవనోపాధిపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. పేలవమైన ఎక్యూఐ స్థాయి అనేక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది , శ్రామిక శక్తి ఉత్పాదకతను దెబ్బతీస్తుంది. ఆరోగ్య సంరక్షణ ఖర్చులు రెట్టింపు అవుతాయి. నవంబర్ ప్రారంభంలో ఏక్యూఐ ప్రమాదకరమైన 400 మార్కును దాటడంతో, తక్కువ ఆదాయ కుటుంబాలపై వాయు కాలుష్య ప్రభావం ఎక్కువగా ఉంది. ఇది ఇక ఎంతమాత్రమూ విస్మరించరాని స్థితికి చేరుకుంది. ప్లాట్ఫామ్ లేదా గిగ్ ఎకానమీతో ముడిపడిన రంగాల్లో పనిచేసేవారు చుట్టూ ఉన్న విషపూరిత వాయు కాలుష్య కారకాల వల్ల తీవ్ర అనారోగ్యానికి గురయ్యే స్థితి ఉంది. పెరుగుతున్న కాలుష్యం బలహీన వర్గాలపై మరింత అధికంగా ఉంటుంది. ఇప్పటికే భారీగా పెరిగిన ఆర్థిక, సామాజిక అసమానతలకు ఇది మరింత ఆజ్యం పోస్తుంది.

గిగ్ ఎకానమీ మార్కెట్‌ను రెండు కేటగిరీలుగా వర్గీకరించవచ్చు. ఒకటి స్వల్పకాలిక ఉపాధితో కూడిన మార్కెట్. రెండవది సౌకర్యవంతమైన ఉద్యోగాలతో కూడిన మార్కెట్. ఇది తరచూ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్, యాప్స్‌కు వంటి వాటి ద్వారా సులభతరం చేయబడుతుంది. గిగ్ ఎకానమీలోని కార్మికులను సాధారణంగా గిగ్ వర్కర్లు లేదా ఫ్రీలాన్సర్లు అని పిలుస్తారు, వీరు పూర్తి కాలపు ఉద్యోగులు కాదు. తాత్కాలిక లేదా స్వల్పకాలిక పనులు ఎక్కువగా చేస్తుంటారు. ఉదాహరణకు రైడ్-షేరింగ్ డ్రైవర్లు, ఫుడ్ డెలివరీ కొరియర్లు, ఫ్రీలాన్స్ రైటర్లు, గ్రాఫిక్ డిజైనర్లు తదితరులు.

గిగ్ ఎకానమీ కార్మికులకు స్థిరమైన ఉపాధి ఉండదు. వీరికి పర్మినెంట్ ఉద్యోగులకు ఉండే ఎలాంటి హక్కులు, రక్షణలు వీరికి లేవు. సాంకేతిక పురోగతి గిగ్ కార్మికులపై పని ఒత్తిడిని బాగా పెంచింది,

ఏదేమైనా, ఈ విభాగంలో, గిగ్ రకం, నైపుణ్య స్థాయి, నిర్దిష్ట సేవలకు ఉన్న డిమాండ్‌ను బట్టి వీరి ఆదాయాలు మారుతూ ఉంటాయి. అధిక ఆదాయ గిగ్ కార్మికులు నైపుణ్యం కలిగి ఉండడమే గాక, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, గ్రాఫిక్ డిజైన్ లేదా కన్సల్టింగ్ నిపుణులుగా కూడా వుంటారు. ఈ కార్మికులు అధిక-డిమాండ్ ఉండే సేవలను అందిస్తారు. నైపుణ్యం, అనుభవం వున్నవారికి ఆ మేరకు అవకాశాలు కూడా ఎక్కువే. ఫ్రీలాన్స్ రైటింగ్, మార్కెటింగ్ లేదా వెబ్ డెవలప్మెంట్ వంటి పనులు చేసే మధ్య-ఆదాయ గిగ్ కార్మికులు రెండో వరుసలో ఉంటారు. వీరు విలువైన నైపుణ్యాన్ని కనబరచినప్పటికీ ప్రత్యేక నిపుణులతో సమానమైన రేట్లను కలిగి ఉండరు.

డ్రైవర్లు, బేసిక్ డేటా ఎంట్రీ లేదా మైక్రో-టాస్క్ వర్కర్లు వంటి ఎంట్రీ-లెవల్ లేదా తక్కువ-నైపుణ్యం కలిగిన గిగ్ రోల్స్ పరిధిలోకి తక్కువ-ఆదాయ గిగ్ వర్కర్లు వస్తారు. ఈ కార్మికులు తరచూ తీవ్రమైన పోటీని ఎదుర్కొంటారు. స్థిరమైన ఆదాయం కోసం ఒకటికి మించి స్వల్పకాలిక ఉద్యోగాలు చేయాల్సి వస్తుంది.

వేరియబుల్-ఇన్‌కమ్ గిగ్ వర్కర్లు అనే మరో కేటగిరీ ఉన్నారు. రైడ్-షేరింగ్, ఫుడ్ డెలివరీ వంటి సేవలలో వీరు ఎక్కువగా ఉంటారు. వీరి ఆదాయాలు అస్థిరంగా ఉంటాయి. చివరగా, ప్లాట్ఫామ్ యజమానులు, వీరు ఈ అన్ని కేటగిరీల గిగ్ వర్కర్ల నుండి వివిధ మోడళ్ల ఫీజులు, కమీషన్లు లేదా సబ్స్క్రిప్షన్ల ద్వారా ఆదాయాన్ని పొందుతారు. ప్లాట్ఫామ్ విజయం, స్థాయిని బట్టి వారు అధిక ఆదాయ సామర్థ్యాన్ని కలిగి ఉంటారు.

పేలవమైన గాలి నాణ్యత అల్పాదాయ గిగ్ కార్మికుల పాలిట శాపంగా మారింది. ఆరోగ్య బీమా వంటి సంప్రదాయ ఉపాధి ప్రయోజనాలేవీ వీరికి అందవు.

గాలి కాలుష్యాన్ని తగ్గించడానికి వ్యక్తిగత వాహనాలపై ఆధారపడటాన్ని నిరుత్సాహపరచి, ప్రజా రవాణా మౌలిక సదుపాయాలలో పెట్టుబడులకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజా రవాణా ఎంపికలను పెంచడం, విస్తరింపజేయాలి. అది మొత్తం గాలి నాణ్యత మెరుగుదలకు దోహదం చేస్తుంది.

కదులుతున్న బస్సులో.. బాలికపై సామూహిక అత్యాచారం

- కాన్పూర్ నుంచి జైపూర్‌కు వెళ్తున్న సమయంలో డ్రైవర్ల ఘాతుకం
- ఢిల్లీ 'నిర్భయ' తరహా ఘటన

న్యూఢిల్లీ : దాదాపు 11 ఏళ్ల క్రితం దేశ రాజధాని ఢిల్లీలో చోటు చేసుకున్న నిర్భయ సామూహిక లైంగికదాడి ఘటనను పోలి ఉండే మరొక ఘటన చోటు చేసుకున్నది. కాన్పూర్ నుంచి రాజస్థాన్‌లోని జైపూర్‌కు వెళ్తున్న బస్సులో ఒక బాలికపై ఇద్దరు డ్రైవర్లు దారుణానికి ఒడిగట్టారు. ఘటనను గుర్తించిన తోటి ప్రయాణికులు డ్రైవర్లకు దేహశుద్ధి చేశారు. ఒక డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేయగా.. మరొక డ్రైవర్ పరారీలో ఉన్నాడు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపన కథనం ప్రకారం.. ఈ ఘటన ఈనెల 9వ తేదీ రాత్రి 7:30 గంటల సమయంలో ఒక అమ్మాయి కాన్పూర్ నుంచి జైపూర్‌కి తన మామ ఇంటికి వెళ్తున్నది. బస్సు ఎక్కిన ఆమెకు కూర్చోవటానికి సీటు దొరకలేదు. దీంతో డ్రైవర్లు ఆమెను క్యాబిన్‌లో కూర్చోబెట్టారు. బస్సు బయలుదేరాక ప్రయాణ సమయంలో ఆ ఇద్దరు డ్రైవర్లు ఆమెపై దారుణానికి ఒడిగట్టారు. బస్సులో ఉన్న ప్రయాణికులు క్యాబిన్ డోర్ తెరిచి, బాలిక దీనస్థితిలో ఉన్నట్లు గుర్తించారు. ఇద్దరు డ్రైవర్లను చికతబాదారు. డ్రైవర్లలో ఒకరు తప్పించుకుపోగా.. మరొకరిని పోలీసులకు ప్రయాణికులు అప్పగించారు. బాలిక ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. 2012లో దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు గురి చేసిన ఢిల్లీ సామూహిక లైంగికదాడి ఘటనకు, ప్రస్తుత ఘటనకు దగ్గరి పోలికలు ఉన్నాయి.



సోలార్ ఇండస్ట్రీస్ బయట ఆందోళన చెందుతున్న మృతుల కుటుంబ సభ్యులు

లోపలికి వెళ్లనివ్వరు.. మా వాళ్లను చూడనివ్వరు...

- మృతుల కుటుంబ సభ్యుల ఆందోళన

నాగ్‌పూర్ : ఫ్యాక్టరీలోకి అనుమతించడం లేదని, ప్రాణాలు కోల్పోయిన తమ వారి సమాచారం కూడా ఇవ్వడం లేదంటూ మృతుల కుటుంబ సభ్యులు సంస్థ ఆవరణలో ఆదివారం ఆందోళన చేశారు. సోలార్ ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్‌లో జరిగిన పేలుడులో సజీవ దహనమైన వారి మృతదేహాలను ఫ్యాక్టరీ ఆవరణలో ఉంచడంపై బంధువులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీ ఆవరణలోకి అనుమతించాలని డిమాండ్ చేస్తూ బాధితుల కుటుంబ సభ్యులు, స్థానికులు యూనిట్ ప్రవేశ ద్వారం వద్ద బైఠాయించారు. ప్రమాద వార్త తెలిసినవెంటనే ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నా.. తమను లోపలకు అనుమతించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'నాకు ఏమీ వద్దు.. నా కుమార్తె మృతదేహాన్ని అప్పగించండి' అని మృతుల్లో ఒకరైన 22 ఏళ్ల ఆర్తి తండ్రి నీలకంఠరావు సహారే దీనంగా వేడుకోవడం అందర్నీ కలచి వేసింది. గతంలో పక్షవాతానికి గురికావడంతో సహారే కాళ్లు చచ్చుబడిపోయాయి. ప్రమాద వార్త తెలిసిన వెంటనే సంఘటనా స్థలికి సహారే చేరుకున్నారు. ఆర్తి సంపాదనతోనే తమ కుటుంబం గడుస్తుందని, మాటలు రాని తల్లికి, చెల్లికి ఆర్తి అండగా ఉండేదని గుర్తు చేసుకుంటూ సహారే కన్నీరు పెట్టడం చూపరులను కంటతడిపెట్టించింది.

ఇద్దరు పిల్లల తల్లి అయిన 32 ఏళ్ల రుమితా ఉయికె ఆదివారం ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఆమె తండ్రి దేవిదాస్ ఇరపాటి ఫ్యాక్టరీ వద్ద ఆందోళనలో ఉన్నారు. ప్రమాదం గురించి ఫ్యాక్టరీ నుంచి ఎలాంటి సమాచారం లేదని, ఇతరుల ద్వారా ప్రమాదం గురించి తెలుసుకుని ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. రుమితకు ఇద్దరు కుమారు ఉన్నారని, భర్త వ్యవసాయ కార్మికుడని చెప్పారు. ఆదివారం తమ ఇంటికి రావాల్సి ఉందని, అంతలోనే ప్రమాదంలో మరణించిందని గద్గద స్వరంతో చెప్పారు. 'రుమిత మృతదేహాన్ని మాకు ఎప్పుడు అప్పగిస్తారో తెలియదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు కూడా ఇదేవిధమైన ఆందోళన వ్యక్తం చేశారు.

వ్యాజ్యాల నుంచి ఇసికి రక్షణ

- చట్ట సవరణ తీసుకొచ్చిన కేంద్రం

న్యూఢిల్లీ : ప్రస్తుత, గతంలో పనిచేసిన ఎన్నికల కమిషన్ సభ్యులకు వ్యాజ్యాల నుంచి రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఓ సవరణ తీసుకొచ్చింది. దానికి ముందు ప్రధాన ఎన్నికల కమిషనర్ పైనే ఇటీవల పలు ఎఫ్ఐఆర్‌లు, వ్యాజ్యాలు దాఖలు కావడంపై కేంద్ర ఎన్నికల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్ల ఎంపిక, సర్వీసు నిబంధనల క్రమబద్ధీకరణకు సంబంధించిన బిల్లుపై రాజ్యసభలో ఈ నెల 12న చర్చ జరిగింది. ఆ తర్వాత న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఓ సవరణను ప్రతిపాదించారు. అందులో సిఇసి, ఇసిలకు రక్షణ కల్పించేందుకు ఓ క్లాజును చేర్చారు. ఇటీవల సిఇసి, ఇసిలకు విచారణ కోర్టు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఈ సవరణ అవసరమైందని ఆయన తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల బిల్లును సవరణతో కలిపి సభ ఆమోదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ కానీ, ఇతర ఎన్నికల కమిషనర్లు కానీ తీసుకునే ఎలాంటి చర్య పైన అయినా న్యాయస్థానాలు సివిల్, క్రిమినల్ ప్రొసీడింగ్స్ చేపట్టకూడదని ఈ క్లాజు స్పష్టం చేస్తోంది.

కేంద్రం ఈ క్లాజు తీసుకురావడానికి కారణం తెలంగాణలో జరిగిన ఓ ఉదంతమే. మహబూబ్‌నగర్‌లో దాఖలైన ఓ కేసుకు సంబంధించి ఎమ్మెల్యే, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఇతర ఎన్నికల కమిషనర్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని విచారణ కోర్టు ఆదేశించింది. సిఇసిని, ఇతర కమిషనర్లను ఈ కేసులో సహ నిందితులుగా చేర్చింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన రాష్ట్ర హైకోర్టు ఆ ఆదేశాలు ఇచ్చిన జడ్జిని సస్పెండ్ చేసింది. గత సంవత్సరం కర్ణాటకలో కూడా ఇదే తరహా ఘటన జరిగింది. 2019 ఎన్నికల కేసుకు సంబంధించి మాజీ సిఇసి సునీల్ అరోరాకు సింగిల్ జడ్జ్ బెంచ్ సమన్లు జారీ చేసింది. ఈ సమన్లను హైకోర్టు కొట్టివేసింది. రాజ్యాంగ బద్ధమైన పదవులలో ఉన్న వారికి లేదా మాజీలకు సమన్లు జారీ చేయకూడదని స్పష్టం చేసింది. 2021లో మద్రాస్ హైకోర్టు జడ్జి ఓ వ్యాఖ్య చేశారు. కోవిడ్ వ్యాప్తికి ఎన్నికల కమిషనే కారణమని, ఆ సమయంలో రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించిందని వ్యాఖ్యానించారు. ఎన్నికలు నిర్వహించిన అధికారులపై కేసు పెట్టాలని అన్నారు. దేశంలో 543 లోక్‌సభ, 4,123 శాసనసభ స్థానాలు ఉన్నాయి. ప్రతి స్థానంలో 10 నుండి 20 మంది పోటీ చేస్తుంటారు. కోటిన్నర మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు.

గ్రాడ్యుయేట్లలో 13.4 శాతం నిరుద్యోగులు

- రాష్ట్రంలో 24 శాతం
- పిఎల్ఎఫ్ఎస్ సర్వే నివేదిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగిత రేటు 2022-23లో 13.4 శాతం ఉంది. స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ మంత్రిత్వశాఖ నిర్వహించిన తాజా పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్) ప్రకారం 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న గ్రాడ్యుయేట్లలో అత్యల్ప నిరుద్యోగిత రేటు చండీగఢ్‌లో 5.6 శాతంగా ఉంది, ఆ తర్వాత ఢిల్లీలో 5.7 శాతం ఉంది. అండమాన్ అండ్ నికోబార్‌లో అత్యధికంగా నిరుద్యోగం 33 శాతం, లడఖ్‌లో 26.5 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 24 శాతం ఉన్నట్లు డేటా స్పష్టం చేసింది. పెద్ద రాష్ట్రాల్లో నిరుద్యోగిత రేటు రాజస్థాన్‌లో 23.1 శాతం, ఒరిస్సాలో 21.9 శాతంగా ఉంది. మరింత తరచుగా సమయ వ్యవధిలో లేబర్ ఫోర్స్ డేటా లభ్యతకు సంబంధించిన ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని, ఎన్ఎస్ఎస్ఓ ఏప్రిల్ 2017లో పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్)ని ప్రారంభించింది. జూలై 2022 నుండి జూన్ 2023 వరకు ఉంది. ఇంతకుముందు, ఐదు వార్షిక నివేదికలు జులై 2017- జూన్ 2018, జూలై 2018- జూన్ 2019, జూలై 2019- జూన్ 2020, జూలై 2020- జూన్ 2021, జూలై 2021- జూన్ 2022 మధ్యకాలంలో పిఎల్ఎఫ్ఎస్‌లో సేకరించిన డేటా ఆధారంగా రూపొందించబడింది. ఇప్పుడు ఎన్ఎస్ఎస్ఓ జూలై 2022- జూన్ 2023 మధ్య కాలంలో నిర్వహించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ఆధారంగా ఆరో వార్షిక నివేదికను విడుదల చేసింది. నమూనాలకు సంబంధించి సమాచార సేకరణ కోసం ఫీల్డ్ వర్క్ జూలై 2022-జూన్ 2023 కాలానికి మధ్య జరిగింది.

రెచ్చగొడుతున్నారు

- శాంతికి భంగం కలిగిస్తున్నారు
- పదవికి అప్రతిష్ట తెస్తున్నారు
- నిరసనకారులతో అలాగేనా ప్రవర్తించేది?
- గవర్నర్ ఖాన్‌పై కేరళ సిఎం పినరయి మండిపాటు

తిరువనంతపురం : ప్రతి విషయంలోనూ రాష్ట్ర గవర్నర్ ఖాన్ రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మండిపడ్డారు. ప్రొటోకాల్‌ను గవర్నర్ తరచూ ఉల్లంఘించడంలో ఔచిత్యాన్ని కేంద్రప్రభుత్వం పరిశీలించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రజలకు చేరువయ్యేందుకు వామపక్ష సంఘటన ప్రభుత్వం ప్రారంభించిన నవ కేరళ సదస్ కార్యక్రమం సందర్భంగా పతనంతిట్టలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 'కేరళలో నెలకొన్న శాంతియుత వాతావరణాన్ని నాశనం చేసేందుకు గవర్నర్ ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తున్నారని నేను గతంలోనే చెప్పాను. ఆ తర్వాత ఆయన చేసిన ప్రతి పని నేను చెప్పింది నిజమేనని నిరూపించింది. తాను నిర్వహిస్తున్న పదవిని గవర్నర్ తరచూ మరిచిపోతున్నారు. ఆ పదవికి అప్రదిష్ట తెచ్చేలా వ్యాఖ్యలు చేస్తున్నారు' అని విమర్శించారు.

ఛాన్సలర్‌గా గవర్నర్ తీసుకున్న చర్యలు సహజంగానే నిరసనలకు అవకాశం ఇచ్చాయని విజయన్ చెప్పారు. విశ్వవిద్యాలయం ఎంపిక చేసిన ప్యానల్ నుండి ఆయన సెనేట్‌ను నియమించాల్సి ఉందని, ఆయన ఆర్ఎస్ఎస్ అందజేసిన జాబితా నుండి సభ్యులను ఎంపిక చేస్తున్నారని తెలిపారు. 'తన విచక్షణాధికారాలు ఉపయోగించి సెనేట్‌కు సభ్యులను నామినేట్ చేశానని గవర్నర్ చెబుతున్నారు. ఆయన తనంతట తాను సభ్యులను గుర్తించి నామినేట్ చేయగలరా? యూనివర్సిటీ ఇచ్చిన జాబితాలోని సభ్యులకు అవసరమైన అన్ని అర్హతలు ఉన్నప్పటికీ గవర్నర్ మాత్రం ఒకే ఒక అర్హతను గుర్తిస్తున్నారు. అది వారు ఆర్ఎస్ఎస్‌కు సంబంధించిన వారు కావడమే. ఈ చర్యల కారణంగానే ఆయన విద్యార్థుల నుండి నిరసన ఎదుర్కొంటున్నారు' అని వివరించారు. నిరసనకారులపై గవర్నర్ కఠిన పదజాలం ఉపయోగించారని, వారిపై నేరస్తులు, గూండాలు అని ముద్ర వేశారని విజయన్ విమర్శించారు. వివిధ హోదాలలో అనేక సంవత్సరాల పాటు పనిచేసిన వ్యక్తికి ఇది తగని పని అని అన్నారు. 'అలాంటి పదవిలో ఉన్న వ్యక్తి నిరసనకారులతో ఘర్షణకు దిగి వారికి నల్ల జెండాలు చూపుతారని ఎవరైనా ఆశిస్తారా? ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలపడం అనేది ప్రాథమిక హక్కు అని ఆయన మరచిపోతున్నారు.' అని చెప్పారు. రెండు రోజుల క్రితం గవర్నర్ ఖాన్‌పై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రోహింటన్ నారిమన్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఇప్పుడు దేశమంతా గవర్నర్ చర్యలను గమనిస్తోందని విజయన్ తెలిపారు.

బిజెపిని గద్దె దింపేందుకు
ప్రజా పోరాటాలు ఉధృతం చేయాలి

వాసుదేవ ఆచార్య సంతాప సభలో సీతారాం ఏచూరి పిలుపు



కోల్‌కతా : బిజెపిని గద్దె దింపేందుకు ప్రజా పోరాటాలు ఉధృతం చేయాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. ఇటీవల కన్నుమూసిన వాసుదేవ ఆచార్య జ్ఞాపకార్థం పశ్చిమ బెంగాల్‌లోని పురూలియాలో ఆదివారం సంతాప సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటం వద్ద నేతలు, ప్రజలు పుష్పగుచ్ఛాలు ఉంచి, నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ 'బిజెపి దేశవ్యాప్తంగా అబద్ధాలు ప్రచారం చేస్తోంది. తప్పుడు వాదనలు వినిపిస్తోంది. ఆ మోసాలను బయటపెట్టాలి. కేంద్రంలో మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమించాలి. అప్పుడే మెరుగైన భారతదేశాన్ని నిర్మించడం సాధ్యమవుతుంది' అని అన్నారు. బెంగాల్‌లో లెఫ్ట్ ఫ్రంట్, కాంగ్రెస్, లౌకిక శక్తులు కలిసి బిజెపి, టిఎంసిలకు వ్యతిరేకంగా పోరాడతాయని తెలిపారు. 'వాసుదేవ ఆచార్య పార్లమెంట్‌లోనూ, బయట ప్రజల ప్రయోజనాల కోసమే పనిచేశారు. దేశంలో లౌకిక ప్రజాస్వామ్య సమాఖ్య నిర్మాణాన్ని కొనసాగించడానికి జరిగిన ఉద్యమాల్లో రాజీలేని పోరాట యోధుడు. పార్లమెంటులో నిరంతరం ఆ పాత్రను ఆయన పోషించారు' అని తెలిపారు. ఈ సభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ బిమన్ బోస్ అధ్యక్షత వహించారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు సూర్యకాంత మిశ్రా, కేంద్ర కమిటీ సభ్యులు అమియా పాత్ర తదితరులు ప్రసంగించారు.

ప్రజాశక్తి శ్రీకాకుళం ప్రతినిధి భీమారావుకు పితృ వియోగం

- నేడు శ్రీకాకుళంలో అంత్యక్రియలు

ప్రజాశక్తి- విశాఖపట్నం



'ప్రజాశక్తి' శ్రీకాకుళం స్టాఫ్ రిపోర్టర్ టి.భీమారావు తండ్రి తోట లక్ష్మణరావు (82) ఆదివారం విశాఖ కెజిహెచ్‌లో మృతి చెందారు. శనివారం మధ్యాహ్నం ఆయనను అనారోగ్యం కారణంగా శ్రీకాకుళం నుంచి కెజిహెచ్‌కు తీసుకొచ్చారు. చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. ఆరోగ్యం విషమించడంతో ఆదివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో మృతి చెందినట్లు ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. ఆయన భార్య గతంలోనే మృతి చెందారు. వారికి నలుగురు కుమారులు ఉన్నారు. వారిలో భీమారావు 3వ కుమారుడు. లక్ష్మణరావు భౌతికకాయాన్ని శ్రీకాకుళంలోని వారి గృహానికి తరలించారు. సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. లక్ష్మణరావు మృతికి ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. లక్ష్మణరావు మృతికి సంతాపం తెలిసిన వారిలో ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు, విశాఖ ఎడిషన్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు ఉన్నారు.

లిబియాలో నౌక మునిగి
61 మంది వలస కూలీల జలసమాధి

- మృతుల్లో అత్యధికులు మహిళలు, పిల్లలే



ట్రిపోలి : లిబియాలో పడవ ప్రమాదంలో మహిళలు, పిల్లలతో సహా 61 మంది చనిపోయారు. మొత్తం 86 మందితో వెళ్తున్న ఓడ బలమైన అలల తాకిడికి బోల్తా పడింది. వీరిలో 25 మందిని రెస్క్యూ టీమ్స్ సురక్షితంగా బయటికి తీసుకొచ్చాయి. మిగతా వారు బతికి ఉండే అవకాశం లేదని అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం లిబియా తీరంలో ఈ ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది.నైజీరియా, గాంబియా తదితర ఆఫ్రికా దేశాలకు చెందిన 86 మంది ఐరోపా దేశాలకు వలస వెళ్లేందుకు లిబియా నుంచి పడవలో బయలుదేరారు. లిబియా తీరానికి సమీపంలో పడవ బోల్తా పడినట్లు ఐక్యరాజ్యసమితికి చెందిన 'ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ (ఐఒఎం) తెలిపింది. లిబియా పశ్చిమ తీరంలోని జువారా పట్టణ సమీపంలో బలమైన అలల తాకిడికి పడవ కొట్టుకుపోయినట్లు ఈ ప్రమాదం నుంచి బయటపడిన వారు వెల్లడించారు.

ఇప్పుడు ప్రమాదం జరిగిన మధ్యధరా సముద్రంలోని ఈ మార్గంలో గతంలో కూడా పలు ప్రమాదాలు సంభవించాయి. మెరుగైన జీవితం కోసం చాలా మంది ఆఫ్రికా దేశాల నుంచి ఐరోపా దేశాలకు వలస వెళ్లేందుకు ఈ మార్గాన్నే ఆశ్రయిస్తున్నారు. యుద్ధాలు, పేదరికం నేపథ్యంలో పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాల నుంచి ఏటా వేల మంది ఐరోపా దేశాలకు వలసపోతున్నారు. నియంత గడాఫీ మరణానంతరం లిబియాలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఆ భూభాగంపై ఎవరికీ సరైన నియంత్రణ లేకపోవటంతో యూరప్‌కు చేరుకోవాలనుకుంటున్న వారంతా లిబియా తీరం నుంచే బయల్దేరుతున్నారు.

గడాఫీ మరణానంతరం కల్లోలంగా లిబియా

తమ చమురు అవసరాలు, లాభాల కోసం లిబియా అధ్యక్షుడు గడాఫీతో యుద్ధం చేసి, హత్య చేసిన తరువాత ఆ దేశం పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. మానవ అక్రమ రవాణాదారులకు కూడా లిబియాలోని కల్లోల పరిస్థితులు అనుకూలంగా మారాయి. ఆరు దేశాలతో సరిహద్దులు పంచుకుంటున్న లిబియాలోకి ఆఫ్రికా దేశాల నుంచి వలసదారులు పోటెత్తుతున్నారు. వీరందరినీ ప్రమాదకరమైన పడవల్లో కుక్కి తీరం దాటిస్తుంటారు. ఎవరైనా పట్టుబడి తిరిగి లిబియాకు వస్తే ప్రభుత్వ నిరాశ్రయ కేంద్రాల్లో ఉంచుతున్నారు. వారిని నిర్బంధ శ్రామికులుగా మారుస్తున్నారు. వారిపై అత్యాచారాలకు పాల్పడుతున్నారు. వారి నుంచి డబ్బును లాక్కుంటున్నారు.

ఆగని బాల్య వివాహాలు

న్యూఢిల్లీ : మన దేశంలో ప్రతి ఐదుగురు బాలికలలో ఒకరు, ప్రతి ఆరుగురు బాలురులో ఒకరు చట్టబద్ధమైన వయసు రాకుండానే వివాహం చేసుకుంటున్నారు. దేశంలో గత మూడు దశాబ్దాల కాలంలో జరిగిన బాల్య వివాహాలపై జాతీయ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన జరిగిన కుటుంబ ఆరోగ్య సర్వేల ఆధారంగా అధ్యయనం చేశారు. 1993లో బాలికలలో 49 శాతం మందికి బాల్య వివాహాలు జరగగా, 2021 నాటికి అది 22 శాతానికి తగ్గిందని అధ్యయనం తెలిపింది. యువకుల చట్టబద్ధ వివాహ వయసు 21 సంవత్సరాలుకాగా, ఆ లోపు వయసున్న వారిలో 15.49 శాతం మంది 2021లో వివాహం చేసుకున్నారు. 2021లో బాల్య వివాహాలు చేసుకున్న బాలుర (18 సంవత్సరాల లోపు వయసు వారు) సంఖ్య మొత్తం బాలుర సంఖ్యలో రెండు శాతం మాత్రమే ఉంది. అదే 1993లో ఏడు శాతంగా ఉంది. మొత్తంగా చూస్తే 2021లో 18 సంవత్సరాలు నిండకముందే 1.3 కోట్ల మంది బాలికలు, 14 లక్షల మంది బాలురు వివాహం చేసుకున్నారు. లాన్సెట్ గ్లోబల్ హెల్త్ జర్నల్‌లో శనివారం అధ్యయన వివరాలను ప్రచురించారు. మహిళల వివాహ వయసును పురుషులతో సమానంగా 21 సంవత్సరాలకు పెంచేందుకు ఉద్దేశించిన బిల్లును పార్లమెంటరీ కమిటీ పరిశీలిస్తున్న సమయంలో ఈ అధ్యయన వివరాలు బయటకు రావడం గమనార్హం. 'బాలికల కనీస వివాహ వయసు 18 సంవత్సరాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. కాబట్టి ఈ వయసును 21 సంవత్సరాలకు పెంచాలన్న ప్రతిపాదనను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది' అని అధ్యయనానికి నేతృత్వం వహించిన హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్వి సుబ్రమణ్యం చెప్పారు. బాలికల వివాహ వయసును 21 సంవత్సరాలకు పెంచితే ఇప్పటికే అమలులో ఉన్న 18 సంవత్సరాల నిబంధనకు కట్టుబడి ఉన్న కుటుంబాలు ఇకపై తమ కుమార్తెలకు త్వరగా వివాహం చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభిస్తారని కొందరు అభిప్రాయపడుతున్నారు.

ఈ రాష్ట్రాల్లో అధికం

పశ్చిమ బెంగాల్, బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని అధ్యయనం తెలిపింది. 2021లో దేశంలో 1.3 కోట్ల మంది బాలికలకు బాల్య వివాహాలు కాగా వారిలో ఒక్క బీహార్‌లోనే 16 శాతం మంది ఉన్నారు. బెంగాల్‌లో 15 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 12 శాతం, మహారాష్ట్రలో 8 శాతం మంది బాలికలకు బాల్య వివాహాలు జరిగాయి. ఇక బాలుర విషయానికి వస్తే 2021లో 18 సంవత్సరాల లోపు వయసున్న 14 లక్షల మందికి బాల్య వివాహాలు జరగగా వారిలో గుజరాత్‌లో అత్యధికంగా 29 శాతం మంది, బీహార్‌లో 16 శాతం మంది, పశ్చిమ బెంగాల్‌లో 12 శాతం మంది, ఉత్తరప్రదేశ్‌లో 8 శాతం మంది ఉన్నారు.

తెల్ల జెండా చూపినా ముగ్గురు బందీలను కాల్చి చంపేశారు

- తరువాత పొరపాటు అంటూ వివరణ
- ఇజ్రాయిల్ దాష్టీకంపై సర్వత్రా ఆగ్రహం
- హమాస్‌తో నార్వేలో కొనసాగుతున్న చర్చలు

టెల్ అవీవ్/గాజా సిటీ : హమాస్ చేతిలో బందీలుగా ఉన్న ముగ్గురు ఇజ్రాయెలీయులను కాల్చి చంపడం ఇజ్రాయెల్ సైన్యానికి పెద్ద ఎదురుదెబ్బ. తెల్ల జెండా ఊపుతూ వెళ్తున్న వారిని కాల్చిచంపినట్లు ఇజ్రాయెల్ సైన్యం అంగీకరించింది. గాజా నగరంలో చొక్కా వేసుకోకుండా తెల్లజెండా పట్టుకున్న యోతమ్ హైమ్ (28), సమర్ తలాల్కా (25), అలోన్ షమ్రిస్ (26) అనే ముగ్గురు బందీలను ఇజ్రాయిల్ సైన్యం కాల్చిపారేసింది. దీనిపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం కావడంతో సైన్యం వివరణ ఇచ్చింది. వారు దాడి చేసేందుకు వచ్చారన్న అనుమానంతోనే కాల్పులు జరిపామని, వారు బందీలు అని ఆ తరువాత తేలిందని తెలిపింది. వారు తప్పించుకున్నారా లేదా హమాస్ వదిలిపెట్టిందా అన్నది స్పష్టం కాలేదు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు దీనిపై స్పందిస్తూ ఇది "భరించలేని విషాదం" అని పేర్కొన్నారు. ఈ ఘటనపై చర్యలు తీసుకుంటామని ప్రధానమంత్రి సీనియర్ సలహాదారు మార్క్ రెగెవ్ తెలిపారు. పారిపోవడానికి ప్రయత్నించిన పౌరులను ఇజ్రాయెల్ దళాలు కాల్చిచంపినట్లు అనేక నివేదికలు తెలియజేస్తున్నాయి. బందీలను చంపిన తర్వాత ఇజ్రాయెల్‌లో తీవ్ర నిరసన వ్యక్తమైంది. బందీలను విడిపించేందుకు ఒప్పందాన్ని కోరుతూ వేలాది మంది టెల్ అవీవ్‌లో కవాతు నిర్వహించగా, జోర్డాన్ తదితర ప్రాంతాల్లో ఆందోళనలునిర్వహించారు. దీంతో హమాస్‌తో శాంతి చర్చలకు ఇజ్రాయెల్ సిద్ధమైంది. ఖతార్ మధ్యవర్తిత్వంలో నార్వేలో చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం 100 మంది ఇజ్రాయిలీయులు హమాస్ చేతిలో బందీలుగా ఉన్నారు. ఇదిలా ఉండగా గాజా సిటీలో ఇజ్రాయెల్ తన దురాక్రమణను కొనసాగిస్తూనే ఉంది. ఉత్తర గాజాలో ఇళ్లపై జరిగిన దాడిలో 14 మంది చనిపోయారు. దీంతో గాజాలో మరణించిన వారి సంఖ్య 18,787కి చేరింది. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌లో జరిగిన దాడిలో అల్ జజీరా కెమెరామెన్ సమీర్ అబు దక్కా మరణించాడు. కమల్ అద్వాన్, అల్-అవుదా ఆసుపత్రుల్లో చిక్కుకున్న వారు బయటకు రాలేకపోతున్నారు. గాయపడిన వ్యక్తులతో కమల్ అద్వాన్ వెళ్తున్న అంబులెన్స్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది.



ఇజ్రాయిల్ దాష్టీకాలను నిరసిస్తూ జోర్డాన్‌లో ఆదివారం ఆందోళన చేస్తున్న ప్రజానీకం




మీకోసం

చింతపండును కాస్త ఉప్పు చల్లి గాలి చొరబడని డబ్బాలో నిల్వ ఉంచితే రంగు మారదు.

జీవన సౌరభం

విమర్శిస్తున్నారని, విఫలమయ్యామని ప్రయత్నాలు ఆపేసి ఉంటే ఇన్ని అద్భుతాలు సాధించేవాళ్లం కాదు.

బద్ధకం



తాడిపత్రి అనే గ్రామంలో రంగయ్య, చలమయ్య అనే ఇద్దరు స్నేహితులు ఉండేవారు. వారు ఎప్పుడూ మర్రి చెట్టు కింద కూర్చుని దారిన వచ్చి, పోయే వారిని పలకరిస్తూ, ముచ్చట్లు పెడుతూ కాలం గడిపేవారు. ఊరి వాళ్లు వీళ్లిద్దరిని బాగా తిట్టుకునేవారు. పనీపాట లేక ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని, బద్ధకస్తులుగా తయారయ్యారని ముఖం మీదే అనేవారు.

రోజూ ఆ మాటలు వింటున్న రంగయ్య ఆలోచనలో పడ్డాడు. 'అరేయ్.. ఊరు వాళ్ళందరూ మనల్ని బద్ధకస్తులు అని పిలుస్తున్నారు. మనం కూడా ఏదైనా ఒక పని చేసి వాళ్లకు బుద్ధి వచ్చేలా చేద్దాము' అని చలమయ్యతో అన్నాడు.


'నువ్వు భలే వాడివిలా ఉన్నావే, వారన్న మాటలను పట్టించుకుంటే మనము బతకలేస్తామా? మనకు ఇప్పుడు పని చేయాల్సిన అవసరం ఏముందిరా.. హాయిగా తింటున్నాము. చెట్టు నీడన కూర్చుంటున్నాము కదా' అని అన్నాడు చలమయ్య. 'అది కాదురా.. ఒకసారి మనం కూడా పనిచేస్తే మనల్ని ఏమీ అనరు కదా' అని రంగయ్య అన్నాడు. 'సరే! ఏ పని చేద్దాము చెప్పు' అని అడిగాడు చలమయ్య. మన దగ్గర ఉన్న డబ్బులతో చెరొక బర్రెను తీసుకొని సాకుదాం. అది పాలు ఇస్తుంది ఆ పాలు అమ్ముకొని వ్యాపారం చేద్దాము' అని రంగయ్య సలహా ఇస్తాడు. 'సలహా బాగుందిరా. రేపు ఉదయమే అంగడికి వెళ్లి బర్రెలను కొనుక్కొని వద్దాము' అని నిర్ణయించుకున్నారు.

మరుసటి రోజు ఉదయమే మర్రి చెట్టు వద్దకు వెళ్లి చలమయ్య కోసం ఎదురు చూశాడు రంగయ్య. చలమయ్య ఎంతకు రాకపోయేసరికి తాను ఒక్కడే అంగడికి వెళ్లి బర్రెను కొనుక్కొని వచ్చాడు. పాల వ్యాపారం మొదలుపెట్టాడు. వ్యాపారం పెరిగింది. ఒక బర్రె నుండి పదుల సంఖ్యలో పెరిగాయి. బర్రెలను సాకుతున్న దగ్గర నుంచి రంగయ్యకు తీరిక లేకుండా పోయింది.

చలమయ్య ఒక్కడే చెట్టు కింద కూర్చుని వచ్చే వాళ్ళతో ముచ్చట్లు పెడుతూ కాలం వెళ్ళదీసేవాడు. ఎప్పుడో ఒకప్పుడు రంగయ్యే తన దగ్గరకు వస్తాడని ఎదురుచూశాడు. కానీ, పాల వ్యాపారంలో రంగయ్య తీరికలేకుండా ఉన్నాడు. అతన్ని చూసి గ్రామస్తులు మెచ్చుకుంటున్నారు. దీంతో, చలమయ్య ఇప్పటికైనా మారకపోతే ఈ ఊరు నన్ను ఓ అసమర్థుడిలా భావిస్తుందని భయపడ్డాడు. మరుసటి రోజు తెల్లవారుజామునే ఓ బర్రెను కొనుక్కోవడానికి అంగడికి బయలుదేరాడు.

– భూక్యా గణేష్, 10వ తరగతి,
63053 93291.

నేను గీసిన బొమ్మ





నూర్ భాషా మహమ్మద్ ఫరీద్,
4వ తరగతి,
ఎంపీపీ స్కూలు,
సత్తెనపల్లి,
పల్నాడు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మహిళలూ ఇవి తినండి ...

ఇంట్లో, ఆఫీసుల్లో ఎడతెగని పని ఒత్తిడితో సతమతమయ్యే మహిళలు క్రమం తప్పకుండా అవసరమైన విటమిన్లు లభించే పోషకాహారం తీసుకోవాలి. హిమోగ్లోబిన్ ఏర్పడటానికి ఐరన్, ఎముకల నిర్మాణానికి కాల్షియం, రోగనిరోధక శక్తికి జింక్ మొదలైనవి శరీరానికి చాలా అవసరం. మరి అవన్నీ అందాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకుందామా!

'బి' విటమిన్లు : 40 ఏళ్ల వయస్సులో పడుతున్న ఆడవాళ్లకు రోగనిరోధక శక్తి తగ్గుతూ వుంటుంది. నీరసం, నిస్సత్తువకు లోనవుతారు. కాబట్టి బి విటమిన్లు అధికంగా లభించే ముదురు ఆకుపచ్చ ఆకుకూరలు, కూరగాయలు, పాలు, చేపలను తప్పనిసరిగా ఆహారంలో చేర్చుకోవాలి.

అయోడిన్ : అయోడిన్ అధికంగా ఉండే దానిమ్మ, పెరుగు, స్ట్రాబెర్రీ, బంగాళదుంప వంటివి తినాలి. చేపలు, రొయ్యలు, గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు, మాంసం ద్వారా కూడా అయోడిన్‌ను పొందవచ్చు. నీళ్ల ఎక్కువగా తాగాలి. థైరాయిడ్ సమస్య ఉన్నట్లయితే.. తప్పకుండా వైద్యులు, ఆహార నిపుణులు సూచించే ఆహారాన్ని మాత్రమే డైట్‌గా తీసుకోవాలి.

ఫోలేట్ : దీన్ని ఫోలిక్ యాసిడ్ అని కూడా అంటారు. కణాల అభివృద్ధికి, డిఎన్ఎ, ఆర్ఎన్ఎ, ఏర్పడటానికి ఫోలేట్ అవసరం అవుతుంది. 25 ఏళ్ల పైబడిన వారు సిట్రస్ పండ్లు, కిడ్నీ బీన్స్, గుడ్లు వంటి ఆహారాలను క్రమం తప్పకుండా ఆహారంలో చేర్చుకోవాలి.

కాల్షియం, విటమిన్ డి : వృద్ధాప్యంలో ఎముకల క్షీణత సాధారణం. అందుకే 40 ఏళ్ల పైబడిన మహిళలు ఎముకల్లో పగుళ్ళ, గాయాల బారిన



పడకుండా ఉండాలంటే.. రోజూ 1200 మి.గ్రా. కాల్షియం, 600 మి.గ్రా. డి విటమిన్ అవసరం అవుతుంది. పాలు, గుడ్లలో పుష్కలంగా ఇవి లభిస్తాయి. ఎముకల బలానికి, కండరాలు, నాడీ వ్యవస్థ అభివృద్ధికి కాల్షియం అవసరం. యుక్త వయస్సులోని ఆడపిల్లలకు ఎముక సాంద్రత పెరగాలంటే, కాల్షియం లభించే ఆహార పదార్థాలు తప్పనిసరిగా తీసుకోవాలి. లేదంటే ఎముకల అభివృద్ధిలో లోపాలు ఏర్పడతాయి. పాల ఉత్పత్తులు, సోయా, చేపలలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. సీ ఫుడ్, పప్పులు, తృణధాన్యాలైన రాగులు, గోధుమ, జొన్నల్లో విటమిన్ డి ఉంటుంది.

ఐరన్ : పీరియడ్స్ ప్రారంభమయ్యే వయసుకు వచ్చేనాటికి చాలామంది ఐరన్ లోపంతో బాధపడుతుంటారు. ఐరన్ లోపం ఉన్న మహిళలు బలహీనంగా ఉంటారు. ఇది ఇతర అనారోగ్యాలకు దారితీస్తుంది. అందుకే మహిళ శరీరానికి రోజుకు 18 మి.గ్రా ఐరన్ అందాలి. మాంసం, చేపలు, బచ్చలికూర, గుమ్మడి గింజలు, దానిమ్మలో ఇది పుష్కలంగా ఉంటుంది.

గొంతు నొప్పి తగ్గాలంటే ...



చలికాలంలో గొంతు నొప్పి, జలుబు, దగ్గు వేధిస్తుంటాయి. గొంతు నొప్పిని తగ్గించడానికి ఇంటి చిట్కాలను వాడితే మంచి ఫలితం ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

- గొంతు నొప్పి ఉన్నప్పుడు గోరువెచ్చని నీరు మాత్రమే తాగాలి. అలా చెయ్యడం వల్ల కఫం తగ్గుతుంది.
- గోరువెచ్చని నీటిలో వెనిగర్ వేసి గార్గింగ్ చేస్తే కూడా గొంతు నొప్పి, ఇన్ఫెక్షన్ త్వరగా నయమవుతుంది. వెనిగర్ లేకపోయినా, గోరువెచ్చని నీటిలో ఉప్పు వేసి కూడా గార్గింగ్ చేసుకోవచ్చు.
- నీటిలో 4, 5 మిరియాలు, కొన్ని తులసి ఆకులను వేసి మరిగించాలి. ఈ కషాయాన్ని రాత్రి నిద్రపోయేటప్పుడు తాగితే బాగా ప్రయోజనకరంగా ఉంటుంది. గొంతునొప్పి త్వరగా నయమవుతుంది.
- మిరియాల పొడిలో కొంచెం నెయ్యి కలిపి తింటే ప్రయోజనకరంగా ఉంటుంది.
- నల్ల మిరియాలతోపాటు బాదంపప్పును కలిపి నూరి కొంచెం నీటిలో కలిపి సేవించడం వల్ల కూడా గొంతు వ్యాధులు నయమవుతాయి.
- ఏమైనా మందులు వాడాల్సి వచ్చినప్పుడు డాక్టర్‌ను సంప్రదించి తగు జాగ్రత్తలను తీసుకోవడం మంచిది.
- ఆహార పదార్థాలు వేడిగా ఉన్నప్పుడే తినాలి.

దోసకాయల్లో అధిక పోషకాలు



దోసకాయల్లో అధిక పోషకాలు ఉంటాయి. కూరగాయ గాను ఫలం గానూ దీనికి వాడుతుంటాం. ఎక్కువ పోషకాలు, తక్కువ కేలరీలు, ఎక్కువ శాతం నీళ్ల, ఎక్కువ ఫైబర్ అన్నీ కలిపి ఉన్న దోసకాయ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. బరువు తగ్గడానికి దోసకాయ చాలా సాయం చేస్తుంది. 300 గ్రాముల దోసకాయలో 11 ఔన్సుల కేలరీలు మాత్రమే ఉంటాయి. దోసకాయలను తింటే శరీరం బరువెక్కకుండా తేలికగా ఉంటుంది. శరీరంలో నీటి శాతాన్ని పెంచి డీ హైడ్రేషన్‌ను గురికాకుండా చాలా ఉపయోగపడతాయి. వీటిలో నీరు ఎక్కువగా ఉండటం వల్ల శరీరంలోని మలినాలన్నీ బయటకు పోతాయి. శరీరంలో సరైన పాళ్లలో నీటిశాతం ఉంటే జీవక్రియ పనితీరు మెరుగు అవుతుంది. శరీరంలో చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది. తక్కువ కేలరీలు, ఎక్కువ నీరు రక్తంలోని చక్కెర శాతాన్ని తగ్గించి ఆరోగ్యంగా ఉంచుతుంది. అధిక శాతం పోషక విలువలున్న దోసకాయలను దాని తోలు తీయకుండానే తింటే ఎంతో మంచిది. తోలు తీసేసి తినటం వల్ల అందులో ఉండే ఫైబర్ శాతం తగ్గిపోతుంది. చలికాలంలో చర్మం పొడిబారకుండా ఉండేందుకు దోసకాయ ఉపయోగపడుతుంది. చర్మంపై మచ్చలు పోవటానికి దోసకాయను తేనెతో కలిపి ముఖానికి రాసుకోవాలి.

రంగవల్లి





జాస్తి భాగ్యలక్ష్మి,
బంటుమిల్లి,
6301343104,
కృష్ణా జిల్లా.

11 నుండి 6 చుక్కలు (మధ్య చుక్క)

మా చిరునామా :
మెయిల్ ఐడి : jeevanapageps@ gmail.com
వాట్సాప్ : 83329 25496



డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో నిరసన తెలుపుతున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు

అంగన్‌వాడీలకు విశాల మద్దతు

సమ్మె శిబిరాల్లో చిన్నారులు, తల్లిదండ్రులు

ప్రజాశక్తి- యంత్రాంగం

అంగన్‌వాడీల నిరవధిక సమ్మె ఆరో రోజూ కొనసాగింది. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ రెట్టించిన ఉత్సాహంతో తహశీల్దార్, ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారు. వారి ఆందోళనకు విశాల మద్దతు లభించిది. అంగన్‌వాడీల చిన్నారులు, వారి తల్లిదండ్రులు మద్దతు తెలిపారు. సమ్మె శిబిరాల్లో వారు కూడా కూర్చున్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, మహిళలు ప్లకార్డులు ప్రదర్శించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఈ దృశ్యాలు కనిపించాయి. పలు జిల్లాల్లో ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను ఆమోదించి సమ్మెను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 'జగన్ మావయ్య... మా ఆయమ్మకు జీతాలు పెంచండి ప్లీజ్' అంటూ ఓ చిన్నారి పలకపై రాసి బాపట్ల జిల్లా చీరాలలోని అంగన్‌వాడీ సమ్మె శిబిరంలో ప్రదర్శించింది. ఆదివారం కూడా అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టడానికి అధికారులు ప్రయత్నించారు. వీటిని ప్రజలు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అన్నమయ్య జిల్లా సుండుపల్లిలో ఐసిడిఎస్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ చిన్నగొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని అధికారులు తెరిచారు. ఈ చర్యను స్థానికులు నిరసించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని అన్నపూర్ణ థియేటర్ సమీపంలోగల అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగల గొట్టడానికి వచ్చిన అధికారులను ప్రజలతో కలిసి అంగన్‌వాడీలు, సిపిఎం నాయకులు అడ్డుకున్నారు. దీంతో, అధికారులు వెనుదిరిగారు. మంగళగిరి మండలం ఆత్మకూరు అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగలగొట్టడానికి వచ్చిన సచివాలయ సిబ్బందిని ప్రజాసంఘాల నాయకులు అడ్డుకున్నారు. తాళాలు పగలగొట్టనీయకుండా ఉండవల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న సిపిఎం, టిడిపి, జనసేన, అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు.



విశాఖలో

సింగ్ ఈజ్ కింగ్

• అర్షదీప్ దెబ్బకు సఫారీ విలవిల • తొలి వన్డేలో భారత్ ఏకపక్ష విజయం



జొహనెస్‌బర్గ్ : వాండరర్స్‌లో భారత పేసర్లు అర్షదీప్ సింగ్ (5/37), అవేశ్ ఖాన్ (4/27) నిప్పులు చెరిగారు. అర్షదీప్ సింగ్ స్వింగ్ బంతులతో, అవేశ్ ఖాన్ పేస్‌తో చెలరేగటంతో ఆతిథ్య దక్షిణాఫ్రికా 116 పరుగులకే కుప్పకూలింది. 27.3 ఓవర్లలోనే దక్షిణాఫ్రికా కథ ముగిసింది. టెయిలెండర్ అండిల్ ఫెలుక్‌వయో (33 49 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), టోనీ డీ జార్జీ (28, 22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) సఫారీలకు గౌరవప్రద స్కోరు అందించారు. స్వల్ప లక్ష్యాన్ని టీమ్ ఇండియా అలవోకగా ఛేదించింది. సాయి సుదర్శన్ (55 నాటౌట్, 43 బంతుల్లో 9 ఫోర్లు), శ్రేయస్ అయ్యర్ (52, 45 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో 16.4 ఓవర్లలోనే భారత్ ఛేదించింది. మరో 200 బంతులు మిగిలి ఉండగానే 8 వికెట్ల తేడాతో ఏకపక్ష విజయం నమోదు చేసింది. ఐదు వికెట్ల వీరుడు అర్షదీప్ సింగ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. మూడు మ్యాచుల వన్డే సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యం సాధించింది. భారత్, దక్షిణాఫ్రికా రెండో వన్డే మంగళవారం పోర్ట్ ఎలిజబెత్‌లో జరుగనుంది.

అర్షదీప్ అదుర్స్ : టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న సఫారీకి అర్షదీప్, అవేశ్ చుక్కలు చూపించారు. తొలి స్పెల్‌లో పరిస్థితులకు అలవాటు పడేందుకు ఇబ్బంది పడిన అర్షదీప్.. రెండో స్పెల్‌లో వికెట్ల జాతర సాగించాడు. హెండ్రిక్స్ (0), వాన్‌డర్ డసెన్ (0), క్లాసెన్ (6), టోనీ (28), ఫెలుక్‌వయో (33) అర్షదీప్ దెబ్బకు పెవిలియన్ బాట పట్టారు. 52 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా.. 116 పరుగులకే కుప్పకూలింది. సొంతగడ్డపై సఫారీలకు ఇదే అత్యల్ప స్కోరు కావటం విశేషం. దక్షిణాఫ్రికాలో ఆ జట్టుపై ఐదు వికెట్లు కూల్చిన తొలి పేసర్‌గా అర్షదీప్ నిలిచాడు. అవేశ్ ఖాన్ సైతం నాలుగు వికెట్లతో చెలరేగాడు. పదో వికెట్‌ను కుల్దీప్ యాదవ్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక ఛేదనలో ఓపెనర్ రుతురాజ్ (5) విఫలమైనా.. శ్రేయస్ (52), అరంగ్రేట సాయి సుదర్శన్ (55) అర్ధ సెంచరీలతో మెరిశారు.

సఫారీలతో టెస్టు సిరీస్‌కు ఇషాన్ కిషన్ దూరం

• కెఎస్ భరత్‌కు అవకాశం

ముంబయి: దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు భారత్ మరో కీలక ఆటగాడు దూరమయ్యాడు. ఇషాన్ కిషన్ కూడా రెండు టెస్టుల సిరీస్‌కు అందుబాటులో ఉండలేనని బిసిసిఐకి సమాచారం ఇచ్చాడు. దీంతో అతడికి విశ్రాంతినిచ్చిన మేనేజ్‌మెంట్ తెలుగు కుర్రాడు కేఎస్ భరత్‌కు అవకాశం కల్పించింది. ఇషాన్ స్థానంలో భరత్‌ను ఎంపిక చేసినట్లు బిసిసిఐ ప్రకటించింది. కాగా, శనివారం షమీ తన ఫిట్‌నెస్ నిరూపించుకోలేకపోవడంతో టెస్టు సిరీస్‌కు దూరమైన సంగతి తెలిసిందే. ఇషాన్ కిషన్ దూరం కావడానికి కారణాలను బిసిసిఐ వెల్లడించలేదు. వ్యక్తిగత కారణాల వల్ల దూరంగా ఉంటున్నట్లు మాత్రమే పేర్కొంది.

"దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్ కోసం ఎంపిక చేసిన స్క్వాడ్ నుంచి విడుదల చేయాలని టీమ్ఇండియా యువ ఆటగాడు ఇషాన్ కిషన్ బిసిసిఐకి విజ్ఞప్తి చేశాడు. వ్యక్తిగత కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాడు. దీంతో ఇషాన్‌ను టెస్టు స్క్వాడ్ నుంచి తప్పించడం జరిగింది. అతడి స్థానంలో కేఎస్ భరత్‌ను ఎంపిక చేశాం. భరత్ త్వరలోనే జట్టుతో చేరతాడు" అని



బిసిసిఐ ప్రకటన వెలువరించింది. డిసెంబర్ 26 నుంచి 30 వరకు, జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు భారత్, దక్షిణాఫ్రికా మధ్య రెండు టెస్టు మ్యాచ్‌లు జరుగుతాయి.

దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు భారత జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్, సిరాజ్, ముకేశ్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రా (వైస్ కెప్టెన్), ప్రసిధ్ కృష్ణ, కేఎస్ భరత్ (వికెట్ కీపర్).



పెర్త్‌లో పాక్ చిత్తు

• 360 పరుగుల తేడాతో ఆసీస్ గెలుపు

పెర్త్ (ఆస్ట్రేలియా) : స్వదేశీ సమ్మర్ సీజన్‌ను ఆస్ట్రేలియా ఘనంగా ఆరంభించింది. పెర్త్ టెస్టులో పాకిస్థాన్‌ను చిత్తు చేసిన కంగారూలు 360 పరుగుల తేడాతో ఘన విజయం సాధించారు. 450 పరుగుల ఛేదనలో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాట్ పట్టిన పాకిస్థాన్..30.2 ఓవర్లలో 89 పరుగులకే కుప్పకూలింది. ఆసీస్ పేసర్లు మిచెల్ స్టార్క్ (3/31), జోశ్ హేజిల్‌వుడ్ (3/13) నిప్పులు చెరుగగా.. స్పిన్నర్ నాథన్ లయాన్ (2/18) మాయ చేశాడు. ఇమామ్ (10), బాబర్ (14), షకీల్ (24) మాత్రమే రెండెంకల స్కోరు సాధించారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 487 పరుగుల భారీ స్కోరు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌ను 233/5 వద్ద డిక్లరేషన్ ఇచ్చింది. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 271 పరుగులే చేసింది. మూడు మ్యాచుల టెస్టు సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0 ఆధిక్యం సాధించింది. శతక హీరో డెవిడ్ వార్నర్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68